సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
సోమవారం, 20.04.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 178
పేజీలు: 12 వెల: రూ. 5


# అప్రమత్తంగా ఉండాలి

## వాతావరణ శాఖ హెచ్చరిక

- ఉరుములు, మెరుపులతో వర్షా లు
- పలుజిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్
- గంటకు 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు.. !
- సాయంత్రాల్లో వడగళ్ల వానలు
- జనజీవనానికి అంతరాయం
- పగటిపూట రికార్డు స్థాయిలో ఎండల తీవ్రత
- ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు

10




# డ్రగ్స్ కట్టడికి ముమ్మర చర్యలు

## విద్యా సంస్థల్లో అవగాహన కల్పించండి

- విద్యార్థులతో ప్రమాణం చేయిద్దాం..
- డ్రగ్స్ దూరంగా ఉంటామని ప్రమాణపత్రం తీసుకోండి
- సీఎం రేవంత్ రెడ్డికి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచన
- తగిన చర్యలు తీసుకుంటానన్న సీఎం

10



# అభినవ గోబెల్స్ రేవంత్ రెడ్డి

## కేంద్ర మంత్రి బండి సంజయ్

- అబద్ధాల పునాదులపైనే సీఎం అయ్యారు
- అనేక హామీలతో మహిళలను ముంచారు
- పార్లమెంట్‌లో బిల్లును అడ్డుకొని ద్రోహం చేశారు
- కేసీఆర్ తీరుగానే అరాచక పాలన

03



# సీఎంపై వ్యక్తిగత వ్యాఖ్యలు వద్దు

## మీడియా సమావేశంలో మంత్రి అడ్లూరి..

- మహిళా బిల్లు పార్లమెంటులో పెడితే కాంగ్రెస్ మద్దతు..
- మేడిగడ్డ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలి..

03





# అమ్మను తలపిస్తోన్న అన్న క్యాంటీన్ల సేవలు

## లక్షల మంది పేదల కడుపు నింపే మహోన్నత కార్యక్రమం

- రూ.5 లకే పరిశుభ్ర వాతావరణంలో గౌరవంగా పేదలకు భోజనం: నారా భువనేశ్వరి
- బాబు జన్మదినం సందర్భంగా అన్న క్యాంటీన్ల కు రూ.76 లక్షల విరాళం ఇచ్చిన సీఎం సతీమణి
- విరాళంతో రేపు రాష్ట్ర వ్యాప్తంగా 269 అన్న క్యాంటీన్లలో ఉచితంగా భోజనం

10



# రైతులకు ఊరట

## అదును చూసి అమ్ముకోవచ్చు



- తెలంగాణలో శీతల గిడ్డంగుల నిర్మాణానికి శ్రీకారం
- కోల్డ్ స్టోరేజీలతో రైతులకు లాభాలు
- పంట వృథాకు చెక్..
- రూ.10 కోట్లతో ఖమ్మంలో భారీ కోల్డ్ స్టోరేజీ..
- ఉద్యాన రైతులకు బిగ్ బూస్ట్..
- కోల్డ్ స్టోరేజీలు, కొత్త ఉద్యాన కళాశాల ఏర్పాటు
- సర్కారు కీలక నిర్ణయం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో ఉద్యాన పంటల నిల్వ కోసం ప్రభుత్వ రంగంలో తొలిసారి శీతల గిడ్డంగులను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఖమ్మం జిల్లా వెంకటాయపాలెంలో రూ. 10 కోట్లతో నిర్మిస్తున్న పదివేల టన్నుల సామర్థ్యం గల స్టోరేజీ త్వరలో ప్రారంభం కానుంది. మరో 10కి పైగా జిల్లాల్లో స్థల సేకరణ జరుగుతోంది. దీనివల్ల మిర్చి, కూరగాయల రైతులు పంటను నిల్వ చేసుకుని.. మార్కెట్‌లో మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకునే అవకాశం కలుగుతుంది. తద్వారా పంట వృథా అరికట్టి రైతులకు లాభాలు చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యం. తెలంగాణలోని మిర్చి, కూరగాయలు, పండ్లు, పూల రైతులకు ఎదురవుతున్న అతిపెద్ద సమస్య స్టోరేజీ లేకపోవటం. పంట కోసిన వెంటనే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండటంతో.. మార్కెట్‌లో ధర తక్కువగా ఉన్నా రైతులు నష్టానికి విక్రయిస్తున్నారు. కొన్నిసార్లు పంట పాడైపోయి పారబోయాల్సి వస్తోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళికతో ముందుకు వచ్చింది. ఇప్పటివరకు రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో శీతల గిడ్డంగులు లేని లోటును భర్తీ చేస్తూ.. యుద్ధ ప్రాతిపదికన మిగతా 02లో




# బిగ్ డే..

## ఉత్తరాన రాజకీయ యుద్ధం ఒకే జిల్లాకు ఇద్దరు ఉద్దండులు

- జగిత్యాలకు కేసీఆర్.. మేడిగడ్డకు సీఎం రేవంత్
- ముందుగా సీఎం మీటింగ్
- ఆ తర్వాతే ప్రసంగించనున్న కేసీఆర్
- ఇరువురిదీ వైఫల్యాల విమర్శలే
- ఆసక్తికరంగా ఏప్రిల్ 20

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఉత్తర తెలంగాణ వేడెక్కింది. ఇప్పటికే 44 డిగ్రీల ఎండలతో విలవిల్లాడుతుంటే.. నేడు రాజకీయ వేడి డబుల్ కానుంది. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయంగా తలపడేందుకు రంగం సిద్ధమైంది. ఒకే రోజు ఇద్దరు లీడర్లు ఉత్తమ తెలంగాణ పర్యటనతో రాజకీయాన్ని హీటెక్కించబోతున్నారు. భానుడి భగభగలను మించి ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాలు ఇప్పుడు రణరంగాన్ని తలపిస్తున్నాయి. ఒకేరోజు అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల అధినేతలు తమ బలప్రదర్శనకు సిద్ధమవుతున్నారు. తూర్పున కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలను ఎండగట్టి గులాబీ పార్టీని ఇరుకున పెట్టేందుకు రేవంత్‌రెడ్డి, పశ్చిమాన ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు కేసీఆర్ ఒకేరోజు పర్యటనలు ఖరారు చేసుకోవడం రాజకీయ ఉత్కంఠ రేపుతోంది.

**ఏడాది తర్వాత సభకు..**

గులాబీ బాస్ కేసీఆర్ చాలా కాలం తరువాత బహిరంగ సభలో పాల్గొంటుండటంతో సర్వత్రా ఆసక్తినెలకొంది. కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నారు. ఈ చేరిక కార్యక్రమం నేపథ్యంలో జగిత్యాలలో ఈనెల 20న భహిరంగ సభ ఏర్పాటు చేశారు. గులాబీ బాస్ కేసీఆర్ ఈ సభకు హాజరై జీవన్ రెడ్డికి గులాబీ కండువా కప్పి పార్టీలో చేర్చుకోనున్నారు. దాదాపు యేడాది తరువాత కేసీఆర్ బహిరంగ సభలో పాల్గొంటుండటంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. గత ఏడాది ఏప్రిల్ 27న పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల నేపథ్యంలో వరంగల్ లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న కేసీఆర్, మళ్లీ తరువాత ఎక్కడా సభలకు హాజరు కాలేదు. ఇప్పుడు జగిత్యాల సభకు హాజరు అవుతుండటంతో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటు కాంగ్రెస్ సర్కార్ పాలనకు సగం కాలం పూర్తయ్యింది.

దీంతో రేవంత్ ప్రభుత్వంపై కేసీఆర్ సంధించే విమర్శల బాణాలు ఎలా ఉంబోతున్నాయనేది ఇప్పుడు హాట్ టాపిక్. ముఖ్యంగా పార్టీ ఫిరాయింపులపై ఎలాంటి కామెంట్స్ చేయనున్నారనే ఆసక్తి నెలకొంది. కేసీఆర్ జగిత్యాల బహిరంగ సభరోజునే సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డను మిగతా 02లో


# మల్కాజిగిరి రికార్డు

## దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గం

- మల్కాజిగిరిలో 37 లక్షలు.. లక్షద్వీప్‌లో కేవలం 58 వేల ఓటర్లు!
- దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల ఓటర్ల సంఖ్యలో భారీ వ్యత్యాసం
- అధిక ఓటర్లతో ఎంపీలపై పెరుగుతున్న ప్రజా సేవల భారం
- డీలిమిటేషన్ అవసరంపై మళ్లీ చర్చకు దారి తీసిన గణాంకాలు
- లోక్‌సభ స్థానాల మధ్య ఓట్ల అంతరంపై అమిత్ షా కీలక వ్యాఖ్యలు
- ఓటర్ల సమతుల్యం కోసం కేంద్రం హేతుబద్ధీకరణ చర్యలపై దృష్టి

**ముద్ర డెస్క్:**

దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఓటర్ల సంఖ్యలో గణనీయమైన అసమానతలు ఉన్నాయనే అంశం మరోసారి చర్చకు దారి తీసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవల లోక్‌సభలో మాట్లాడుతూ ఈ వ్యత్యాసాలపై ఆందోళన వ్యక్తం చేశారు. అధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గాల ఎంపీలు ప్రజల సమస్యలను సమర్థంగా పరిష్కరించడం కష్టంగా మారుతోందని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఓటర్ల పంపిణీని సమతుల్యం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మిగతా 02లో







# మరో జలసంధికి ముప్పు..

## బాబ్ అల్ మాండెబ్‌ను మూసేస్తామన్న హూతీలు!

- అమెరికా-ఇజ్రాయెల్ చర్యలపై హూతీల కఠిన వైఖరి
- సూయజ్ మార్గానికి ముప్పు.. గ్లోబల్ ట్రేడ్‌కు పెద్ద షాక్ సూచనలు
- ఎర్ర సముద్రంలో ఉద్రిక్తతలు పెరుగుతుండగా అంతర్జాతీయ ఆందోళన

10





# బ్యాంకు అధికారుల అండతో సైబర్ మోసాలు

## ఆపరేషన్ అక్టోపస్ 2.0తో గుట్టురట్టు

- 9 రాష్ట్రాల్లో హైదరాబాద్ పోలీసుల దాడులు
- 32 మంది బ్యాంకు అధికారులతో సహా 52 మంది అరెస్ట్
- రూ. 150 కోట్ల మేర మోసాలు.. 850 కేసులతో సంబంధం

03

# క్రికెట్ ఖలేజా.. ఐపీఎల్ మజా!

## ఐపీఎల్ ఎలా పుట్టింది? ఇంత పెద్దగా ఎలా ఎదిగింది?


గల్లీ నుంచి గ్లోబల్ దాకా.. బిలియన్ డాలర్ విప్లవ గాథ

11




## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 20.04.2026
www.mudranews.in | @mudranews



### ఈత పండ్లు : తక్షణ శక్తి అందిస్తుంది




* గ్లూకోజ్, ఫ్రక్టోజ్ వంటి సహజ చక్కెరలు వెంటనే ఎనర్జీ ఇస్తాయి
* అలసటగా ఉన్నప్పుడు తింటే వెంటనే ఉత్సాహం వస్తుంది

# బిగ్ డే..

(మొదటి పేజీ తరువాయి)

సందర్శించబోతున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించి, వాటిని తిరిగి వినియోగంలోకి తీసుకురావడానికి మరమ్మతులు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు.

ఈ నేపథ్యంలో స్వయంగా మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించాలని రేవంత్ రెడ్డి నిర్ణయించుకున్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ఒక్కసారి మాత్రమే మేడిగడ్డ బ్యారేజీ దగ్గరకు వెళ్లారు. సరిగ్గా రెండేళ్ల క్రితం 2024, ఫిబ్రవరి 13న కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి అంటూ.. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడంపై అధ్యయనం చేయడానికి ఆయన మొదటిసారి వెళ్లారు. తన కేబినెట్ మంత్రులతో పాటు ఎమ్మెల్యేలతో కలిసి ప్రత్యేక బస్సుల్లో అక్కడికి వెళ్లి పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ తరువాత రేవంత్ రెడ్డి మళ్లీ మేడిగడ్డ బ్యారేజ్ దగ్గరకు వెళ్లలేదు. పైగా కాళేశ్వరం ప్రాజెక్టును కూళేశ్వరంగా అభివర్ణిస్తూ వస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. కేసీఆర్ తో పాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తూ వస్తున్నారు. ఎప్పుడు అవకాశం వచ్చినా, సందర్భం ఏదైనా కాళేశ్వరంపై విమర్శలు గుప్పిస్తూ వస్తున్నారు. కాళేశ్వరంపై ప్రభుత్వం వేసిన రిటైర్డ్ జడ్జి విచారణ పూర్తై నివేదిక అందడం, అలాగే దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తున్నట్టు అసెంబ్లీలో ప్రకటన తర్వాత..రేవంత్ కాళేశ్వరం టూర్ పట్ల సర్వత్రా ఆసక్తి నెలకొంది.




### అసలేమిటి వ్యూహం

కేసీఆర్ జగిత్యాలలో బహిరంగ సభ నిర్వహించడం, అదేరోజు సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డ బ్యారేజీని సందర్శించడం వెనుక బలమైన రాజకీయ వ్యూహం ఉందన్న చర్చ జరుగుతోంది. ఇది ఒక రకమైన మైండ్ గేమ్‌గా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. కాంగ్రెస్ కు రాజీనామా చేసిన జీవన్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరుతుండటంతో ఆ పార్టీకి ఇది కీలకమైన మలుపు. దీనికి పోటీగా సీఎం రేవంత్ రెడ్డి అదే రోజు పర్యటన పెట్టుకోవడం ద్వారా మీడియా ఫోకస్‌తో పాటు ప్రజల దృష్టి కేసీఆర్ వైపు ఉండకుండా తన వైపునకు తిప్పుకోవాలని కాంగ్రెస్ భావిస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. బీఆర్ఎస్ హయాంలో నిర్మాణమైన కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలను, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటును ప్రజలకు మరోసారి గుర్తుచేయడం రేవంత్ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. సభలో ప్రభుత్వంపై కేసీఆర్ చేసే విమర్శలకు..కాళేశ్వరం వేదికగా అక్కడికక్కడే క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను చూపిస్తూ కౌంటర్ ఇవ్వాలనేది రేవంత్ రెడ్డి ఆలోచన తెలుస్తోంది.

### ప్లాన్.. రివర్స్ ప్లాన్

జగిత్యాల, మేడిగడ్డ రెండూ ఉత్తర తెలంగాణ పరిధిలోకి వస్తాయి. ఇక్కడ పట్టు నిరూపించుకోవడం రెండు పార్టీలకూ చాలా కీలకం. అందుకే జగిత్యాల సభ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని గాలికొదిలేసిందని, కేవలం విచారణల పేరుతో కాలయాపన చేస్తోందని విమర్శించడం ద్వారా ప్రజా మద్దతును కూడగట్టాలని కేసీఆర్ ప్లాన్. ఇదే సమయంలో గత బీఆర్ఎస్ పాలకుల తప్పులను సరిదిద్దుతున్నాం అనే సంకేతాన్ని అక్కడి ప్రజల్లోకి తీసుకెళ్లాలని రేవంత్ రివర్స్ ప్లాన్. కేసీఆర్ జగిత్యాల సభ ద్వారా వచ్చే మైలేజీని తగ్గించడానికి రేవంత్ రెడ్డి మేడిగడ్డ పర్యటనను, అక్కడ ఆయన చేసే ప్రసంగాన్ని వాడుకోనున్నారని తెలుస్తోంది. ఇది ఖచ్చితంగా తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షం, అధికార పార్టీల మధ్య జరుగుతున్న రాజకీయ ఆధిపత్య పోరుగానే మారింది.

### రేవంత్ కౌంటర్ అటాక్

కేసీఆర్ సభ జరుగుతున్న రోజే.. మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతుల పరిశీలనకే పరిమితం కాకుండా, కాటారం – మహాదేవపూర్ మార్గంలోని నస్తూరుపల్లి వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభ ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన లోపాలను ఎత్తిచూపుతూ కేసీఆర్‌పై నేరుగా రాజకీయ దాడి చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. మంత్రి శ్రీధర్‌బాబు ఈ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

### ముందుగా మాట్లాడేది ఎవరు..?

మేడిగడ్డ పర్యటన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ముందుగా ప్రసంగించనున్నారు. సాయంత్రం 5 గంటల వరకు సీఎం పర్యటనను అధికారులు ఖరారు చేశారు. దీంతో సీఎం టూర్ త్వరగా ముగియనున్నట్టే. కానీ, జగిత్యాల కేసీఆర్ సభ మాత్రం సాయంత్రం 5 గంటలకు మొదలవుతోంది. ఒక్కో నేత వచ్చి మాట్లాడుతారు. అంటే.. కేసీఆర్ చేరుకుని మాట్లాడేందుకు ఇంకో గంట. దీని ప్రకారం సీఎంకు కేసీఆర్ కౌంటర్ ఇచ్చే అవకాశమే. కానీ, రేవంత్ వ్యాఖ్యలను ఇప్పటి వరకు కేసీఆర్ పెద్దగా పట్టించుకోలేదు. అందుకే ఇప్పుడు ప్రభుత్వ వైఫల్యాలనే ప్రధానంగా తీసుకుని ప్రసంగించే అవకాశం ఉంది.

### ఒక్కటవుతున్న ప్రత్యర్థులు

తెలంగాణ మలి దశ ఉద్యమం కరీంనగర్ నుంచే ప్రారంభమైంది. కరీంనగర్ నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచిన కేసీఆర్.. తనపై రెండుసార్లు పోటీ చేసిన జీవన్‌రెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకోవడానికి ఈనెల 20న సోమవారం జగిత్యాలకు వస్తున్నారు. ఇన్నాళ్లు మౌనంగా ఉన్న కేసీఆర్ ఈసారి తనదైన శైలిలో రాష్ట్రపరిస్థితులపై మాట్లాడే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో జగిత్యాలలో కేసీఆర్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా కాంగ్రెస్ సీనియర్ నేత అయిన జీవన్‌రెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకునే ప్రయత్నం రాజకీయ సమీకరణాలను మార్చే అవకాశముంది. కాంగ్రెస్‌లో నాలుగు దశాబ్దాల పాటు పనిచేసిన నాయకులు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపడంతో పార్టీలో కొంత కలకలం రేపుతోంది. కేసీఆర్ జగిత్యాలలో చేసే ప్రసంగం, పార్టీ భవిష్యత్ వ్యూహాన్ని వెల్లడించే అవకాశముంది. ఆయన ప్రభుత్వం మీద చేసే విమర్శలు, కాంగ్రెస్ పాలనలో లోపాలను ఎత్తిచూపే ప్రయత్నం చేస్తారని అంచనా.

### కేసీఆర్ టార్గెట్ ఎవరు? రేవంత్, మోడీ?

సుదీర్ఘ విరామం తర్వాత పబ్లిక్ మీటింగ్‌కు హాజరు కాబోతున్న కేసీఆర్.. ఈ సభ ద్వారా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయబోతున్నారు. అయితే ఇన్నాళ్లు పార్టీపై అధికార పక్షం తీవ్ర స్థాయిలో దాడి చేసినా మౌనంగా ఉన్న కేసీఆర్ జగిత్యాల సభ ద్వారా తన ప్రత్యర్థులకు ఎలాంటి కౌంటర్ ఇవ్వబోతున్నారు అనేది ఉత్కంఠగా మారింది. అసలు రేపటి సభలో ఆయన టార్గెట్ చేయబోయేది సీఎం రేవంత్ రెడ్డినా? లేక ప్రధాని మోడీనా అనేది సస్పెన్స్‌గా మారింది. ఇవేవి కాకుండా తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పరిణామాల దృష్ట్యా చంద్రబాబుపై విమర్శలు ఎక్కుపెడతారా అనేది వేచి చూడాలి.

# రైతులకు ఊరట..

(మొదటి పేజీ తరువాయి)

వీటి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో దీనిపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ తొలిసారిగా ఖమ్మం జిల్లా వెంకటాయపాలెంలో రూ. 10 కోట్ల వ్యయంతో పదివేల టన్నుల సామర్థ్యం గల శీతల గిడ్డంగిని నిర్మిస్తోంది. ఈ నిర్మాణం దాదాపు పూర్తి కావొచ్చింది. త్వరలోనే రైతులకు అందుబాటులోకి రానుంది. కేవలం ఖమ్మం జిల్లాకే పరిమితం కాకుండా భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి పలు జిల్లాల్లో కూడా ఈ కోల్డ్ స్టోరేజీలను నిర్మించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్థల సేకరణను ప్రారంభించింది.

శీతల గిడ్డంగుల వల్ల రైతులకు అదనపు ప్రయోజనాలు కలగనున్నాయి. మిర్చి, బంగాళాదుంప, ఉల్లి వంటి ఉత్పత్తులతో పండ్లు, పూల ఉత్పత్తులు, చేపలు వంటివి కూడా చెడిపోకుండా ఎక్కువ కాలం నిల్వ చేసుకోవచ్చు. మార్కెట్‌లో డిమాండ్ తక్కువగా ఉన్నప్పుడు పంటను ఇక్కడ భద్రపరుచుకుని ధర పెరిగినప్పుడు విక్రయించడం ద్వారా రైతులు గిట్టుబాటు ధరను పొందవచ్చు. కోల్డ్ స్టోరేజీల నిర్మాణం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రైతులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవడమే కాకుండా వినియోగదారులకు కూడా నిరంతరం తాజా ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు.

### తెలంగాణలో నాలుగో ఉద్యాన కళాశాల

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో కొత్తగా ఉద్యాన కళాశాల ఏర్పాటుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్ణయం తీసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి 30 మంది విద్యార్థులతో బీఎస్సీ ఉద్యాన కోర్సు ప్రారంభం కానుంది. రాజేంద్రనగర్, ములుగు, మోజెర్ల తర్వాత రాష్ట్రంలో ఇది నాలుగో ఉద్యాన కళాశాల కానుంది. ఉద్యాన పంటలకు పేరొందిన భద్రాద్రి జిల్లాలో ఈ కళాశాల ఏర్పాటు చేయడం వల్ల సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు రైతులకు శాస్త్రీయ మెళకువలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

# ‘మల్కాజిగిరి’ రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల సంఘం తాజా గణాంకాల ప్రకారం, కొన్ని లోక్‌సభ స్థానాల్లో ఓటర్ల సంఖ్య విపరీతంగా అధికంగా ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో చాలా తక్కువగా ఉంది. ముఖ్యంగా తెలంగాణలోని మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం దేశంలోనే అత్యధిక ఓటర్లతో మొదటి స్థానంలో నిలిచింది. ఈ నియోజకవర్గంలో సుమారు 37.80 లక్షల మంది ఓటర్లు నమోదై ఉండటం విశేషం. దీనితో పోలిస్తే, కర్ణాటకలోని బెంగళూరు నార్త్‌లో 32.15 లక్షలు, ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో 29.48 లక్షలు, గౌతమ్‌బుద్ధ నగర్‌లో 26.82 లక్షలు, వెస్ట్ ఢిల్లీలో 25.92 లక్షల ఓటర్లు ఉన్నారు. ఈ సంఖ్యలు పట్టణీకరణ, జనాభా పెరుగుదల ప్రభావాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి.

ఇదే సమయంలో, కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య చాలా తక్కువగా ఉండటం కూడా గమనార్హం. కేంద్ర పాలిత ప్రాంతమైన లక్షద్వీప్‌లో కేవలం 58 వేల మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. ఇది దేశంలోనే అత్యల్ప సంఖ్య. అలాగే దమన్ & దీవ్‌లో 1.34 లక్షలు, లడాఖ్‌లో 1.9 లక్షలు, దాద్రా & నగర్ హవేలీలో 2.83 లక్షలు, అండమాన్ & నికోబార్ దీవుల్లో 3.15 లక్షల మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. ఈ ప్రాంతాలు భౌగోళికంగా విస్తారంగా ఉన్నప్పటికీ జనసాంద్రత తక్కువగా ఉండటం దీనికి ప్రధాన కారణం.

ఈ అసమానతల కారణంగా ఎన్నికల ప్రాతినిధ్యం విషయంలో అసమతుల్యత ఏర్పడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. ఎక్కువ ఓటర్లు ఉన్న ప్రాంతాల్లో ఎంపీలు ప్రతి పౌరుడికి చేరువ కావడం కష్టమవుతుండగా, తక్కువ ఓటర్లు ఉన్న ప్రాంతాల్లో ప్రతినిధులు మరింత సమర్థంగా సేవలు అందించే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజన అవసరమని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

ప్రస్తుతం ప్రభుత్వం 131వ రాజ్యాంగ సవరణ వంటి అంశాలపై చర్చలు జరుపుతూ, నియోజకవర్గాల ఓటర్ల సంఖ్యను హేతుబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటామని సూచిస్తోంది. అయితే ఈ ప్రక్రియ రాజకీయంగా సున్నితమైనదిగా ఉండటంతో, అన్ని రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరం ఉంటుంది.

ఇక ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ పూర్తయ్యిన తర్వాత ఈ సంఖ్యల్లో కొంత మార్పు వచ్చే అవకాశముందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. మొత్తంగా చూస్తే, దేశంలో ప్రజాస్వామ్య ప్రాతినిధ్యాన్ని మరింత సమానంగా చేయడానికి ఈ అంశం కీలక చర్చగా మారింది.




# పవన్‌కు జరిగిన ఆపరేషన్ ఏంటి?

**ముద్ర డెస్క్ :**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆరోగ్యానికి సంబంధించిన వార్తలు గత కొద్ది గంటలుగా సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఆయనకు శస్త్రచికిత్స జరిగినట్లు అధికారికంగా ధృవీకరణ రావడంతో అభిమానులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అసలు ఆయనకు ఏమైంది? శస్త్రచికిత్స ఎందుకు చేయాల్సి వచ్చింది? ప్రస్తుతం ఆయన పరిస్థితి ఎలా ఉందనే వివరాలు జనసేన నుంచి కానీ పవన్ ఫ్యామిలీ నుంచి కానీ అధికారికంగా బయటకు రాలేదు. కేవలం అస్వస్థతతో శస్త్రచికిత్స జరిగిందనే సమాచారం మాత్రమే ఇచ్చారు.

అకస్మాత్తుగా అస్వస్థత.. ఏం జరిగింది?

శుక్రవారం ఉదయం విజయవాడలో ప్రభుత్వ అధికారులతో కీలకమైన సమీక్షా సమావేశంలో పాల్గొంటున్న సమయంలో పవన్ కళ్యాణ్ అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ముఖంలో నీరసం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కనిపించడంతో అధికారులు ఆందోళన చెందారు. పరిస్థితిని గమనించిన ఆయన వ్యక్తిగత సిబ్బంది వెంటనే వైద్యులకు సమాచారం అందించారు. వైద్యుల ప్రాథమిక సూచనల మేరకు తదుపరి అధికారిక కార్యక్రమాలన్నింటినీ తక్షణమే రద్దు చేసుకుని, ఆయనను ప్రత్యేక వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చేరిన వెంటనే నిపుణులైన వైద్య బృందం ఆయనకు పలు రకాల పరీక్షలు నిర్వహించింది. ముఖ్యంగా ఊపిరితిత్తులు, శ్వాసనాళాలకు సంబంధించిన ఇబ్బంది తీవ్రంగా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు.

### సైనసైటిస్ సమస్య.. శస్త్రచికిత్స నిర్ణయం

వైద్య వర్గాల నుండి అందిన సమాచారం ప్రకారం.. పవన్ కళ్యాణ్ గత కొంతకాలంగా తీవ్రమైన సైనసైటిస్ సమస్యతో బాధపడుతున్నారు. నిరంతరం రాజకీయ పర్యటనలు, ప్రజల మధ్య ఉండటం, దుమ్ము, కాలుష్యం కారణంగా ఈ సమస్య కాలక్రమేణా ముదిరినట్లు తెలుస్తోంది. దీనివల్ల ఆయన ముక్కు లోపల శ్వాస మార్గంలో ఆటంకాలు ఏర్పడి, ఆక్సిజన్ అందడం కష్టతరంగా మారింది. పరిస్థితిని సమీక్షించిన వైద్యులు, మందులతో కంటే శస్త్రచికిత్స ద్వారానే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నిర్ణయించారు. ఈ క్రమంలోనే ఆయనకు ముక్కుకు సంబంధించిన చిన్నపాటి శస్త్రచికిత్సను అత్యవసరంగా నిర్వహించారు. దాదాపు గంటన్నర పాటు సాగిన ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తయిందని వైద్యులు ప్రకటించారు.

### విశ్రాంతి తప్పనిసరి.. రాజకీయాలకు తాత్కాలిక విరామం

శస్త్రచికిత్స అనంతరం పవన్ కళ్యాణ్‌ను ప్రత్యేక వార్డుకు తరలించి పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు భరోసా ఇచ్చారు. అయితే కోలుకోవడానికి.. ఇన్ఫెక్షన్లు సోకకుండా ఉండటానికి ఆయనకు కనీసం ఒక వారం రోజుల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని వైద్యులు ప్రిస్క్రిప్షన్‌లో పేర్కొన్నారు. దీనివల్ల ఆయన ముందుగా నిర్ణయించుకున్న శాఖాపరమైన సమీక్షలు, పార్టీ కార్యక్రమాలు.. సినిమా షూటింగ్‌లకు తాత్కాలికంగా విరామం ప్రకటించారు. వారం రోజుల తర్వాత తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం.. ఆయన ఎప్పుడు విధుల్లోకి చేరాలనేది వైద్యులు నిర్ణయిస్తారు.



### స్పందించిన కుటుంబ సభ్యులు.. సినీ ప్రముఖులు

పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై అటు కుటుంబ సభ్యులు, ఇటు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఆయన భార్య అన్నా లెజినోవా స్పందిస్తూ.. "ఆల్ ఈజ్ వెల్.. అభిమానులు ఆందోళన చెందాల్సిన పనిలేదు.. ఆయన త్వరలోనే ఆరోగ్యంగా తిరిగి వస్తారు’ అని ధైర్యం చెప్పారు. మెగా మేనల్లుడు సాయి ధరమ్ తేజ్ ‘Get well soon మామయ్య’ అంటూ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంస్థ కూడా ఆయన కోలుకుంటున్నట్లు ప్రకటన విడుదల చేసింది.

### అభిమానుల ప్రార్థనలు

ఒకవైపు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పాలనాపరమైన బాధ్యతలు, మరోవైపు భారీ చిత్రాల షూటింగ్‌లను పవన్ కళ్యాణ్ ఎంతో బిజీగా పూర్తి చేశారు. ఇలాంటి బిజీ షెడ్యూల్ వల్లనే ఆయన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేశారని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఏపీవ్యాప్తంగా అభిమానులు ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్నారు. వైద్యులు ఇచ్చిన తాజా హెల్త్ బులి టెన్ ప్రకారం.. పవన్ కళ్యాణ్ చికిత్సకు చక్కగా స్పందిస్తున్నారని, ఆయన కోలుకునే వేగం ఆశాజనకంగా ఉందని తెలుస్తోంది. అభిమానులు ఎవరూ ఆందోళన చెందవద్దని, కేవలం విశ్రాంతి కోసమే బయటకు రావడం లేదని స్పష్టమవుతోంది.

# పాకిస్తాన్‌తో దోస్తీ..
## అమెరికా నిఘావర్గాల్లో టెన్షన్

ముద్ర డెస్క్ :

అమెరికా విదేశాంగ విధానంలో పాకిస్తాన్ ఎప్పుడూ ఒక చిక్కుముడిగానే ఉంటూ వస్తోంది. అయితే ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్ మధ్య చిగురిస్తున్న సంబంధాలు దౌత్య పరిమితులను దాటి భద్రతా కోణంలో సరికొత్త చర్చకు దారితీస్తున్నాయి. మునీర్‌ను ట్రంప్ ‘ప్రియమైన ఫీల్డ్ మార్షల్’ అని సంబోధించడం ఒక ఎత్తు అయితే అదే మునీర్ పట్ల అమెరికా గూఢచారి సంస్థలు తీవ్రమైన అనుమానాలు వ్యక్తం చేయడం మరో ఎత్తు. ఈ వైరుధ్యం అమెరికా అంతర్గత విభేదాలను బాహ్య ప్రపంచానికి స్పష్టం చేస్తోంది.

### ఇరాన్ కనెక్షన్.. మునీర్ ఒక ‘రెడ్ అలర్ట్’?

ఈ వివాదానికి ప్రధాన కేంద్ర బిందువు ఇరాన్‌తో మునీర్‌కు ఉన్నట్లుగా చెబుతున్న రహస్య సంబంధాలు. పాకిస్తాన్ మాజీ జనరల్ అహ్మద్ సయీద్ వెల్లడించిన సమాచారం ప్రకారం, ఆసిమ్ మునీర్‌కు ఇరాన్ యొక్క పవర్‌ఫుల్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్.జీసీ) లోని అగ్రనేతలతో దశాబ్దాల కాలంగా పరిచయాలు ఉన్నాయి. ముఖ్యంగా అమెరికా దాడుల్లో మరణించిన ఖాసీం సులేమానీ, ప్రస్తుత చీఫ్ హుస్సేన్ సలామీ వంటి వారితో మునీర్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇరాన్–అమెరికా మధ్య ఉద్రిక్తతలు గరిష్ట స్థాయిలో ఉన్న తరుణంలో మునీర్ మధ్యవర్తిత్వం వహించాలని ప్రయత్నించడం అమెరికా నిఘా వర్గాలకు మింగుడు పడటం లేదు. శత్రువులతో చెలిమి చేసే వ్యక్తికి వ్యూహాత్మక సమాచారం అందడం వల్ల 'సెక్యూరిటీ బ్రీచ్' జరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### చరిత్ర పునరావృతమవుతోందా?

గతంలో ఆఫ్ఘనిస్తాన్ యుద్ధ సమయంలో కూడా అమెరికా పాకిస్తాన్‌ను గుడ్డిగా నమ్మి భారీ మూల్యం చెల్లించుకుంది. ఒకవైపు అమెరికా నుంచి భారీగా నిధులు పొందుతూనే మరోవైపు తాలిబాన్ నెట్‌వర్క్‌లకు పాక్ ఆశ్రయం కల్పించిందన్న ఆరోపణలు జగమెరిగిన సత్యం. ప్రజాస్వామ్య రక్షణ సంస్థ కు చెందిన విశ్లేషకుడు బిల్ రోగియో అభిప్రాయం ప్రకారం ‘పాకిస్తాన్ ఎప్పుడూ తన సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తుంది తప్ప అమెరికా ప్రయోజనాలకు కాదు’ అని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మునీర్ పై ఆధారపడటం ప్రమాదకరమని ఆయన హెచ్చరిస్తున్నారు.

### శాంతి దూతనా లేక వ్యూహాత్మక ముప్పా?

ప్రస్తుత పరిస్థితుల్లో మునీర్ పాత్ర రెండు అంచుల కత్తిలా మారింది. ఒకవేళ మునీర్ తన పాత పరిచయాలను ఉపయోగించి ఇరాన్, అమెరికా మధ్య శాంతిని నెలకొల్పగలిగితే అది మధ్యప్రాచ్యంలో ఒక పెద్ద విజయం కావచ్చు. అదే సమయంలో అమెరికా యొక్క కీలక వ్యూహాలను ఇరాన్ లేదా ఇతర శత్రు దేశాలకు లీక్ చేసే అవకాశం ఉందనే భయం నిఘా వర్గాలను వేధిస్తోంది.

### ట్రంప్ ముందున్న సవాలు

వ్యక్తిగత సంబంధాలకు ప్రాధాన్యత ఇచ్చే ట్రంప్, మునీర్‌తో కలిసి ముందుకు సాగుతారా? లేక తన దేశ నిఘా సంస్థల హెచ్చరికలను గౌరవిస్తారా? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. దక్షిణాసియా, మధ్యప్రాచ్య భౌగోళిక రాజకీయాల్లో పాకిస్తాన్ పోషించే పాత్ర ఎప్పుడూ ఊహాతీతమే.

మొత్తానికి ఆసిమ్ మునీర్ అమెరికాకు ఒక నమ్మకమైన 'వారధి'గా నిలుస్తారా లేక గతంలో లాగే పాకిస్తాన్ మరోసారి అమెరికాను వ్యూహాత్మక పద్మవ్యూహంలో చిక్కుకునేలా చేస్తుందా అనేది వేచి చూడాలి. అమెరికా–పాకిస్తాన్ బంధం మళ్లీ ఒక క్లిష్టమైన పరీక్షా కాలంలోకి ప్రవేశించింది అనడంలో ఎటువంటి సందేహం లేదు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
20.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఈత పండ్లు : జీర్ణక్రియ మెరుగుపరుస్తుంది**

- ఫైబర్ ఎక్కువగా ఉండటంతో జీర్ణశక్తి బాగుంటుంది
- మలబద్ధకం సమస్య తగ్గుతుంది



# త్వరలోనే లేబర్ బోర్డు పునరుద్ధరణ

- **భవన నిర్మాణ రంగ కార్మికులకూ పెన్షన్లు**
- **ప్రతి జిల్లాలో కార్మిక సంఘ భవనాలు**
- **మంత్రి వివేక్**



**ముద్ర, సిద్దిపేట:**
రాష్ట్రంలో త్వరలోనే లేబర్ బోర్డును పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని కార్మిక శాఖ మంత్రి వివేక్ ప్రకటించారు. లేబర్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు, ప్రమాద బీమా, ఇతర సంక్షేమ పథకాలు అందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఆదివారం సిద్దిపేట డీసీసీ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షలో ఆయన హామీలు ఇచ్చారు. భవన నిర్మాణ రంగ కార్మికుల చిరకాల వాంఛ పెన్షన్ల అంశంపై మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే వీరికి పింఛన్లు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి జిల్లాలో కార్మిక సంఘాల కోసం ప్రత్యేక సంఘ భవనాలను నిర్మిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో కార్మిక వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. తమ కుటుంబానికి కార్మికులతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తన తండ్రి కాకా వెంకటస్వామి సింగరేణి కార్మికుల కోసం చేసిన పోరాటాలను ప్రస్తావించారు. అదే బాటలో నడుస్తూ.. గిగ్ వర్కర్ల రక్షణ కోసం అసెంబ్లీలో ప్రత్యేక చట్టం తెచ్చామన్నారు. ప్రమాద బీమాను రూ. 10 లక్షలకు పెంచామని గుర్తుచేశారు. హమాలీల సంక్షేమం కోసం కూడా ప్రత్యేక చట్టం తెచ్చే ఆలోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి హరీశ్ రావు కేవలం ఓట్ల కోసమే హామీలు ఇచ్చారని ఆరోపించారు. కానీ తమ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో మార్పు తెస్తుందన్నారు. సిద్దిపేట కార్మిక భవన నిర్మాణానికి స్థల కేటాయింపుతో పాటు నిధులు కూడా మంజూరు చేస్తానని మాట ఇచ్చారు.

# సీఎంపై చీటింగ్ కేసు పెట్టాలి

- **కేంద్ర మంత్రి శోభా కరంద్లా**
- **గ్యారంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం**
- **ఏప్రిల్ 17 భారత మహిళా లోకానికి 'బ్లాక్ డే'**




**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
అమలుకు సాధ్యం కాని హామీలతో అధికారంలో వచ్చిన సీఎం రేవంత్ రెడ్డిపై చీటింగ్ కేసు పెట్టాలని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే డిమాండ్ చేశారు. తెలంగాణను రేవంత్ రెడ్డి 'పిక్ పాకెట్' చేశారని, ఆయన ఒక 'పిక్ పాకెటర్' అని విమర్శించారు. కర్ణాటకలో కూడా కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైందన్న ఆమె..ఉచిత బస్సు హామీలు 20 శాతం కూడా నెరవేరలేదన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై ఆమె నిప్పులు చెరిగారు. తెలంగాణలో మహిళలకు ఇస్తానన్న రూ. 2,500, విద్యార్థినులకు స్కూటీలు, పెళ్లికానుకగా తులం బంగారం ఏమయ్యాయని ప్రశ్నించారు. ఏప్రిల్ 17ను భారత మహిళా లోకానికి ఒక 'బ్లాక్ డే'గా ఆమె అభివర్ణించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో రాహుల్ గాంధీ మహిళలను మోసం చేశారని ఆరోపించారు. మహిళా బిల్లు ఆగిపోయేలా చేసి దేశవ్యాప్తంగా కాంగ్రెస్ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. మహిళా గౌరవం కోసం ప్రధాని 'నారి వందన్' పథకాన్ని తెచ్చారన్నారు. మహిళా బిల్లు వెనుక పదేళ్ల కఠోర కృషి ఉందని చెప్పారు. మోదీ ప్రవేశపెట్టిన లోన్ల ద్వారా దేశంలో 3 కోట్ల మంది మహిళలు 'లక్షాధికారి దీదీ'లుగా ఎదిగారని చెప్పారు.

**కాంగ్రెస్, ఇండియా కూటమిపై ధ్వజం..**
మహిళా బిల్లు విషయంలో అమిత్ షా లోక్‌సభలో గంట సమయం కేటాయించి సందేహాలు తీరుస్తానన్నా, ప్రతిపక్షాలు ఎందుకు ముందుకు రాలేదని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. 'ఇండియా కూటమి నల్ల బట్టలతో నిరసన తెలపడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. మహిళలు ఎంపీలు, ఎమ్మెల్యేలు కాకూడదన్నదే మీ ఉద్దేశమా?' అని నిలదీశారు. రాహుల్ గాంధీకి ప్రతిపక్ష నేతగా ఏం మాట్లాడాలో కూడా తెలియదని ఎద్దేవా చేశారు.

## బ్యాంకు అధికారుల అండతో సైబర్ మోసాలు..

- **'ఆపరేషన్ అక్టోపస్ 2.0'తో గుట్టురట్టు**
- **9 రాష్ట్రాల్లో హైదరాబాద్ పోలీసుల దాడులు**
- **32 మంది బ్యాంకు అధికారులతో సహా 52 మంది అరెస్ట్**
- **రూ. 150 కోట్ల మేర మోసాలు.. 850 కేసులతో సంబంధం**

**ముద్ర, హైదరాబాద్:**
దేశవ్యాప్తంగా సాగుతున్న భారీ సైబర్ మోసాల నెట్వర్క్ ను హైదరాబాద్ పోలీసులు ఛేదించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్2.0' పేరుతో నిర్వహించిన ఈ భారీ ఆపరేషన్ లో మొత్తం 9 రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించి..బ్యాంకు అధికారులు సహా 52 మంది నిందితులను అరెస్టు చేశారు.
పెట్టుబడి స్కామ్ లు, ట్రేడింగ్ మోసాలు, 'డిజిటల్ అరెస్ట్' పేరుతో అమాయకులను బెదిరించి భారీగా సొమ్ము దోచుకుంటున్న ముఠాలకు అండగా నిలుస్తున్న బ్యాంకు అధికారులే లక్ష్యంగా ఈ ఆపరేషన్ సాగింది. నిందితుల్లో 32 మంది బ్యాంకు అధికారులు, 15 మంది మ్యూల్ ఖాతాదారులు, ఐదుగురు మధ్యవర్తులు ఉన్నారు. సైబర్ నేరగాళ్లతో కుమ్మక్కైన కొందరు బ్యాంకు అధికారులు. వారి కోసం అక్రమంగా బ్యాంకు ఖాతాలు (మ్యూల్ అకౌంట్స్) తెరిచి ఇస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ వి. అరవింద్ బాబు, ఏసీపీ ఆర్.జి. శివ మారుతి నేతృత్వంలో 16 ప్రత్యేక బృందాలు ఈ ఆపరేషన్ లో పాల్గొన్నాయి. ఏడు రోజుల పాటు తొమ్మిది రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి నెట్వర్క్ ను ఛేదించాయి. ఫిబ్రవరి లో నిర్వహించిన 'ఆపరేషన్ అక్టోపస్1లో 16 రాష్ట్రాల నుంచి 117 మందిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ ఆపరేషన్ లో వెలుగు చూసిన అంశాల ఆధారంగా ఇప్పుడు రెండో విడతగా 'ఆపరేషన్ అక్టోపస్2' చేపట్టారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ జరిపిన లోతైన దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. బాధితుల సొమ్మును దారి మళ్లించేందుకు నేరగాళ్లు ఏకంగా 350 బ్యాంకు ఖాతాలను వినియోగించారు. ఈ ఖాతాలకు దేశవ్యాప్తంగా నమోదైన సుమారు 850 సైబర్ కేసులతో సంబంధం ఉంది. వీటి ద్వారా దాదాపు రూ.150 కోట్ల మేర మోసాలు దర్యాప్తులో తేలింది. బ్యాంకు అధికారులు మోసగాళ్లతో చేతులు కలిపి నిబంధనలకు విరుద్ధంగా ఖాతాలను నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు.



# కాళేశ్వరంను కులేశ్వరం చేశారు..




- **కొండగట్టులో 60 మంది చనిపోతే రాని కేసీఆర్ జగిత్యాల సభకు హెలికాప్టర్ లో వస్తున్నారు**
- **జీవన్ రెడ్డి భుజాలపై తుపాకీ పెట్టీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు**
- **మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
- **పార్టీ ఫిరాయింపుల పితామహుడు కేసీఆర్**
- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును కమీషన్ లతో కులేశ్వరం చేశారని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. జగిత్యాలలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ లతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొండగట్టులో 60 మంది ప్రమాదవశాత్తూ చనిపోతే రాని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, సభ సామర్థ్యం 15 వేలకు మించని దానికి మాత్రం హెలికాప్టర్ లో వస్తున్నారని ఎద్దేవా చేశారు. జీవన్ రెడ్డి భుజాలపై తుపాకీ పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి మేడిగడ్డ పరిశీలన 15 రోజుల క్రితం తీసుకున్న నిర్ణయమని చెప్పారు. దక్షిణ భారత దేశానికి నరేంద్ర మోడీ చేస్తున్న అన్యాయాన్ని రేవంత్ రెడ్డి ఎండగట్టారని పేర్కొన్నారు. ధర్మపురి అభివృద్ధిపై చర్చకు సిద్ధమా? అని మంత్రి సవాల్ విసిరారు. సొంత డబ్బా కోసమే జగిత్యాల బహిరంగ సభ అని దుయ్యబట్టారు.

**అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్ హరీష్ రావు..**
అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్ హరీష్ రావు అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. కేటీఆర్, హరీష్ రావులు కోడి గుడ్డు మీద ఈకల పీకే రకమన్నారు. పార్టీ ఫిరాయింపుల పితామహుడు కేసీఆరేనని దుయ్యబట్టారు. ధనిక రాష్ట్రాన్ని నేడు అప్పుల కుప్పగా మార్చిన ఘనత బీఆర్ఎస్ దేనని చెప్పారు. సంక్షేమ పథకాల అమలుతో రేవంత్ రెడ్డి సర్కార్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.

**లోఫర్ అన్నందుకు జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నారా..**
కేటీఆర్ ను గతంలో లోఫర్ అన్నందుకు జీవన్ రెడ్డి నీ పార్టీ లోకి ఆహ్వానిస్తున్నారా? అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దుయ్యబట్టారు. కేసీఆర్ ను అత్యధిక సార్లు విమర్శించిన జీవన్ రెడ్డి నేడు అత్యంత ఆప్తుడు అయ్యాడన్నారు. 2014 లో జగిత్యాల లో గెలిచే అభ్యర్థి లేకుంటే తనను పిలిచి టికెట్ ఇచ్చారని తెలిపారు.
ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, పీసీసీ సెక్రెటరీ బండ శంకర్, పట్టణ అధ్యక్షుడక కొత్త మోహన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, ఏఎంసీ చైర్మ్న గడ్డం నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు దామోదర్ రావు, గట్టు సతీష్, మన్సూర్, బాల ముకుందం, నక్కల రవీందర్ రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు రాజేష్, కౌన్సిలర్ లు పాల్గొన్నారు.

## సీఎంపై వ్యక్తిగతంగా మాట్లాడితే ఊరుకోం..

- **మేడిగడ్డ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలి**

**ముద్ర, ధర్మారం:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మాజీ మంత్రి కేటీఆర్ వ్యక్తిగత ఆరోపణలు చేస్తే ఊరుకోమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ధర్మారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిందని మంత్రి ఆరోపించారు. కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం మేడిగడ్డ సందర్శనకు వస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్న సమయంలో అక్రమంగా సంపాదించిన డబ్బుతో కేటీఆర్ కు అహంకారం ఎక్కువై ముఖ్యమంత్రిని విమర్శిస్తున్నారన్నారు. పార్లమెంటులో బీజేపీ మహిళా బిల్లు ప్రవేశపెడితే కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తుందని తెలిపారు.

# కేటీఆర్ కు అహంకారం ఎక్కువ

- **జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్**



**ముద్ర, జగిత్యాల:**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు అహంకారం, అక్రమ సంపాదన ఎక్కువని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ విమర్శించారు. కేటీఆర్ ఫామ్‌హౌస్‌కు తాను ఏనాడూ పోలేదన్నారు. ఆయన కంటే తాను ఎందులోనూ తక్కువ కాదని తేల్చిచెప్పారు. ఆదివారం జగిత్యాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను బ్రీడ్ కాదని.. ఆయన ఇంతకీ ఏ బ్రీడ్ అని ప్రశ్నించారు. క్రాస్ ఓటింగ్ చేయించిన ఆయనది క్రాస్ బ్రీడ్ అని ఎద్దేవా చేశారు. తాను రాజకీయ వ్యభిచారి అయితే.. నువ్వు వ్యభిచార కొంప నడిపావా..? అని సెటైర్లు గుప్పించారు. వైసీపీ, కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ నుంచి పలువురు ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్న విషయం గుర్తు లేదా అని అడిగారు. ఆయనదా క్రాస్ బ్రీడ్....? తమదా..? అని నిలదీశారు. కేటీఆర్ అహంకారం, అక్రమ సంపాదన తన ముందు పని చేయవని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హెచ్చరించారు.

# పవన్ త్వరగా కోలుకోవాలి

- **ప్రధాని నరేంద్ర మోదీ**



**ముద్ర, హైదరాబాద్:**
జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆరోగ్యంపై ప్రధాని నరేంద్ర మోదీ ఆరా తీశారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పవన్ చాలా ధైర్యశాలి అని, త్వరగా కోలుకుంటారని ఆకాంక్షించారు. పవన్‌తో ప్రధాని ఫోన్‌లో మాట్లాడారు. ఈ మేరకు ఎక్స్‌లో ప్రధాని పోస్టు చేశారు. కొద్దినెలలుగా ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న పవన్.. శుక్రవారం అధికారులతో చర్చిస్తున్న సమయంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను హైదరాబాద్ జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలుపుతూ పవన్ కళ్యాణ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "నా ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు సమయం కేటాయించినందుకు ప్రధానికి కృతజ్ఞతలు. నేను త్వరగా కోలుకోవాలన్న మీ ఆకాంక్ష.. నాకు గొప్ప బలాన్ని ఇస్తోంది. మీ నిరంతర మద్దతుకు ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటాను" అని పవన్ పేర్కొన్నారు.

# అభినవ గోబెల్స్ రేవంత్ రెడ్డి

- **అబద్ధాల పునాదులపైనే సీఎం అయ్యారు**
- **అనేక హామీలతో మహిళలను ముంచారు**
- **కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**



**ముద్ర, కరీంనగర్:**
అబద్ధాలు, మోసాలనే నమ్ముకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "అభినవ గోబెల్స్" అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎద్దేవా చేశారు. అబద్ధాలు, మోసాలు చేసే వారినే ప్రజలు నమ్ముతారని బహిరంగంగా ప్రకటించిన రేవంత్ రెడ్డి ఆ అబద్ధాల పునాదులపైనే ముఖ్యమంత్రి అయ్యారని విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని, రాష్ట్రంలోని ప్రతి మహిళకు ప్రతినెలా రూ.2500లు చెల్లిస్తామని, తులం బంగారం, స్కూటీ ఇస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక తూట్లు పొడిచారని మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం మీడియాకు ఒక ప్రకటనను విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నిజం చెబితే తల వెయ్యి ముక్కలవుతుందనే శాపం ఉన్నట్లుందన్నారు.
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తరహాలోనే దొంగ హామీలు, పచ్చి అబద్ధాలతో ప్రజలను మభ్యపెడుతూ పాలనను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. నిజాయితీగా పనిచేసే నాయకులపై బురద చల్లడం ఆయనకు అలవాటుగా మారిందన్నారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లు ఆమోదం ద్వారా చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రతి రాష్ట్రానికి 50 శాతం ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు పెంచి దక్షిణాదికి న్యాయం చేయాలని ఎన్డీఏ ప్రభుత్వం పార్లమెంట్ లో బిల్లు ప్రవేశపెడితే ఇండియా కూటమి నేతలు బిల్లును అడ్డుకున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో లేనిపోని విష ప్రచారం చేసి మహిళా బిల్లును అడ్డుకోవడంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ చేసిన మోసాలను తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

# గులాబీమయంగా మారిన జగిత్యాల

- **నేడు జగిత్యాలలో కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ**
- **మాజీ సీఎం సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోనున్న జీవన్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక ఘట్టానికి జగిత్యాల వేదిక కాబోతోంది. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు సోమవారం జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సర్వం సిద్ధమైంది. దాదాపు ఏడాది కాలం తర్వాత కేసీఆర్ ప్రజల ముందుకు వస్తుండటంతో, ఈ ప్రజా ఆశీర్వాద సభ పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. జగిత్యాల నియోజకవర్గ రాజకీయ సమీకరణాల్లో పలు మార్పులు చోటు చేసుకోబోతున్న ఈ సభ కేవలం రాజకీయ ప్రసంగాలకే పరిమితం కాకుండా, కీలక చేరికలకు వేదిక కానుంది. సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అధికారికంగా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోనున్నారు. కేసీఆర్ స్వయంగా ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించనున్నారు. ఇది ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యేలు సంజయ్, కౌశిక్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి తదితరులు తో కలిసి రెండు సార్లు పర్యవేక్షించారు. సుమారు ఒక లక్ష మంది జనం వచ్చేలా పక్కా ప్లానింగ్‌తో ఇంచార్జ్‌లను నియమించారు. సభకు వచ్చే కార్యకర్తలు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా రెండు లక్షల మజ్జిగ ప్యాకెట్లు, మూడు లక్షల వాటర్ బాటిళ్లు సమకూర్చనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ సభ బీఆర్ఎస్ కు పూర్వవైభవం తీసుకురావడమే కాకుండా, రాష్ట్రంలో పార్టీ జైత్రయాత్రకు నాంది పలుకుతుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సభకు ఒక రోజు ముందేజగిత్యాల పట్టణమంతా గులాబీమయంగా మారింది. ప్రధాన కూడళ్లలో భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు వెలిశాయి. కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు స్థానిక నాయకులు బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. కేసీఆర్ ఏం మాట్లాడబోతున్నారు? చాలా కాలం తర్వాత మైక్ పట్టనున్న కేసీఆర్ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎలాంటి విమర్శలు చేస్తారు? హామీల అమలుపై సర్కారును ఎలా నిలదీస్తారు? అన్నది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా రైతాంగ సమస్యలు, సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులపై కేసీఆర్ ఘాటుగా స్పందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఒక వైపు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, మరోవైపు బీఆర్ఎస్ లో నూతన ఉత్సాహాన్ని నింపేందుకు ఈ జగిత్యాల సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
20.04.2026 సోమవారం, హైదరాబాద్



మీ ముద్ర వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# అభివృద్ధి ముసుగులో హత్యలు

(మహుల్ నుంచి తెలంగాణకు హెచ్చరిక)



ముంబైలోని మహుల్ ప్రాంతం నేటి భారత అభివృద్ధి నమూనాకు ఒక హెచ్చరికా చిహ్నంగా నిలిచింది. పరిశ్రమల మధ్య, రసాయన కాలుష్యం తీవ్రమైన ప్రాంతంలో సుమారు 7,000 ఇళ్లు నిర్మించగా, వాటిలో దాదాపు 2,500 ఇళ్లు ఖాళీగా ఉండటం యాదృచ్ఛికం కాదు, ప్రజలు ప్రాణభయంతో వాటిని తిరస్కరించిన వాస్తవం. అక్కడ నివసించినవారిలో క్షయవ్యాధి, ఆస్తమా వంటి శ్వాస సంబంధిత వ్యాధులు విస్తరించాయి. ఇది మనకు ఒక స్పష్టమైన నీతిని చెబుతోంది: కేవలం గూడు కల్పించడం పునరావాసం కాదు; అది నివసించడానికి యోగ్యమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండాలి. కాలుష్యం తగ్గిందని అధికారులు చెబుతూ మహారాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నివేదికలను చూపించినా, ప్రజల అనుభవాలే అసలు సాక్ష్యాలు అన్న సత్యాన్ని ఈ సంఘటన స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అభివృద్ధికి ఒక కొత్త నిర్వచనం అవసరం. అభివృద్ధి అంటే కేవలం కాంక్రీటు కట్టడాలు కాదు, ప్రజల ఆరోగ్యం, పర్యావరణ భద్రతే అసలు ప్రమాణం కావాలి. కానీ మన వ్యవస్థలో "పర్యావరణ ప్రజాస్వామ్యం" తీవ్రంగా కరువైపోయింది. ప్రజాభిప్రాయం తీసుకోవడం కేవలం ఒక మొక్కుబడి ప్రక్రియగా మారిపోయింది. ప్రాజెక్టులు ప్రారంభించే ముందు పర్యావరణ ప్రభావంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడం, వారి ఆరోగ్యానికి ముప్పు ఉంటే ప్రాజెక్టులను నిలిపివేసే అధికారం ఇవ్వడం అవసరం. లేకపోతే శాస్త్రీయ నివేదికలనే వక్రీకరించి ప్రజలను మోసం చేసే పరిస్థితి వస్తుంది. మహుల్ ఉదాహరణలో కనిపించినట్లే, కాలుష్యం తగ్గిందని చెప్పే గణాంకాలు ఉన్నా, ప్రజలు మాత్రం జబ్బుల బారిన పడుతూనే ఉన్నారు. అందుకే స్వతంత్ర పర్యావరణ తనిఖీలు, తప్పు గణాంకాలు ఇచ్చే అధికారులపై కఠిన చర్యలు అనివార్యం. ఈ గుణపాఠాన్ని విస్మరిస్తూ తెలంగాణలో అభివృద్ధి ముసుగులో జరుగుతున్న చర్యలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రత్యేకంగా హైదరాబాద్ పరిసరాల్లో "భవిష్యత్ నగరం", "శివారు నగరాలు" అనే పేర్లతో విస్తరణ జరుగుతున్నా, కనీస జీవన ప్రమాణాలపై దృష్టి తక్కువగా ఉంది. ఒక ఇల్లు అంటే కేవలం గోడలు, పైకప్పు కాదు, శుద్ధమైన తాగునీరు, స్వచ్ఛమైన గాలి, సరైన కాలువ వ్యవస్థ ఉండాలి. ఇవి లేని ఇల్లు కేవలం సిమెంట్ గూడు మాత్రమే. భూమి ధరల కోసం చెరువులు, కుంటలను కప్పేసి నిర్మాణాలు చేయడం వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా, ఒకవైపు వరదలు, మరోవైపు భూగర్భ జలాల కలుషీకరణ జరుగుతోంది. నగరాలు నీటిని పీల్చుకునే విధంగా అభివృద్ధి చెందాల్సింది పోయి, పారద్రోలే విధంగా మారుతున్నాయి. ఇదే సమయంలో శివారు ప్రాంతాల్లో నిర్మించే కొత్త నగరాలకు సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రజలు మళ్లీ పాత నగరాలకే రావాల్సి వస్తోంది, దీంతో కాలుష్యం మరింత పెరుగుతోంది. ఈ పరిణామాల వెనుక ఒక పెద్ద వాస్తవం దాగి ఉంది, రియల్ ఎస్టేట్ లాభాలు ప్రజా ఆరోగ్యంపై పైచేయి సాధిస్తున్నాయి. పచ్చని పొలాలు, అడవులను గృహ నిర్మాణాలుగా మార్చడం వల్ల జీవవైవిధ్యం దెబ్బతింటోంది. పచ్చని పరిసరాలను కాపాడాల్సిన బాధ్యతను విస్మరిస్తూ అభివృద్ధి పేరుతో ప్రకృతిని నాశనం చేయడం, చివరికి మనిషి జీవితానికే ముప్పుగా మారుతోంది. ప్రతి పౌరుడికి జీవించే హక్కు ఉంది; కాలుష్య ప్రాంతాల్లో నివాసాలను నిర్మించి ప్రజలను అక్కడికి నెట్టడం ఆ హక్కును ఉల్లంఘించడం మాత్రమే కాదు, సమాజంపై చేసే ఒక పెద్ద నేరం. అందుకే మహుల్ మనకు ఇచ్చిన అతిపెద్ద పాఠం ఇదే: తప్పుడు చోట కట్టిన ఇల్లు పేదవాడికి వరం కాదు, అది ఒక మరణ శాసనం. అభివృద్ధి అంటే భవనాలు పెరగడం కాదు, మనుషులు ఆరోగ్యంగా జీవించడం. లేకపోతే, కాలుష్యంపై నిర్మించిన అభివృద్ధి భవిష్యత్తుపై నిర్మించిన శవపేటికగా మారుతుంది. నిర్మించిన అభివృద్ధి భవిష్యత్తుపై నిర్మించిన శవపేటికగా మారుతుంది.



పాపని నాగరాజు

# కార్పొరేట్ కబంధహస్తాల్లో విద్య

## మార్కుల యంత్రాలుగా విద్యార్థులు




విద్య వ్యక్తిని విజ్ఞానవంతుడిగా తీర్చిదిద్దాల్సిన మూలాధారం. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అదే విద్య విద్యార్థులను 'మార్కుల యంత్రాలు'గా, తల్లిదండ్రులను 'అప్పుల భారంతో నలిగే వర్గం'గా మార్చుతున్న దృశ్యం స్పష్టమవుతోంది. పవిత్రమైన బడి వ్యవస్థ, కార్పొరేట్ శక్తుల ఆధీనంలో వ్యాపార కేంద్రంగా మారి, విద్యా రంగం దిశ తప్పుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. సాంప్రదాయంగా సరస్వతీ నిలయాలుగా భావించబడిన విద్యాసంస్థలు, ప్రస్తుతం లాభాల దిశగా నడిచే సంస్థలుగా రూపాంతరం చెందుతున్నాయి. అక్షరాలు కూడా మార్కెట్‌లో అమ్మకానికి పెట్టే వస్తువులుగా మారుతున్నాయి. చదువు అవసరం మాత్రమే కాకుండా ప్రతిష్ఠకు ప్రతీకగా మారిపోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది.

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ప్రవేశ ప్రక్రియలు భారీ ఆర్థిక భారం మోపుతున్నాయి. ప్రవేశాలు, విరాళాలు, పునఃప్రవేశాల పేర్లతో లక్షల రూపాయలు వసూలు చేయడం సాధారణమైపోయింది. పాఠశాలలు పుస్తకాలు, దుస్తులు, ఇతర అవసరాలను తమ వద్దే కొనాలని నిర్బంధించడం ద్వారా విద్యను సంపూర్ణ వ్యాపార ప్రక్రియగా మార్చుతున్నాయి. ఉచిత అవకాశాలు కాగితాలకే పరిమితమవడం ఆందోళన కలిగిస్తోంది.

కార్పొరేట్ కాలేజీల్లో విద్య నాలుగు గోడల మధ్య పరిమితమవుతోంది. దీర్ఘకాలిక తరగతులు, నిరంతర పరీక్షలు, ర్యాంకుల ఒత్తిడితో విద్యార్థుల బాల్యం క్షీణిస్తోంది. సృజనాత్మకత, విలువలు, సామాజిక అవగాహన వంటి అంశాలకు ప్రాధాన్యం తగ్గిపోతోంది. విద్యార్థులు సంపూర్ణ వ్యక్తిత్వం కాకుండా పరీక్షలకే పరిమితమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

ఇంతటి ఖర్చు పెట్టి చదివిస్తున్న తల్లిదండ్రులు కూడా మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పిల్లల పరిస్థితిపై ఆందోళన పెరుగుతోంది. చదువు ప్రతిష్ఠగా మారడంతో, ఏ విద్యాసంస్థలో చదువుతున్నారనే ప్రశ్న కూడా సామాజిక ఒత్తిడిగా మారింది. ప్రభుత్వ విద్యాసంస్థలపై నమ్మకం తగ్గడం, కార్పొరేట్ వైపు మొగ్గు పెరగడం గమనార్హం.



**ఈ ప్రభావం పట్టణాలకు మాత్రమే పరిమితం కాకుండా పల్లెల వరకు విస్తరించింది. గ్రామీణ, మధ్యతరగతి కుటుంబాలు పిల్లల భవిష్యత్తు కోసం భారీ ఖర్చులు భరించాల్సి వస్తోంది. ప్రాథమిక స్థాయి నుంచి పదో తరగతి వరకు లక్ష రూపాయల వరకు ఖర్చవుతుండగా, ఇంటర్మీడియట్ దశలో ఈ వ్యయం మరింత పెరిగి రెండు నుంచి నాలుగు లక్షల వరకు చేరుతోంది. దీంతో అప్పులు చేయడం సామాన్య కుటుంబాలకు తప్పనిసరి అవుతోంది. పోటీ వాతావరణంలో వెనుకబడిపోతారనే భయంతో పిల్లలను మహానగరాల్లోని కార్పొరేట్ కాలేజీలకు పంపించే పరిస్థితి నెలకొంది. చిన్న పట్టణాల్లోని విద్యాసంస్థలు క్రమంగా బలహీనపడుతున్నాయి. మరోవైపు, ఆకర్షణీయ ప్రకటనలు, హోర్డింగులు,**

తెలంగాణ ఏర్పాటుకు ముందు నుంచే ఉన్న కార్పొరేట్ విద్యాసంస్థల ప్రభావం ఇప్పటికీ కొనసాగుతోంది. ఇతర ప్రాంతాల విద్యా వ్యాపార వర్గాలు కూడా తమ కార్యకలాపాలను విస్తరించాయి. అనుమతుల మంజూరులో ప్రమాణాలు, పర్యవేక్షణలో లోపాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ప్రభుత్వాలు మారుతున్నా విద్యా వ్యవస్థలో గణనీయమైన మార్పు కనిపించడం లేదు. కొన్ని రాష్ట్రాలు ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్యను సమర్థంగా అమలు చేస్తున్నప్పటికీ, మన రాష్ట్రంలో ఆ దిశగా పురోగతి మందగించింది. ప్రకటించిన పథకాలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం గమనించాల్సిన విషయం.

ఈ నేపథ్యంలో సమగ్ర సంస్కరణలు అవసరం. ఫీజుల నియంత్రణకు కఠిన విధానాలు అమలు చేయాలి. విద్యాసంస్థలపై పర్యవేక్షణను బలోపేతం చేయాలి. ఫీజు నిర్మాణాన్ని పారదర్శకంగా ప్రకటించే విధానం తీసుకురావాలి. నిబంధనలు అతిక్రమించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం అత్యవసరం. నాణ్యమైన మౌలిక వసతులు, ఉత్తమ బోధన అందుబాటులోకి తేవాలి. పేదవర్గాలకు ఉచిత, నాణ్యమైన విద్య అందించాలి. విద్యార్థిని మార్కుల యంత్రంగా కాకుండా విలువలతో కూడిన వ్యక్తిగా తీర్చిదిద్దే దిశగా చర్యలు తీసుకోవాలి. అప్పుడే 'చదువులమ్మ చెరసాల'గా మారిన ఈ వ్యవస్థ నుంచి విద్యార్థులకు విముక్తి లభిస్తుంది.



గడగోజు రవీంద్రాచారి,
జర్నలిస్టు,
రచయిత.9848772232.



## పాలిట్రిక్స్

వీగిపోయిన బిల్లు కేంద్రానికి షాకు, హడావిడి చర్యలకు ఫలితాలు జలకు !

జనగణన లేకుండా జబర్దస్తీ ఓటింగు, డిలీమిటేషన్ షోలో కేంద్రానికి కటింగు !

న్యాలకంటి నారాయణ

# సమ్మెకు సిద్ధమైన ఆర్టీసీ కార్మికులు!

- **చర్చలు జరిపి సమ్మెను నివారించాలి!**

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికులు.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై 12 సంవత్సరాలు గడుస్తున్నప్పటికి వారి సమస్యలు పరిష్కారం కాకపోగా ఉద్యోగులపై పనిభారము, వేతన సవరణ, రిటైర్మెంట్ పొందినవారికి అందవలసిన పరిహారం అందక పోవటంతో కార్మికులు తీవ్రమైన ఆవేదనకు గురవుతున్నారు. స్వరాష్ట్రంలో న్యాయమైన సమస్యలను పరిష్కరించుకుంటామని ఆశతో ఎదురుచూస్తున్న కార్మికులకు నిరాశే ఎదురయింది. గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోగా.. ఆర్టీసీలో ఉద్యోగ సంఘాలు లేకుండా నిషేధించింది. గుర్తింపు పొందిన సంఘాల నాయకులను వివిధ ప్రాంతాలకు బదిలీ చేసి నిర్బంధాలకు గురిచేసింది.

**ప్రజా సేవలో ఆర్టీసీ:**
రాష్ట్రంలో అత్యధిక మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న సంస్థ ఆర్టీసీ. వివిధ వర్గాలకు విద్యార్థులకు, వికలాంగులకు, శాసనసభ్యులకు, స్వాతంత్ర సమరయోధులకు, జర్నలిస్టులకు ఇతర వర్గాలకు రాయితీలతో సేవలందిస్తున్న సంస్థ. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం కింద రోజు 3.5 లక్షల మంది మహిళలకు ప్రయాణ సౌకర్యంతో పాటు మారుమూల గ్రామీణ ప్రాంతాలకు పల్లెవెలుగు బస్సులు, అంతర్ రాష్ట్ర రవాణాతో పాటు, రాష్ట్ర నలుమూలలకు బస్సులు నడుపుతూ దేశంలోనే మంచి పేరు ప్రఖ్యాతులతో ప్రజా రవాణా సంస్థగా వెలుగొందిన ఆర్టీసీ నేడు వెలవెలబోతున్నది.
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా 10,500 బస్సులు, 49 వేల మంది ఉద్యోగులతో ఉన్న సంస్థ నేడు 9 వేల బస్సులకు, 40 వేల సిబ్బందికి తగ్గినది. నేడు ఆర్టీసీ కార్మికులకు జీతాలు చెల్లించలేని దుస్థితిలో ఏర్పడింది. అప్పులు పీకల్లోతుకు కూర్కొని పోయిన తెలంగాణ ఆర్టీసీ, కాలం చెల్లిన బస్సులతో కుస్తీ పడుతుంది. దాంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దాదాపు 3 వేల బస్సులు 12 ఏళ్లకు మించినవిగా గుర్తించినారు. దాదాపు 3 వేల ప్రయివేటు బస్సులను అద్దె ప్రాతిపదికపై రూట్లలో ఆర్టీసీ నడుపుతుంది.

**ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టిసికే ఇవ్వాలి :**
మహానగరాలలో పర్యావరణాన్ని, వాతావరణం కాలుష్యాన్ని నివారించేటందుకు కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను ప్రవేశపెట్టింది. అందులో భాగంగానే హైదరాబాద్ నగరానికి గత రెండు సంవత్సరాలలో 2 వేల బస్సులను అలాట్మెంట్ చేయడం జరిగింది. ఈ బస్సులను ప్రైవేట్ ఏజెన్సీకి ఇస్తూ నడిపిస్తున్నారు. తెలంగాణలో ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణను ఆర్టీసీకి ఇవ్వాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ బస్సులను నడపటం, మెయింటెనెన్స్ చేయటం మొత్తం ప్రైవేట్ సంస్థలకే ఇస్తున్నారు. రాష్ట్రంలో రెండువేల బస్సులు ప్రస్తుతం నడుస్తున్నాయి. కండక్టర్ మాత్రమే ఆర్టీసీ ఉద్యోగి. డ్రైవర్స్, మెకానిక్స్, సూపర్వేజర్స్ మెఇంటెన్స్ స్టాఫ్ మొత్తం ప్రవేటు సంస్థవారే. ఎలక్ట్రిక్ బస్సుల వలన ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుంది. ఇప్పటికే ఎలక్ట్రిక్ బస్సుల వలన వెయ్యి మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోల్సి వస్తుంది. మహానగరంలో నడుపుట వలన ఇక్కడ పనిచేసేసిబ్బందిని ఇతర ప్రాంతాలకు పంపుతున్నారు. ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ ఆర్టీసీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దీన్ని కేంద్రంతో మాట్లాడి ఆర్టీసీకే ఇప్పించాలి.

**సిసిఎస్ కు ఆర్టీసీ వెయ్యి కోట్లు బాకీ:**
ఆర్టీసీలో పనిచేసే కండక్టర్లు, డ్రైవర్లు, అధికారులు ఇతర సిబ్బంది సిసిఎస్ సొంతంగా ఏర్పాటు చేసుకున్నారు. ప్రతినెల తమ వేతనాల నుంచి కొంత సొమ్మును దీనితో జమ చేసుకొని పిల్లల పెండ్లిలకు ,స్కూలు, కాలేజీ ఫీజులకు, ఇండ్ల నిర్మాణమునకు, వైద్యం తదితర అవసరాలకు రుణాలను తీసుకోని వేతనాల నుంచి మినహించుకొనే పద్ధతిలో నడుపుకుంటున్నారు. ఉద్యోగస్తుల నుంచి రికవరీ చేసిన డబ్బులను సిసిఎస్ లో జమ చేయకుండా ఆర్టీసీ యాజమాన్యమే రూ. వెయ్యి కోట్లవరకు వాడుకున్నది. ఈ సొమ్మును ఆర్టీసీ చెల్లించకపోవడంతో సిసిఎస్ తమ సభ్యులకు కొత్త రుణాలు ఇవ్వలేక పోతుంది. రిటైర్ అయిన వారికి కూడా డబ్బులు ఇవ్వలేని స్థితిలో ఉన్నది.

**ఆర్టిసి కార్మికుల ప్రధాన డిమాండ్లు:**
ఆర్టీసీ జేఏసీ కార్మిక సంఘాలు 32 డిమాండ్లతో ఆర్టీసీ యాజమాన్యానికి మార్చి 13 న సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. వారు కోరుతున్న డిమాండ్లలో వేతన సవరణలు, ఇంక్రిమెంట్లు, రిటైర్మెంట్ అయిన వారికి ఇచ్చే సహాయం ఆర్థికంగా కూడుకున్నవి. మిగిలిన రిమాండ్లు ఉద్యోగుల సర్వీసులు, నియామకాలు, ప్రమోషన్లు, మెరుగైన సర్వీస్ కండిషన్ల కొరకు ఉన్నవే.
2017 నుండి ఇవ్వవలసిన ఫిట్మెంట్ ఇంక్రిమెంట్స్ వెంటనే ఇవ్వాలి. 2021 మరియు 2025 సంవత్సరాల వేతన సవరణ చేయాలి. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలి. యాజమాన్యం వాడుకున్న సిసిఎస్ నిధులను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలి.* మహాలక్ష్మి పథకం కింద విడుదల చేయవలసిన డబ్బులు ప్రతినెలవారీగా ఇవ్వాలి. రూ 2500 పాత భకాయిలు విడుదల చేయాలి. * బ్రెడ్ విన్నర్ మరియు మెడికల్ ఇన్వాలిడేషన్ ఉద్యోగుల కుటుంబాలకు ఇచ్చే ఉద్యోగాలు రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలి.* అన్ని కేటగిరీలలో ఖాళీలను భర్తీ చేసి అర్హులైన వారికి ప్రమోషన్ ఇవ్వాలి.* రిటైర్ అయిన ఉద్యోగులకు రావలసిన అన్ని బకాయిలను వెంటనే చెల్లించాలి* ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా అవుట్సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్, కండక్టర్, మెకానిక్ నియామకాలను మానుకోవాలి. ఆర్టీసీ సంస్థ ద్వారానే నియామకాలు చేపట్టాలి. ఎంటి డబ్ల్యూ యాక్ట్ ప్రకారం ఎనిమిది గంటల పని విధానం అమలు చేస్తూ మహిళా కండక్టర్లకు రాత్రి 8 గంటల లోపు పూర్తి అయ్యేలా డ్యూటీ ఇవ్వాలి.

**మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు :**
- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తిచేసి, రెండు పిఆర్సి బకాయిలు చెల్లింపు.
- వచ్చే పిఆర్సి పరిధిలోకి ఆర్టీసీ కార్మికులు.
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు, సదుపాయాలు.
- ఆర్టీసీ బస్టాండ్లు ఆధునీకరణ, విస్తరణ, అదునాతనమైన సౌకర్యాలతో కొత్త సర్వీసులు.
- ఆర్టీసీలో యూనియన్లకు గుర్తింపు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. వీటిని అమలు చేయాలి కార్మిక సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నవి.
- రాష్ట్ర లేబర్ కమిషనర్ గారు సమ్మె నోటీస్ పై కన్సిలేషన్ మీటింగ్ పెట్టడం జరిగింది. మార్చి 25న పెట్టిన మీటింగుకు అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయని పేరుతో వాయిదా వేశారు. ఏప్రిల్ 13న జరిగిన మీటింగుకు మేనేజ్మెంట్ పాల్గొనకుండా వాయిదా కోరింది.

**22 నుండి సమ్మెకు సిద్ధమైన ఆర్టీసీ కార్మికులు:**
ఈనెల 22వ మొదటి షిఫ్ట్ నుండి నిరవధిక సమ్మెకు వెళుతున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. దీనికి సంబంధించిన అన్ని డిపోల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ కార్మికులను సమ్మెకు సిద్ధం చేస్తుంది. కార్మికులు యజమాన్య ఒత్తిడిలకు లోనుకాకుండా ఐక్యంగా డిమాండ్ల సాధనకై ఉద్యమించాలని అందుకు ఏప్రిల్ 22 న మొదటి షిఫ్ట్ నుండి సమ్మెకు సిద్ధం కావాలని జేఏసీ నాయకులు కార్మికులను చైతన్యం చేస్తున్నారు.

**సమ్మె విచ్చిన్నానికి యజమాన్యం కార్మికులపై ఒత్తిడీలు:**
ఆర్టీసీలో సమ్మెలు నిషేధించుతు గత డిసెంబర్ 3న నోటిపై చేయడం జరిగిందని, సమ్మె ఇల్లీగలని, సమ్మెలో ఎవరు పాల్గొన్న, వారిపై కఠిన చర్యలు ఉంటాయని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ లో పనిచేస్తున్న ఉద్యోగులు తొలగించబడతారని ఆర్టిసి ఎండి గారు ప్రకటించారు. దీనితో డియం లు ఆర్టీసీ డిపోల ముందు జరిగే మీటింగులకు, ధర్నాలకు కార్మికులు పాల్గొనకుండా ఒత్తిడి చేయడం, వారికి షాకాజ్ నోటీసులు ఇవ్వడంతో పాటు క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. కాలయాపన చేస్తున్న ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల న్యాయమైన కోరికలను పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం.. రెండున్నర సంవత్సరాలు ఆవుతున్నప్పటికీ, ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదు. లేబర్ కమిషనర్ ఏర్పాటుచేసిన జాయింట్ టింగుకు కూడా రావటం లేదు. ఈ విషయమై ట్రాన్స్ పోర్టు మినిస్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. వారు 'ఆర్టీసీలో సంఘాలు లేనప్పుడు ఎవరితో మాట్లాడాలనే నిర్లక్ష్యంగా వ్యవహరించటాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. ఏప్రిల్ 21 న అర్ధరాత్రి నుండి గత్యంతరం లేక సమ్మె చేపడుతున్నామని కార్మిక సంఘాల జేఏసీ ప్రకటించింది.

**రవాణా శాఖ మంత్రి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు :**
ఆర్టీసీ కార్మికుల సమ్మెపై ట్రాన్స్పోర్ట్ మినిస్టర్ దృష్టికి తీసుకెళ్లగా వారు.. ఆర్టీసీలో సంఘాలు లేనప్పుడు ఎవరితో మాట్లాడాలనే నిర్లక్ష్యంగా వ్యవహరించటాన్ని తీవ్రంగా ఖండిస్తూ..ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ వాటిని అమలు చేసే బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. 40 వేల మంది పనిచేస్తున్నటువంటి రాష్ట్ర ప్రభుత్వ ప్రజారవాణా సంస్థ పై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటం దురదృష్టకరం. వెంటనే ఆర్టీసీ జేఏసీ సంఘాలతో చర్చలు జరిపి వారి న్యాయమైన కోరికలను పరిష్కరించాలని.. సమ్మెను నివారించాలని కోరుతున్నాము.



ఉజ్జిని రత్నాకర్ రావు - ఏఐటీయూసీ సీనియర్ నాయకులు

**ఈత పండ్లు :**

రోగనిరోధక శక్తి పెంచుతుంది* విటమిన్లు, ఖనిజాలు శరీర రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తాయి* తరచూ జలుబు, జ్వరాలు రాకుండా సహాయపడుతుంది



## సంక్షిప్తంగా..

### 20న రైతు నేస్తం

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** జిల్లాలోని రైతులందరికీ ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను నేరుగా అందించడమే లక్ష్యంగా ఈనెల 20న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లావ్యాప్తంగా అన్ని రైతు వేదికలలో "రైతు నేస్తం" కార్యక్రమం నిర్వహించబడుతుందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వీరప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి రెండో విడత "రైతు భరోసా" నిధులను బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేసే కార్యక్రమాన్ని రైతు వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయడం జరుగుతుందన్నారు. భూసార పరీక్షల ప్రాముఖ్యత మరియు సాయిల్ హెల్త్ వాలంటీర్ల ద్వారా రైతులకు అందే సేవలపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించబడుతుందన్నారు. రైతుల సమగ్ర సమాచారం, డిజిటల్ గుర్తింపు మరియు ప్రభుత్వ పథకాలు సులభంగా పొందేందుకు ఉపయోగపడే 'అగ్రి స్టాక్ – ఫార్మర్స్ రిజిస్ట్రీ' నమోదు ప్రక్రియపై కూడా రైతులకు వివరించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్నదాతలందరూ తమ సమీపంలోని రైతు వేదికల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకుని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజ్ఞప్తి చేశారు.

### 238 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



**ముద్ర, నారాయణపేట:** దామరగిద్ద పోలీస్ స్టేషన్ పరిధిలో విఠలాపూర్ గ్రామంలో ఓ పురాతన ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 238 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యం డంప్ ను పోలీసులు దాడులు చేసి గుర్తించారు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలానికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తి అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు గుర్తించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామని ఈ ఘటనపై వెంకటేష్ పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దాడుల్లో నారాయణపేట సిఐ శివశంకర్, దామరగిద్ద ఎస్సై రాజు తదితరులు ఉన్నారు.

### జర్నలిస్టులకు మాజీ ఎమ్మెల్యే వెనుదన్ను



**ముద్ర, నారాయణపేట:** నారాయణపేట నియోజకవర్గం పరిధిలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు నారాయణపేట మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి భరోసాగా నిలుస్తున్నారు. వృత్తినిత్య అనారోగ్య బారిన పడితే వైద్యం కోసం ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు గాను తన సొంత డబ్బులతో జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ కల్పించారు. కోయిలకొండ మండల పరిధిలోని జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ బాండ్ పేపర్లను అందించారు. ఇదిలా ఉండగా నారాయణపేట జిల్లా కేంద్రంలో పని చేస్తున్న జర్నలిస్టులకు సైతం మాజీ ఎమ్మెల్యే ఇదివరకే ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించారు.

### బాలుడిపై కుక్కల దాడి

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లాలోని కల్వకుర్తి పట్టణంలో కుక్కలు స్వైర విహారం చేశాయి. పట్టణంలోని 19వ వార్డులో రెండేళ్ల బాలుడిపై దాడి చేసి గాయపరిచాయి. ఇంటి ఆవరణలో రెండేళ్ల బాలుడు సూఫీయాన్ ఆడుకుంటుండగా ఒక్కసారిగా అటుగా వచ్చిన కుక్కలు అతడి ముఖంపై దాడి చేశాయి. స్థానికులు పరుగున వచ్చి కుక్కలను తరిమి వేసి గాయపడ్డ బాలుడిని ఆసుపత్రికి తరలించారు. కుక్కలను అరికట్టాలని గతంలో అనేకసార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు.

# నిఘా కళ్లకు గంతలు కట్టి..

- ఇసుక అక్రమ రవాణా
- మామూళ్ల మత్తులో అధికార గణం
- తనిఖీలు నామమాత్రం

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** తెలంగాణ – కర్ణాటక సరిహద్దులో ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. క్షేత్రస్థాయిలో నిఘా ఉంచాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ట్రాక్టర్, టిప్పర్ల ద్వార అక్రమంగా జిల్లా సరిహద్దులు దాటుతున్నా, సరిహద్దు ప్రాంతాల వద్ద తనిఖీలు నామమాత్రంగానే సాగుతున్నాయి. కర్ణాటక రాష్ట్రం నుంచి ధరూర్, కేటిదొడ్డి సరిహద్దు గ్రామాలలో నిత్యం పట్టపగలే అక్రమ ఇసుక



రవాణ నడుస్తోంది. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లాలోని కృష్ణానదీ తీర ప్రాంతాలైన సజ్జపురం, యాపల్ దిన్నె, గాజులపాడు ప్రాంతాల నుంచి ధరూర్, కేటిదొడ్డి మండలాలకు అక్రమార్కులు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రవాణ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత ప్రభుత్వ విభాగాలు నిఘా పెట్టకపోవడంతోనే కొందరు ఇసుక వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా, ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక దందాను కొనసాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సరిహద్దు మండలాలో గల నెట్టెంపాడు, ఈర్లబండ, ద్యాగర్ దొడ్డి, నీళ్లహళ్లి, పాతపాలెం, పాగుంటా , వెంకటాపురం, ఇర్కిచేడు , గువ్వలదిన్నె, తదితర గ్రామాలలో అధికారుల నిఘా కరువైందని, దీంతో ఇసుకాసురులు రాజ్యమేలుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత శాఖల అధికారుల కళ్ళముందే ఈ అక్రమ రవాణా సాగుతున్నా, వారు కనీసం పట్టించుకోకపోవడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి ఈ దందాను ప్రోత్సహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ రవాణాపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి. సరిహద్దుల వద్ద నిఘాను కట్టుదిట్టం చేయడంతో పాటు అక్రమ ఇసుక రవాణను అడ్డుకోవల్సిందిగా పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

### మెరిసిన రైతు బిడ్డ

**ముద్ర ప్రతినిధి, జోగులాంబ గద్వాల:** కష్టపడి చదివితే ఏ ఉద్యోగమైనా సాధ్యమని నిరూపించింది ఓ యువతి. ఒకే ప్రయత్నంలో నాలుగు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ప్రతిభ చాటింది.



జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం బొంకూరుకు చెందిన మురళీధర్ రెడ్డి, మాధవి దంపతులది వ్యవసాయ కుటుంబం. వీరి కూతురు ఉన్నతి సీబీఎస్ సీలో బీటెక్ పూర్తి చేసింది. ఐబీపీఎస్ ద్వారా నిర్వహించిన పరీక్షల్లో కెనరా బ్యాంక్ పీవోగా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పీవోగా, న్యూ ఇండియా ఇన్సూరెన్స్ సంస్థలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ఉద్యోగాలు సాధించింది. ఎస్ఎస్సీజీఎల్ ద్వారా నిర్వహించిన పరీక్షలోనూ జీఎస్టీ అండ్ కస్టమ్స్ ఇన్ స్పెక్టర్ ఉద్యోగానికి ఎంపికైంది. నాలుగింట్లో జీఎస్టీ అండ్ కస్టమ్స్ ఇన్స్పెక్టర్ పోస్టును ఎంపిక చేసుకున్నట్లు ఉన్నతి తెలిపింది.

# హిందూ ధర్మం విశిష్టతను తెలుసుకోవాలి

**శ్రీ ఆచార్య కృష్ణానంద స్వామి పిలుపు**





**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** హిందూ ధర్మం యొక్క విశిష్టతను ప్రతి భారతీయుడు తెలుసుకోవాలని, హిందువులంతా ఐక్యంగా నిలిస్తే భారత్ తిరిగి విశ్వగురు స్థానాన్ని సాధిస్తుందని శ్రీగిరి అష్టలక్ష్మి క్షేత్ర వ్యవస్థాపక అధ్యక్షులు పూజ్య శ్రీ ఆచార్య కృష్ణానంద స్వామి పేర్కొన్నారు.ఆదివారం మంగనూరు గ్రామంలో ఘనంగా నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. హిందువులలో ఐక్యత అవసరమని, మన ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలను మరువకూడదని సూచించారు. కేవలం సుఖాల కోసం సంస్కృతిని పక్కన పెట్టడం సరికాదన్నారు.మనిషి జ్ఞానం కలిగిన జీవిగా ఉన్నందున, పిల్లలను సద్వర్తనలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. కుటుంబ విలువలను కాపాడుతూ, సమయానికి పిల్లల వివాహాలు జరిపించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల ద్వారా సంస్కృతి బోధన అవసరమని, స్వదేశీ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు.ముఖ్య వక్తగా పాల్గొన్న చామర్తి దేవేందర్ రాజు మాట్లాడుతూ, రాష్ట్రీయ స్వయం సంగం సేవక్ చేపడుతున్న సమ్మేళనాల ద్వారా 'పంచ పరివర్తన్' అనే ఐదు జీవన సూత్రాలు—సామాజిక సమరసత, కుటుంబ ప్రభోధన్, పౌరవిధులు, స్వదేశీ, పర్యావరణ పరిరక్షణ—సమాజంలో మార్పుకు దోహదం చేస్తాయని తెలిపారు. కుల, వర్ణ, భాష భేదాలు మన బలహీనత కాకూడదని, ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ ఉత్పత్తుల వినియోగం, సమాజ హితం కోసం ఐకమత్యం అవసరమని అన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక స్వయం సేవక్ తయారైతే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా మాంకాల నగేష్, సర్పంచ్ జాలం నాగయ్య యాదవ్, కార్యదర్శి తిమ్మగాళ్ల శ్రీను, మహిళా వక్త ధనాల పూర్ణిమతో పాటు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, హిందూ సంఘాల సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఎంత ఎదిగినా మన సంస్కృతి, సంప్రదాయాలను మరవొద్దు

**బీఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**





**ముద్ర, కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని 125 – గాజుల రామారం డివిజన్ దేవేందర్ నగర్ పద్మావతి కన్వెన్షన్ సెంటర్ నందు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) 100 ఏళ్లను పూర్తి చేసుకున్న సందర్భంగా హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన "హిందూ సమ్మేళనం" కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....ఎంత ఎదిగినా మన సంస్కృతి, సంప్రదాయాలను మనం మరిచిపోవద్దని, నేటి యువత ఆధునికతను అందిపుచ్చుకుంటూ మన సంస్కృతి, సంప్రదాయాలనుభవిష్యత్తు తరాలకు తెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, యోగాధారణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, హిందూ ధర్మ ప్రచారకులు బోధన్ శ్రీ ఉదయ్ మహారాజ్ స్వామీజీ, తత్వ స్కూల్ ఉపాధ్యాయురాలు శ్రీమతి హిమబిందు, జాతీయ సాహిత్య పరిషత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మావుదూరి సూర్యనారాయణమూర్తి, అధ్యక్షులు మినుముల శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి చింత శివరాజ్, కోశాధికారి దొమ్మాట ప్రభాకర్ గౌడ్, సలహాదారులు పగిడి శంకర్ రెడ్డి, సోమిరెడ్డి, టీ.వి.శ్రీను, కస్తూరి బాల్ రాజ్, తెలంగాణ సాయి, వీ. ప్రసాద్ రెడ్డి, నారెడ్డి పూలమ్మ, యాదగిరి రెడ్డి, యాం సాగర్, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, స్థానిక నాయకులు అడ్వకేట్ కమలాకర్, చెట్ల వెంకటేష్, నగేష్, సాయిబాబా, బోయిని మహేష్, శ్రవణ్, ప్రసాద్, శివా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నటుడు ప్రకాష్‌రాజ్‌పై నాగర్ కర్నూల్ పీఎస్‌లో ఫిర్యాదు





**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** హిందూ దేవుళ్లు శ్రీ సీతారామలక్ష్మణులపై సినీ యాక్టర్ ప్రకాష్‌రాజ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై నాగర్ కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ హౌజ్ ఆఫీసర్ గోవర్ధన్‌కు హిందూ సామాజిక సంస్థల ప్రతినిధులు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రకాష్ రాజ్ హిందూ వ్యతిరేక ఉన్మాదిలా ప్రవర్తిస్తున్నాడని, అదేపనిగా హిందూ ఆరాధ్య దేవుళ్లపై విమర్శలు చేస్తున్నాడని తీవ్రంగా ఆరోపించారు. భారతదేశాన్ని ఉత్తర దక్షిణ ప్రాంతాలుగా విడదీసే కుట్రపూరిత వ్యాఖ్యలు చేస్తూ కోటానుకోట్ల రామభక్తుల మనోభావాలను, విశ్వాసాలను కించ పరుస్తున్నాడని విమర్శించారు. హిందువుల సహనశీలత , ఓపికలను బలహీనతలుగా భావించి బరితెగించి మాట్లాడుతున్న హిందూవ్యతిరేక ఉన్మాదిని వెంటనే అరెస్ట్ చేసి చట్టరీత్యా కఠినంగా శిక్షించాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, పిడికిళ్లజంగయ్య, జింకల గణేష్, పాలమూర్ శివ, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు శివయ్యగౌడ్, నాయకులు నర్సంహగౌడ్, బీజేపీ టౌన్ అధ్యక్షులు చెవ్వ ప్రమోద్ కుమార్, టౌన్ జనరల్ సెక్రటరీ అడ్వకేట్ జగదీశ్వర్ రెడ్డి, నాయకులు ఎ.రాజేశ్వర్ రెడ్డి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు కింద పడి కార్మికుడు మృతి

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్‌లో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్న సమయంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో పని చేస్తున్న కుడికిళ్ల గ్రామానికి చెందిన దినసరి కూలీ వెంకటేష్ అనుకోకుండా కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు.సహచర కార్మికులు వెంటనే అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.ఈ ఘటనతో ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది. ప్రమాదానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.



# డ్రంకెన్ డ్రైవ్ లో 174 కేసులు నమోదు





**ముద్ర, మల్కాజ్‌గిరి:** మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు గత వారం 12వ తేదీ నుంచి 18 వరకు ప్రత్యేక డ్రంక్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించి మొత్తం 174 మందిని పట్టుకున్నారు. ఇందులో ద్విచక్ర వాహనదారులు 146 మంది, త్రిచక్ర వాహనదారులు 12 మంది, నాలుగు చక్రాల వాహనదారులు 16 మంది ఉన్నారుపట్టుబడిన వారిలో 163 మంది రక్తంలో ఆల్కహాల్ స్థాయి 36 నుంచి 200 మి.గ్రా/100 మి.లీ మధ్య ఉండగా, మరో 11 మంది 201 నుంచి 300 మి.గ్రా/100 మి.లీ స్థాయిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరందరినీ కోర్టులో హాజరు పరచనున్నట్లు వెల్లడించారు.అలాగే మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని పోలీసులు హెచ్చరించారు. మత్తులో వాహనం నడుపుతూ ప్రమాదం చేసి ప్రాణనష్టం కలిగిస్తే, భారతీయ న్యాయ సంహిత, 2023 సెక్షన్ 105 ప్రకారం కేసు నమోదు చేసి, గరిష్ఠంగా 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధించబడుతుందని స్పష్టం చేశారు.ఇదే సమయంలో గత వారం కోర్టులు మొత్తం 249 డ్రంక్ డ్రైవింగ్ కేసులను పరిష్కరించగా, 12 మందికి జైలు శిక్షతో పాటు జరిమానా, 16 మందికి జరిమానా మరియు సామాజిక సేవ, 221 మందికి కేవలం జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు.

# తొర్రూర్ రంగనాథ ఆలయంలో మళ్లీ చోరీ

**మూడోసారి హుండీలు ఎత్తుకెళ్లిన దుండగులు**

**ముద్ర, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగలు మరోసారి రెచ్చిపోయారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సొంత గ్రామమైన తొర్రూర్‌లో ఉన్న ప్రసిద్ధ రంగనాథ స్వామి ఆలయంలో హుండీని ఎత్తుకెళ్లారు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు, దేవాలయ ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి గర్భాలయం వద్ద ఉన్న రెండు హుండీలను ఎత్తుకెళ్లారు. ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకులు తలుపులు విరగొట్టి ఉండటం చూసి స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఆలయానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆలయంలోని, పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ ఆలయంలో దొంగతనం జరగడం ఇది మూడోసారి కావడం గమనార్హం. వరుస చోరీలపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే దుండగులు పదే పదే రంగనాథ ఆలయాన్ని టార్గెట్ చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని సూచిస్తున్నారు.

# నాగర్ కర్నూల్‌లో అగ్నిమాపక శాఖ వారోత్సవాలు





**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లా కేంద్రంలోని రామకృష్ణ మైత్రీ థియేటర్‌లో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలపై ప్రజల్లో చైతన్యం కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది.ఈ సందర్భంగా అధికారులు అగ్ని ప్రమాదాలు ఎలా జరుగుతాయి, వాటిని ఎలా నివారించాలి అనే అంశాలపై వివరించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేశారు.అగ్నిప్రమాదాలను నియంత్రించే పద్ధతులపై సిబ్బంది ప్రదర్శనలు నిర్వహించి, ప్రత్యక్షంగా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రాధికారి ఐ. కృష్ణమూర్తి పాల్గొని సిబ్బంది పనితీరును వివరించారు.అగ్నిమాపక సిబ్బంది సమగ్ర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి అగ్ని ప్రమాదాలను నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# ఈతకు వెళ్ళిన బాలుడు మృతి

**ముద్ర, నారాయణపేట:** స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన బాలుడు ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన పెళ్లింట విషాదం నెలకొంది. కృష్ణ మండలం గుడెబల్లూరు గ్రామంలో చెరువు కట్ట అశోక్ పెళ్లి సోమవారం జరగాల్సి ఉండగా మహారాష్ట్ర సోలాపూర్ నుంచి బంధువులు రెండు రోజుల క్రితం గ్రామానికి చేరుకున్నారు. బంధువులు పెళ్లి సందడిలో ఉండగా తన్మై (13) అనే బాలుడు స్నేహితులతో కలిసి ఊరి శివారులో ఉన్న వ్యవసాయ బావి దగ్గరకు ఈతకు వెళ్లాడు. బాలుడికి ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఊపిరి ఆడక చనిపోయినట్లు బంధువులు తెలిపారు. బాలుడు మృతి చెందిన సంఘటనతో పెళ్లి భాజాలతో కళకళలాడాల్సిన పెళ్లి పందిరి బంధువుల రోదనలతో విషాదం అలుముకుంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 20.04.2026
www.mudranews.in | @mudranews



### ఈత పండ్లు

ఎముకలు బలంగా చేస్తుంది



★ క్యాల్షియం సమృద్ధిగా ఉండటం వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి.

★ దంతాలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి.

# ఆర్థిక ఇబ్బందులున్నా ఆగని 'భరోసా'

**- ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి**

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, పెగడపల్లి:**

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అడ్డగోలుగా చేసిన అప్పులతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇబ్బందికరంగా ఉన్నా రైతు భరోసా నిధులు విడుదల చేస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఆదివారం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ఐతుపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం రైతు భరోసా నిధులు విడుదల చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన కేవలం రెండు సంవత్సరాలకే మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని చెప్పారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి అడ్డగోలుగా అక్రమ సంపాదన చేసిన బీఆర్ఎస్ అహంకారం తో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిని ఏక వచనంతో మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కేటీఆర్ మాటలు దొర అహంకారానికి నిదర్శనంగా కనిపిస్తున్నాయన్నారు.

తాము ఏనాడు కేసీఆర్ ను ఏక వచనంతో మాట్లాడలేదన్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన అప్పులకు ప్రతినెల రూ. 6వేల కోట్లు వడ్డీ రూపంలో చెల్లిస్తున్నామని వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందులున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నాలుగు గ్యారంటీలు అమలు చేస్తున్నామన్నారు. మిగిలిన రెండు గ్యారెంటీల అమలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నరని తెలిపారు. రబీ సీజన్ లో రైతులు పండించిన పంట విక్రయించడానికి ఏలాంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని కోరారు. ఐతుపల్లిలో ప్రభుత్వ స్థలం ఆరెకరాల్లో రైతుల సౌకర్యార్థం దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఐతుపల్లి, నందగిరి గ్రామాల రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐతుపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మినీ మార్కెట్ యార్డ్ గా ర్చడానికి తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రంలో తూకం పూర్తయిన తర్వాత అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. రైతులను మిల్లర్ల వద్దకు పంపించ వద్దన్నారు. కోతలు విధించే అధికారులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. మంత్రి వెంట పెగడపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## గ్రామాభివృద్ధికి నిరంతర సహకారం



**బోథ్, ముద్ర:**

గ్రామాభివృద్ధి కోసం తాను నిరతరం సహకారిస్తానని హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి తెలిపారు. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి తన స్వగ్రామం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కౌట – బి గ్రామానికి ఆదివారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్థులు సాదర స్వాగతం పలికారు. రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతోనే తాను ఈ పదవికి ఎంపికయ్యానని తెలిపారు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన తాను కష్టాన్ని నమ్ముకుని అంచలంచెలుగా ఎదుగుతూ ఈ స్థితికి చేరానని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా అంటేనే అమాయక అడవి బిడ్డలకు నిలయమన్నారు. అందరి మనసులను గెలుచుకుని తాను ఈ విజయం సాధించానని అన్నారు. హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించేనాటికి తన ఆర్థిక స్థితి ఏమాత్రం సరిగ్గా లేకుండేనని హైకోర్టు అడ్వకేట్ గా నిలదొక్కువడానికి చాలా కష్ట పడాల్సి వచ్చిందన్నారు. తన ఎదుగుదలలో కుటుంబ సభ్యులతో పాటు ఆదిలాబాద్ జిల్లా న్యాయవాద మిత్రులు సహకారం అందిం చారన్నారు. తనపై నమ్మకంతో కేసులను అప్పగించారని, ఆయా కేసులను పరిష్కరించానని తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షుడు ఓరుగంటి స్వామి, ఉప సర్పంచ్ రమణ రెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, వీడీసీ ఉపాధ్యక్షుడు రాజబాబు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ను బదునాం చేయొద్దు

**- డీలిమిటేషన్ తో దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యం తగ్గించేందుకు కుట్ర**

**- సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి**



**ముద్ర, కరీంనగర్:**

కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లు పేరిటా కాంగ్రెస్ ను బదనాం చేయొద్దని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని అర్ అండ్ బీ గెస్ట్ హౌస్ లో కాంగ్రెస్ పార్టీ కార్పోరేషన్ అధ్యక్షుడు అంజన్ కుమార్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజ శేఖర్, కార్పోరేటర్ లతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేసేలా డీలిమిటేషన్ అంశాన్ని తెరపైకి తెచ్చారని ఆరోపించారు. కేవలం ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు పెంచుకొని అధికారాన్ని హస్తగతం చేసుకోవడమే వారి అసలు లక్ష్యమని ఆరోపించారు. బీజేపీ చేస్తున్న ఈ అన్యాయాన్ని తమ రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీని బద్నాం చేయాలన్న బీజేపీ కుట్రలను ప్రజలు ముఖ్యంగా మహిళాలోకం గమనించాలని కోరారు. పన్నెండేళ్లగా పార్లమెంటులో ఏ బిల్లు వీగిపోలేదని, మహిళాబిల్లు విష యంలో కుట్ర జరిగిందన్నారు. ఇప్పటికైనా బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాలును స్వీకరించాలన్నారు. సోమవారం మళ్లీ కేవలం మహిళా బిల్లు తీసుకురావాలని డిమాండ్ చేశారు. తగుల బెట్టాల్సింది ఇండియా కూటమి దిష్టి బొమ్మలు కాదని, మహిళా బిల్లు పట్ల కుట్రలకు పాల్పడ్డందుకు బీజేపీ నాయకుల దిష్టి బొమ్మలనే తగల బెట్టాలని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావే శంలో పిట్టల రవీందర్, కార్పోరేటర్లు మల్లిఖార్జున రాజేందర్, గంట శ్రీనివాస్, కాంతాల జగన్ రెడ్డి,ప ర్వతం మల్లేశం, గుమ్మడి రాజ్ కుమార్ నాయకులు టేల భూమయ్య,ఇక్రమ్,దండి రవీందర్,పెద్దిగారి తిరుపతి, మాసుం ఖాన్, అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# సూరమ్మ ప్రాజెక్టు పనుల వేగం పెంచాలి

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**కోరుట్ల, ముద్ర:**

సూరమ్మ ప్రాజెక్టు పనుల వేగాన్ని పెంచాలని ప్రభుత్వ విప్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఇరిగేషన్ అధికారులతో కలికోటలో సూరమ్మ ప్రాజెక్టు పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్ష సమావేశం లో ఆయన మాట్లాడుతూ త్వరలోనే సూరమ్మ ప్రాజెక్టు కుడి కాలువ పనులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. గత సమావేశం తర్వాత జరిగిన పనులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం బండ నిర్మాణం పనులు జరుగుతున్నాయని అధికారులు వివరించారు మేడిపల్లి, భీమారం, కథలా పూర్ మండలాలలకు సాగు, తాగునీటి అవసరాలను తీర్చే ప్రాజెక్ట్ పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. విప్ వెం ట మండలాధ్యక్షుడు కాయితీ నాగ రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు పుంద్ర నారాయణ రెడ్డి, మాదం వినోద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంఘం మహాసభలను జయప్రదం చేయండి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

హైదరాబాద్ లో ఈ నెల 23 నుంచి 25 నిర్వహించే తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నేత శోభన్ కోరారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో కార్యాలయంలో ఆదివారం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభంపై సమరశంఖం పూరించేందుకు, రైతాంగ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఈ మహాసభలు నిర్వహిచనున్నట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రైతుల జీవి





తాల్లో ఆశించిన మార్పు రాలేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు, పాలకుల నిర్లక్ష్యం మరోవైపు రైతన్నను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో గడిచిన మూడేళ్లలో జరిగిన పోరాటాలను సమీక్షించుకోవలసిన అవసరం ఉందన్నారు. ఈ మహాసభలకు అఖిల భారత రైతు సంఘం జాతీయ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ అశోక్ దావలే, డాక్టర్ విజూ కృష్ణన్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలం గాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం శంకర్ ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బర్కుంటా గంగారాం, సుంచుల నారాయణ లు, జిల్లా నాయకులు కె. శ్రీనివాస్, మునేసుల రాజేశ్వర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం

**- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, పెగడపల్లి:** హార్వెస్టర్ బావిలో పడిన ఘటనలో మృతి చెందిన బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్ భరోసా ఇచ్చారు. పెగడపల్లి మండలం నందగిరి గ్రామంలో హార్వెస్టర్ బావిలో పడ్డ ప్రమాద స్థలాన్ని ఆదివారం మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మరణించిన హార్వెస్టర్ డ్రైవర్ మధు మృతదేహాన్ని బయటకు తీసే చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం తరపున అన్ని విధాల ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మృతదేహాన్ని పలికితీయడానికి తగిన చర్యలు తీసుకోవాలని జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్ ను ఫోన్ లో ఆదేశించారు. మృతదేహం వెలికి తీసిన తర్వాత పోస్టుమార్టం అయ్యేవరకు అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. అంత్యక్రియలు పూర్తయ్యేవరకు కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి అండగా నిలవాలి సూచించారు.


నందగిరి గ్రామంలో ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న బావితో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు సోమవారం నందగిరి గ్రామాన్ని సందర్శించి తగిన జాగ్రత్తలు చేపట్టాలని మంత్రి ఫోన్ లో అధికారులను ఆదేశించారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి



**కోరుట్ల, ముద్ర:** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని ఎంఈఓ గంగుల నరేశం సూచించారు. ఆదివారం నగరంలోని లిటిల్ జీనియస్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ ఉన్నత ప్రమాణాలతో ఉత్తమ విద్యను అందిస్తున్న లిటిల్ జీనియస్ స్కూల్ యజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థుల ఆటపాటలు అథితులను అలరించాయి. అనంతరం స్కూల్ కమిటీ ఎంఈఓను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్బీఎం కళాశాల చైర్మన్ పోతని ప్రవీణ్, పాఠశాల హైస్కూల్ ప్రిన్సిపాల్ కలకుంట్ల రాధాకృష్ణ, పాఠశాల డైరెక్టర్ కొత్త రాజు, చీఫ్ అడ్వైజర్ కటుకం శంకర్, ప్రైమరీ ప్రిన్సిపాల్ వినోద, ప్రీ–ప్రైమరీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఎెడ్యుకేషనల్ సొసైటీ మెంబర్లు లావణ్య, జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ముగిసిన వరాహ పురాణ సప్తాహం





**కోరుట్ల, ముద్ర:** పట్టణంలోని వాసవి కళ్యాణ భవనంలో సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వారం రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ వరాహ మహాపురాణ సప్తాహం ఆదివారం ముగిసింది. శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ ప్రవచనాలు వివరించారు. సప్తాహ ముగింపు ప్రత్యేక గురుపూజ, గురువందనం కార్యక్రమాలు నిర్విహించారు. హ. ఈ సందర్భంగా భక్తులు గర్రెపల్లి మహేశ్వరశర్మ ను ఘనంగా సత్కరించారు. పాల్గొన్న భక్తులందరికీ అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు మంచాల జగన్, ప్రధాన కార్యదర్శి బట్టు హరికృష్ణ, కోశాధికారి రేగుంట రాజారాం, పురాణ కమిటీ చైర్మన్, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పడిగెల శ్రీనివాస్, పురాణ కమిటీ కన్వీనర్ ఎలిమి బుచ్చన్న, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమటీ చైర్మన్ పడిగెల పవన్, నిర్వాహకులు రుద్ర సుధాకర్, మంచాల రాజలింగం, గుండేటి భృగు మహర్షి, గుంటుక ప్రకాష్, అల్లాడి ప్రవీణ్, తోకల రమేష్, ఎనగందుల రాజేంద్రప్రసాద్, చౌడారపు శ్రీనివాస్, ఎనగందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మం గొప్పతనం వివరించాలి






**కోరుట్ల, ముద్ర:** ప్రతి తల్లి తన పిల్లలకు మన సనాతన ధర్మం గొప్పతనం గురించి వివరించాలని కాశీ పీఠాధిపతి దండి స్వామి సూచించారు. పట్టణంలోని ముత్యాల వాడ బస్తీలో ఆదివాం హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కాశీ పీఠాధిపతి దండి స్వామి, ప్రధాన వక్త డా. బి శంకర్, చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దండి స్వామి మాట్లాడారు. కౌన్సిలర్లు శీలం జయలక్ష్మీ వేణుగోపాల్, పుప్పాల ఉమాదేవి ప్రభాకర్, టేకుల శిరీష నరేష్, గుగులావత్ శ్రీకాంత్, ఆర్ఎస్ఎస్ విభాగ్ వ్యవస్థ ప్రముఖ్ రాజ గంగాధర్, నగర సహ్ బౌద్ధిక్ ప్రముఖ్ రవి, సమ్మేళన సమితి అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, ప టేల్ యూత్ నాయకులు పా ల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
20.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews
7
తూర్పు తెలంగాణ
వరంగల్, ఖమ్మం, నల్గొండ
Warangal,Khammam,Nalgonda

**ఈత పండ్లు**

రక్తహీనత తగ్గిస్తుంది. ఐరన్ ఎక్కువగా ఉండటం వల్ల హిమోగ్లోబిన్ పెరుగుతుంది. అనీమియా సమస్య తగ్గించడంలో ఉపయోగపడుతుంది





## కెసిఆర్, గాదరి చిత్ర పటాలకు జలాభిషేకం

**ముద్ర, మోత్కూర్:** కాళేశ్వరం నీళ్లు ఆలేరు మీదుగా మోత్కూరు చేరడంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు జంగ శ్రీను మాట్లాడుతూ.. 14 సంవత్సరాలు ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించి రైతులు బాధ చూడలేక కాళేశ్వరం ప్రాజెక్టు కడితే కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం సిగ్గు చేటని అన్నారు. ఎండ కాలం లో కూడా కాళేశ్వరం నీళ్లు మోత్కూరు వరకు వచ్చాయంటే ఇది కేసీఆర్ కృషి పలితమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, కౌన్సిలర్ నల్ల మధు, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేష్, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షులు కొండ సోంమల్లు, డివిఎంసి మెంబర్ దాసరి తిరుమలేష్, జిల్లా నాయకులు కూరెళ్ళ పరమేష్, మాజీ సర్పంచి బయ్యాని పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.




## బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

**ముద్ర,మోత్కూర్:** అక్షయ తృతీయ సందర్భంగా జస్ట్ రైట్స్ వారి సౌజన్యంతో స్కోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల కోఆర్డినేటర్ కురిమేటి యాదయ్య మోత్కూరు, అడ్డగుడూరు , గోవిందాపురం,పరిధిలోని పలు చర్చిల్లో బాల్యవివాహాల నిర్మూలన పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించి బాల్యవివాహాలు జరగకుండా 1098 టోల్ ఫ్రీ నెంబర్ కి కాల్ చేసి, సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల చర్చి ఫాదర్లు, పాస్టర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ముద్ర, మోత్కూరు:** వేసవి దృష్ట్యా కిడ్నీ వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ రామంతపూర్ మ్యాట్రిక్స్ హాస్పిటల్ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మోత్కూరులో శ్రీ లక్ష్మీనరసింహ ఆసుపత్రిలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ మోత్కూరు మండల శాఖ, మ్యాట్రిక్స్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వేసవి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కిడ్నీ రోగులు వేసవిలో అధికంగా స్వచ్ఛమైన నీరు తాగాలని కిడ్నీ డాక్టర్ల సూచన మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి లక్ష్మీ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ఈ వేసవిలో పేదలకు ఉచిత వైద్య సేవలు అందించాలని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 112 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందజేశారు. శిబిరంలో డయాబెటిక్ స్పెషలిస్ట్ డాక్టర్ గురు రాజ్ కులకర్ణి ,ఆర్థోసర్జన్ డాక్టర్ రాజకుమార్, రెడ్ క్రాస్ మండల అధ్యక్షుడు ఓ సత్యనాద్, జిల్లా డైరెక్టర్ ఎస్ఎన్ చారి, ప్రతినిధులు సీ అనిల్, కె నర్సిరెడ్డి యూత్ విభాగం జిల్లా అధ్యక్షుడు బీసు మత్స్యగిరి, శివ, మ్యాట్రిక్స్ హాస్పిటల్ మేనేజర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## పాటిమట్ల గ్రామానికి ఫ్రీజర్ అందజేత


**ముద్ర, మోత్కూర్:** హైదరాబాద్ జూబ్లీహిల్స్ లయన్స్ క్లబ్ సహకారంతో రాజమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పాటిమట్ల గ్రామ పంచాయతీకి ఫ్రీజర్ అందజేశారు. పాటిమట్ల గ్రామంలో రాజమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలలో భాగంగా రాజమాత ఫౌండేషన్ సభ్యులు గ్రామ పంచాయతీకి ఫ్రీజర్‌ను అందజేశారు. రాజమాత ఫౌండేషన్ అధ్యక్షులు మనోజ్ రెడ్డి, ఉదయ్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండ రమా విజయ రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు.




# ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్**

**ముద్ర, భద్రాద్రి జిల్లా:** జిల్లాలోని ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఆదివారం వ్యవసాయ శాఖ ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలు మరియు మీ సేవ కేంద్రాల మేనేజర్లతో గూగుల్ మీట్ ద్వారా ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆధార్ ద్వారా దేశంలోని ప్రతి పౌరునికి గుర్తింపు కల్పించినట్లుగానే ప్రతి రైతుకు 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య (ఫార్మర్ ఐడి) కేటాయించే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు చేపట్టబడినట్లు తెలిపారు. భూమి కలిగిన ప్రతి రైతుకు సంబంధించిన భూ యాజమాన్య వివరాలు, వ్యక్తిగత సమాచారం ఆధారంగా ఫార్మర్ రిజిస్ట్రీ రూపొందించబడుతుందని చెప్పారు. రెవెన్యూ శాఖ వద్ద ఉన్న భూ రికార్డులను రైతుల ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేసి ఫార్మర్ ఐడీ జారీ చేయడం జరుగుతుందని వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయడం ద్వారా ఎటువంటి కొత్త చట్టబద్ధ యాజమాన్య హక్కులు కల్పించబడవని స్పష్టం చేశారు. ఇది కేవలం ప్రభుత్వ రికార్డులలో ఉన్న భూ వివరాలను ప్రామాణికంగా తీసుకొని రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను అందించడానికి మాత్రమే ఉపయోగపడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను అనుసంధానం చేయడం జరుగుతుందని, ముఖ్యంగా పీఎం కిసాన్ పథకం తదుపరి విడతల లబ్ధి పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరిగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. రాబోయే వర్షాకాలం సీజన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అయిన రైతు భరోసా, రుణమాఫీ, మొక్కజొన్న, పత్తి, ధాన్యం కొనుగోలు, యూరియా మరియు ఇతర ఎరువుల పంపిణీకి ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అవుతుందని స్పష్టం చేశారు. రైతులు తమ




ఆధార్ కార్డు, భూ యాజమాన్య పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో సమీపంలోని వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించవచ్చని, లేక సమీప మీ సేవ కేంద్రాలను సంప్రదించి వెంటనే ఫార్మర్ ఐడీ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు, మీసేవ కేంద్రాల వారు తమ పరిధిలోని ప్రతి రైతుకు అవగాహన కల్పించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.




## మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మేడే వారోత్సవాలను అన్ని రంగాల వారు కలిసి నిర్వహించాలని అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంగాల వారీగా మున్సిపల్ కార్మికులు భవన నిర్మాణ కార్మికులు హోమాలి బస్టాండ్ గ్యాస్ కార్మికులంతా వారి కూడలిలో జెండాలు ఎగర వేసుకొని రైల్వే స్టేషన్ నుండి పట్టణంలో ర్యాలీగా వచ్చి రైతు బజార్ వద్ద బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఊదరి రామచందర్, ఆడెపు వెంకటేష్, సిరిపంగి రవి, బొట్టు బాల నరసింహ, పడిగెల కుమార్, విజయ్, మాచర్ల సత్యమ్మ, కొమ్ము వరమ్మ, దేవరకొండ మంజుల, భాగ్యమ్మ, సునీత, శ్యామల , ఉడుత సోములు, కత్తెర పోయిన శంకర్, ప్రసాద్, మున్సిపల్ కార్మికులు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

# సమగ్ర చట్టం చేయాలి

**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టి పెల్లిసైదులు**

**ముద్ర, తుంగతుర్తి** దేశంలో వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టి పెల్లిసైదులు అన్నారు. ఆదివారం తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి గ్రామంలో జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ దేశానికి తిండి పెడుతూ సంపదను సృష్టిస్తున్న వ్యవసాయ కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలునిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి




జాజి గల్ల ముత్తయ్య, నాయకులు గౌరోజు గోవిందా చారి అధ్యక్షత వర్గంగా వ్యవహరించిన ఈ మహాసభలోసిఐటియు జిల్లా నాయకులు బుర్ర శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పులుసు సత్యం, మాజీ జెడ్పిటిసి తాటి విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్

**ముద్ర సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** జిల్లాలో జరగనున్న పదో తరగతి అండ్ ఇంటర్మీడియట్ (తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ) పరీక్షలు జరగనున్న నేప థ్యంలో, పరీక్షా కేంద్రాల వద్ద163 బి ఎన్ఎస్ ఎస్ 2023 సెక్షన్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని సూర్యా పేట జిల్లా ఎస్పి తెలిపారు. ఈ ఆంక్ష లు సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్ పట్టణాల్లో పరీక్షలు జగనున్న పరీక్షా కేంద్రాల పరిసరాల్లో అమలు లో ఉంటుందని అన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటాన్ని నిషేధించారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ముద్ర, మోత్కూర్:** హైదరాబాదు నుంచి వలిగొండ మీదుగా మహబూబాబాద్ వెళుతున్న ఉండాయి వెర్నా కారు మోత్కూర్ మండలం పాలడుగు గ్రామంలో బైకును ఢీ కొట్టడంతో బైక్ పై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. వేగం అదుపులోకి రాక అదే కారు మరో ట్రాలీ ఆటోను ఢీ కొట్టి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. మృతుడు ఎర్ర కాలువకు చెందిన ముక్కెర చంద్రయ్య (70)గా గుర్తించారు. అతను పాలడుగు నుండి స్వగ్రామానికి వెళ్లే సర్వీస్ రోడ్డు వైపు వెళ్తుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు భార్యలు కుమార్తె నలుగురు కుమారులు ఉన్నారు. భార్య కుమారులు చెన్నైలో ఉంటుండగా మరో భార్యతో చంద్రయ్య ఎర్ర కాలువ గ్రామంలో నివాసం ఉంటూ వ్యవసాయం చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# మేడే స్ఫూర్తితో పోరాడాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా చేసి వారి హక్కులను హరించాలని చూస్తుందని మేడే స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్ ల రద్దుకై పోరాటాలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బూరుగు స్వప్న అధ్యక్షతన జరిగిన సీఐటీయూ రాజాపేట మండల జనరల్ బాడీ సమావేశంలోఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ..

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలకు సవరణలు చేస్తూ నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి కార్మికుల జీవన విధానం మీద, వారి స్థితిగతుల మీద ప్రత్యక్షంగా దాడి చేయాలనే ప్రయత్నం చేస్తుందని, ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలను ఐసిడిఎస్, ఎల్ఐసి, టెలికం, రవాణా, రైల్వే,రక్షణ రంగాలను ప్రైవేటుపరం చేయాలనే ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు భాగ్యలక్షి , మాధవి, వసంత, పద్మ, యాదగిరి, భాగ్య, స్వరూప పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ హైస్కూల్ లో 2000--2001 టెన్త్ చదివి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇటీవల చనిపోయిన తమ మిత్రులకు నివాళులర్పించారు. తమ పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. మున్సిపల్ కౌన్సిలర్లుగా సర్పంచులుగా వివిధ హోదాలలో ఉన్నత స్థానంలో ఎదిగిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ 30వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ ఎండీ.లయిక్ అహ్మద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిక్కుల వెంకటేష్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నగారి కృష్ణ, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్, మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, శివ, చందు, సామల బాబు, రాపాక వెంకటేష్, పరమేష్, రమేష్, ఎంకర్ల రవి, శివకుమార్, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

## ఆటోను ఢీ కొట్టిన లారీ

**ముద్ర మోత్కూర్:** మండలంలోని పాటిమట్ల చౌరస్తా వద్ద ఆగి ఉన్న ప్యాసింజర్ ఆటోను వలిగొండ నుండి తిరుమలగిరి వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఆటోలో ఉన్న చౌళ్ళ రామారం గ్రామానికి చెందిన పంగ సోమన్న స్వల్పంగా గాయపడ్డాడు. అతడ్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు.

# బెల్లి లలితక్క విగ్రహా ప్రతిష్ఠాపన కమిటీ ఎన్నిక

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** తెలంగాణ మలిదశ పోరాట గాన కోకిల బెల్లి లలిత విగ్రహా ప్రతిష్ఠాపన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్వీ హోటల్ లో బెల్లి లలిత కుమారుడు సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన సన్నాహక సమావేశం జరిగింది. కమిటీ సమన్వయ కర్తలుగా బెల్లి లలిత కుమారుడు సూర్యప్రకాష్, జన్ని వెన్నెల వ్యవహరించనున్నారు. ఆమె పోరాట చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఓ పుస్తకాన్ని తీసుకురావాలని నిర్ణయించారు. పుస్తకం కోసం రచనలు, బెల్లి లలితతో ఉన్న జ్ఞాపకాలు, అనుభవాలను ప్రతి ఒక్కరూ రాసి పంపాలని కోరారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా అందరూ కలిసి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం కృషి చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో భట్టు రామచంద్రయ్య, సామ మల్లారెడ్డి,




తంగెళ్లపల్లి రవికుమార్, పూస శ్రీనివాస్, భువనగిరి శ్రీనివాస్ నేత, శ్రీనివాసాచార్యులు, దయ్యాల రామనర్సయ్య, ఏశాల అశోక్, పుట్ట వీరేష్ యాదవ్, ఎల్లముల జంగయ్య, పాశపాక మహేశ్, ఆరుముళ్ల రమేష్, శ్రీరాం మురళికృష్ణ, చిలుకల రమేష్, ఊదరి సతీష్, ఏషాల అశోక్, నక్కల చిరంజీవి యాదవ్, కైరం కొండ వెంకటేష్, భూక్యా సంతోష్ నాయక్, పాక జహంగీర్, ర్యాకల రమేష్, రాసాల బాలస్వామి, రాసాల దయాకర్, రాసాల నర్సింహా, జింకల శ్రీనివాస్ యాదవ్, మేకల బాలు, శ్రీరామ్ శరత్, ఎండి బాబు, రామ్ రాజ్, భరత్, ముక్కర్ల వెంకటేష్, శ్రీనివాస్, మహేష్, రఫియొద్దీన్, మేకల ఆంజనేయులు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

**ఈత పండ్లు : పిల్లల ఎదుగుదలకు మంచిది**

పోషకాలు అధికంగా ఉండటం వల్ల పిల్లల గ్రోత్‌కు సహకరిస్తాయి. శారీరక, మానసిక అభివృద్ధికి దోహదం చేస్తాయి.



# కలెక్టర్ ఎదుట నిరసన దీక్షను జయప్రదం చేయండి

- రెడ్డి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు దొంగల బాపురెడ్డి

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



రెడ్డి కార్పొరేషన్‌కు విధివిధానాలు ఖరారు చేసి రూ. 5 వేల కోట్ల నిధులు కేటాయించి పాలకవర్గం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల 21న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న నిరసన దీక్షలో రెడ్డి సోదరులు పాల్గొని జయప్రదం చేయాలని రెడ్డి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు దొంగల బాపురెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నారాయణరావుపేట మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. 2023 కాంగ్రెస్ మేనిఫెస్టోలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు రూ. 5 వేల కోట్ల నిధులతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను తుంగలో తొక్కిందన్నారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే పేద రెడ్డి కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రస్తుతం కూలీ పనులు చేస్తూ జీవనం గడుపుతున్న వారు ఎంతోమంది ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రెడ్డి కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం నాడు కలెక్టరేట్ ముందు నిర్వహించనున్న నిరసన దీక్షకు జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి రెడ్డి సోదరులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

# జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

వ్యాయామ ఉపాధ్యాయ సంఘం మెదక్ జిల్లా సర్వసభ్య సమావేశం, ఎన్నికలు తెలంగాణ భవన్‌లో నిర్వహించారు. ఎన్నికల రాష్ట్ర పరిశీలకులు విద్యాసాగర్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్. నాగరాజు ఆధ్వర్యంలో పెటాటీస్ డైరీని ఆవిష్కరించారు. మెదక్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా ఎస్. శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏ. మధుసూదన్, జిల్లా కోశాధికారిగా కే. మహిపాల్ ఎన్నికయ్యారు. మహిళా అధ్యక్షురాలిగా శారదను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నాగరాజు, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి రమేష్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మాధవ రెడ్డి, స్టేట్ ఈసీ మెంబర్ చంద్రమోహన్, సెక్రటరీ శ్వేతా, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు కిషోర్, రతన్, అశోక్, దేవేందర్ రెడ్డి, వినోద్, రవి, నరేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. టీఎన్‌జీఓ అధ్యక్షుడు దొంత నరేందర్ నూతన కార్యవర్గాన్ని సత్కరించి అభినందించారు.


# జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణస్వీకారం




**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం తుప్రాన్ పట్టణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఆర్యవైశ్యులు సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు చంద్రపాల్, కైలాస శ్రీనివాస్, కైలాస రామచంద్రం, గంప శ్రీనివాస్, ఎన్సీ రాజమౌళి, శివనంది నారాయణ, ఉట్కూరి వీరేశం హాజరయ్యారు. జిల్లా అధ్యక్షులుగా పల్లెర్ల రవీందర్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా బుక్క అశోక్, కోశాధికారిగా మరుమళ్ళ అశోక్, మహిళా విభాగం అధ్యక్షులుగా రాగి వనజ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో, రామాయంపేట మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య నాగరాజు, రాగి అశోక్ తొడుపునూరి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ముగ్గురు కౌన్సిలర్లు



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు సంధ్య నవీన్(13వ వార్డు), గౌస్ ఖురేషి(22వ వార్డు), శృతి సంతోష్(23వ వార్డు) కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే రోహిత్ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఇప్పటికే 16వ వార్డు కౌన్సిలర్ రాజశేఖర్ బీ ఆర్ ఎస్ నుండి గెలుపొంది ఇటీవల కాంగ్రెస్ లో చేరిన విషయం తెలిసిందే.

# కూలీలు, రైతుల సమస్యలు పరిష్కరించాలి

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**




సిద్దిపేట జిల్లాలో రైతులు, కూలీలు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు అగమ్యగోచర స్థితిలో ఉన్నారని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు తెలిపారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన సిపిఎం సిద్దిపేట జిల్లా కమిటీ సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి అధ్యక్షతన జిల్లా కార్యాలయం కార్మికకర్షక భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చుక్క రాములు మాట్లాడుతూ, సిద్దిపేట జిల్లాలో రైతు భరోసా పథకం కింద ఎకరం లోపు ఉన్న వారందరికీ సాయం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించినప్పటికీ, ఆ హామీని పూర్తిగా అమలు చేయలేకపోయిందని విమర్శించారు. పంటలు పండినప్పటికీ రైతులు ధాన్యాన్ని కల్లాల్లో నిల్వ ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉందన్నారు. వెంటనే కేంద్రాలను ప్రారంభించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు గత మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, పని ప్రదేశాల్లో ఉదయం, సాయంత్రం ఫోటోలు తీయడం, సిగ్నల్ సమస్యల వల్ల హాజరు నమోదు కాకపోవడం వంటి ఆంక్షలతో కూలీలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం స్పందించి తాగునీరు అందించాలని, తాగు మరియు సాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో అనేక సమస్యలు పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించకపోతే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో భారీ ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, గౌడుబర్ల భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకటమావో, ఆలేటి యాదగిరి, చోపరి రవికుమార్, అమ్ముల బాలనర్సయ్య, తిపారపు శ్రీనివాస్, తాడూరి రవీందర్, అత్తిని శారద, జాలిగపు శిరీష, దాసరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆందోళనలో పొద్దుతిరుగుడు రైతులు

- రాష్ట్ర ప్రభుత్వ వాటా కొనుగోలు లేక రైతుల ఇబ్బందులు
- అసెంబ్లీలో హరీష్ రావు మాట్లాడిన తర్వాత కొనుగోలు కేంద్రాల ప్రారంభం
- పొద్దుతిరుగుడు కొనుగోలు చేయకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన హెచ్చరిక

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



ఇటీవల అసెంబ్లీలో హరీష్ రావు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు గట్టిగా మాట్లాడిన అనంతరం మక్కలు, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మచ్చ వేణుగోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గుడాల శ్రీకాంత్ గౌడ్, ఆంజనేయులు తదితరులు తెలిపారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు ఎంతో కష్టపడి పండించిన పొద్దుతిరుగుడు పంటను మార్కెట్ యార్డులకు అమ్మకానికి తీసుకువచ్చారని, మార్కెట్లలో కుప్పలుగా పేరుకుపోయి రైతులు ఎదురుచూస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ, మార్కెట్ యార్డుల్లో కేవలం కేంద్ర ప్రభుత్వ వాటా కొనుగోలు ప్రక్రియ మాత్రమే పూర్తయిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా విషయంలో స్పష్టత లేకపోవడంతో మార్కెట్ యార్డుల్లో పొద్దుతిరుగుడు కుప్పలుగా పేరుకుపోయి రైతులు ఆందోళనలో ఉన్నారని చెప్పారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వ వాటా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణు, మనోజ్ గౌడ్, పర్శరాములు గౌడ్, నరేష్, సందీప్, అమర్, శ్రీకాంత్, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి సంక్షేమ వారం ప్రారంభం

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఏడు రోజుల పాటు నిర్వహించనున్న సంక్షేమ వారానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన సమావేశంలో సంక్షేమ వారానికి సంబంధించి జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలపై అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఎంపీడీవోలు, వివిధ సంక్షేమ శాఖ అధికారులు, ఆర్‌సీవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ఏర్పాట్లు సమగ్రంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. రోజువారీ షెడ్యూల్ కార్యక్రమాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని ఎస్సి, ఎస్టి, బీసీ, మైనారిటీ గురుకులాలు, వసతి గృహాలలో వంటగది, పారిశుద్ధ్యం, మరమ్మత్తు పనులు చేపట్టాలని తెలిపారు. ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ విద్యాలయాల్లో పారిశుధ్య పనులతో పాటు విద్యార్థులకు క్విజ్, విద్యా విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని సూచించారు. వసతి గృహాలలో మరమ్మత్తు పనులను చేపట్టడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి వసతులపై చర్చించాలని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు, వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని, రైతు రిజిస్ట్రీను 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

# మెదక్ లో అగ్నిమాపక శాఖ ర్యాలీ

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**




అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మెదక్ పట్టణంలో నిర్వహించిన ర్యాలీని డీఎఫ్ఓ వేణు జెండా ఊపి ప్రారంభించారు. మెదక్ ఫైర్ స్టేషన్ నుండి వాహనాల ర్యాలీ కొత్త బస్టాండ్ మీదుగా ఆటోనగర్, కొత్త బస్టాండ్ మీదుగా ఆటోనగర్, పోలీస్ స్టేషన్ చేరుకున్నాయి. ఎస్డిఆర్ఎఫ్, అగ్నిమాపక శకటాలు ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. ఎస్ఎఫ్ఓలు వెంకటేష్, ప్రశాంత్, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలలో అగ్ని ప్రమాదాల నివారణ భద్రత చర్యలపై అవగాహన కల్పించారు. సిబ్బంది నరసయ్య, కలాలుద్దీన్, ఫరీద్ ఖాన్, నరేష్, సురేష్, స్వామి, ప్రదీప్, నాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలు సమాజ సేవలో ముందుండాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



సమాజ సేవ చేసేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఎప్పుడూ ముందుండాలని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ తెలిపారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎం.డి. షాబుద్దీన్ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్‌స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఆదివారం మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణతో కలిసి ఆయన మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ, వేసవి తాపాన్ని తగ్గించేందుకు చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పాత బస్‌స్టాండ్ వద్ద ఎం.డి. షాబుద్దీన్ ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఎంతోమంది దాహాన్ని తీర్చడమే కాకుండా వారి ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. ఇలాగే కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ముందుకొచ్చి వేసవిలో ప్రజల దాహాన్ని తీర్చేందుకు ఇలాంటి కేంద్రాలను మరింతగా ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బొమ్మల యాదగిరి, ఎం.డి. కలీం, మీసం మహేందర్, ముద్దం లక్ష్మి, ఎం.డి. మాజీ ఖాన్, ఎం.డి. అహ్మద్, ఎం.డి. జానీ, ఎం.డి. సజ్జు, ఎం.డి. షఫీ, బొమ్మల శేఖర్, మహేందర్, ఎం.డి. గబ్బర్, ఎం.డి. మోస్, ఎం.డి. నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# శాఖాహారుల ర్యాలీ

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ పట్టణంలో పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ మూమెంట్ ఆధ్వర్యంలో మెగా శాఖాహార ర్యాలీ నిర్వహించారు. మెదక్ పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ ఎండీ.షమీ కౌన్సిలర్ పాల్గొని ఇక నుండి తాను కూడా పూర్తిగా శాఖాహారిగా మారిపోతానని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమం చౌదరి శోభారాణి, బొమ్మ బాలేశం, కోలాచల ప్రవీణ్ కుమార్, రామ్మోహన్, సంతోష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతా శాఖాహారులుగా మారాలి, అలాగే మూగజీవాలను హింసించకూడదని, ప్రజలలో మార్పు తేవడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
20.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఈత పండ్లు : మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది**



- జ్ఞాపకశక్తి పెంచడంలో సహాయపడుతుంది
- అల్జీమర్స్ వంటి సమస్యలకు ఉపశమనం కలిగించవచ్చు



# కురిసింది వాన.. హైదరాబాద్‌లోనా..

**ముద్ర, హైదరాబాద్:**

ఎండ వేడిమికి తాళలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్న హైదరాబాద్ నగర ప్రజలను వరుణుడు సాంత్వన పరిచాడు. హైదరాబాద్‌లో పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వాన పడుతోంది. చింతల్‌లోని పద్మానగర్‌లో ఈదురుగాలుల ధాటికి భారీ వృక్షం నేల కూలింది. దీంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. కూకట్‌పల్లి, మూసాపేట్, జేఎన్టీయూ, నిజాంపేట్, కేపీహెచ్‌బీ, జీడిమెట్ల ప్రాంతాల్లో వడగళ్ల వాన కురుస్తోంది. మరోవైపు సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. న్యూబోయిన్‌పల్లి, లోతుకుంట, తిరుమలగిరి, బొల్లారం తదితర ప్రాంతాల్లో వడగళ్ల వాన కురిసింది.



# గత ప్రభుత్వంలో రైతులు ఆగమైపోయారు

- కానుకుర్తి రిజర్వాయర్ కు భూమి పూజ
- మంత్రి వాకిటి శ్రీహరి

**ముద్ర, నారాయణపేట:**

గత ప్రభుత్వ దౌర్భాగ్యం వల్ల పాలమూరు రైతులు ఆగమైపోయారని పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సేవల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా దామరగిద్ద మండలం కానుకుర్తి వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి మంత్రి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చి గత ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని మొదటి విడతను కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. రైతుల బాధలు తెలిసిన వాడిగా ఈ ప్రాంత బిడ్డ అయినందుకే సీఎం రేవంత్ రెడ్డి మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని హామీనిచ్చారు. భారతదేశ చరిత్రలో నిలిచిపోయేలా రైతుల భూములకు అధిక మొత్తంలో పరిహారం ఇచ్చిన ఏకైక ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని తెలిపారు. రూ. 4వేల 500 కోట్ల బడ్జెట్ తో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తున్నామన్నారు. మరో 20 నెలల్లో ఈ ప్రాజెక్టు పూర్తయితే ఇక్కడి ప్రాంతమంతా సస్యశ్యామలమవుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన కానుకుర్తి గ్రామం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి 95 శాతం మంది రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడాన్నీ భవిష్యత్ తరాలు ఆదర్శంగా తీసుకుంటాయన్నారు. మీ నిర్ణయాన్ని రాబోయే తరాలు స్మరించుకుంటాయని కితాబునిచ్చారు. డీసీసీ మాజీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బూర్జువా పార్టీలను వీడి జాగృతిలో చేరండి

- ఉద్యమకారులంతా ఒక్కతాటిపైకి రావాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- జాగృతిలో చేరిన బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ప్రజలకు సేవ చేసేందుకు అడ్డంకిగా ఉన్న బూర్జువా పార్టీలను వదిలేసి కొత్త రాజకీయ శక్తిగా రాబోతున్న జాగృతిలో చేరాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. బోథ్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు రాథోడ్ బాపూరావు ఆదివారం తన అనుచరులతో కలిసి తెలంగాణ జాగృతిలో చేరారు. కల్వకుంట్ల కవిత ఆయనకు కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పనిచేసిన నాయకులంతా ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి కోసం ఒక్కతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. 2007లో కుటుంబంతో సహా తాను బోథ్ కు వెళ్లి అక్కడి ఆదివాసీలు, గిరిజనుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించానని గుర్తు చేసుకున్నారు. వాన పడితే ఆదివాసీ గూడాలు, మన్నెం జ్వర పీడితులతో నిండి ఉండేదని, ఆ పరిస్థితి నుంచి మార్పు రావాలనే తెలంగాణ సాధించుకోవాలని అందరం ఐక్యంగా ఉద్యమించామని గుర్తు చేశారు. ఏ స్ఫూర్తితో రాష్ట్ర సాధన కోసం ఉద్యమించామో, ఇప్పుడు రాష్ట్ర పునర్నిర్మాణం కోసం అదే స్ఫూర్తితో పని చేయాల్సి ఉందన్నారు. బాపూరావు తెలంగాణ జాగృతి నుంచే బీఆర్ఎస్ లో చేరి రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యారని, ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేయబోయే పార్టీలో చేరుతున్నారన్నారు. కొత్త పార్టీలో చేరేందుకు అన్ని జిల్లాల నుంచి నాయకులు ముందుకు వస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులు జాగృతి వైపు చూస్తున్నారని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొత్త పార్టీకి ఆదరణ ఉంటుందన్నారు. సిరిసిల్ల జిల్లా నుంచి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సహా పలువురు నాయకులు నేడు జాగృతిలో చేరారని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కవిత సీఎం కావాలని మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు అన్నారు. కవిత ఇచ్చిన ధైర్యంతోనే ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యానని తెలిపారు. పార్టీలోకి మధ్యలో వచ్చిన వాళ్లు మంత్రులు అయ్యారని, తనకు మూడోసారి ఎమ్మెల్యే టికెట్ కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ లో చేరినా తనకు తగిన ప్రాధాన్యత దక్కలేదన్నారు. కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత ఇచ్చోడలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి తన అనుచరులు, కార్యకర్తలను పార్టీలో చేర్పిస్తానన్నారు.

**జనగణనలో ఆదివాసీల కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలి**

జనగణనలో ఆదివాసీల మతం కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఆదివాసీ కానిస్ట్యూషనల్ రైట్స్ అండ్ కల్చరల్ ప్రొటెక్షన్ జేఏసీ జాతీయ అధ్యక్షుడు, ఖమ్మం జెడ్పీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు జాగృతి కార్యాలయంలో కవితతో భేటీ అయ్యారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలతో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కవిత మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో 3 లక్షల మంది ఆదివాసీలను అడవి నుంచి దూరం చేస్తున్నారని, తిరిగి వారికి అడవిలో అన్ని సౌకర్యాలతో కూడిన పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలు తమ మతం చెప్పుకునేలా జనగణనలో ప్రత్యేక కాలమ్ పెట్టాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల భాష "కోయతూర్" ను భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్ చేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆదివాసీ జేఏసీ ముఖ్య నాయకులు పాడూరి శ్రీనివాస్, పాయం సత్యనారాయణ, మాడవి నర్సింగరావు, వట్టం నారాయణ దొర, రమణాల లక్ష్మయ్య, వజ్జ నర్సింహరావు, కబ్బాక శ్రావణ్ కుమార్, కుర్సంగ వేణు, వరియ శ్రీనివాస్, షడమాకి సంజీవ్, ఆత్రం పైకాజీ, పోదెం భార్గవ, తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్, ఆదివాసీ జాగృతి అధ్యక్షుడు లోకిని రాజు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వం లక్షల కోట్లు దుర్వినియోగం చేసింది

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

**ముద్ర, మహాదేవపూర్:**

తెలంగాణ ప్రజల ఆకాంక్ష నిధులు, నీళ్లు, నియామకాల పేరున గత ప్రభుత్వం పదేళ్లలో రూ. లక్షల కోట్లు దుర్వినియోగం చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తరతరాలకు పనికి వచ్చేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రైతుల సంక్షేమానికి దేశంలో రూ.లక్షా 10 వేల కోట్లు ఖర్చు పెట్టిన ఏకైక రాష్ట్రం ప్రస్తుత తెలంగాణ రాష్ట్రమని ఆయన ప్రకటించారు. కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయం అభివృద్ధికి రూ.200 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించడం, ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఎకరాకు సంవత్సరానికి రెండు దఫాలుగా రూ.12 వేల రైతు భరోసా విడుదల చేశామని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తదుపరి 73 లక్షల మంది రైతులకు కోటి 15 లక్షల ఎకరాలకు రైతు భరోసా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. రైతుల సమక్షంలో ఇవి ప్రాతినిధ్యం వహించిన మంథని నియోజకవర్గం కాళేశ్వరం పుణ్యభూమి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా కింద రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం రూ.5,563 కోట్లు విడుదల చేయనున్నట్లు తెలిపారు.



రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సోమవారం కాళేశ్వరం సందర్శించి స్వామిని దర్శించుకుంటారని, కాళేశ్వరం అభివృద్ధికి రూ.200 కోట్లతో మాస్టర్ ప్రణాళిక కార్యక్రమానికి భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, సహచర మంత్రులు మేడిగడ్డ బ్యారేజ్ ను సందర్శిస్తారన్నారు. గత ప్రభుత్వం నాణ్యతలేని బ్యారేజీ నిర్మాణం వల్ల నిరుపయోగమైన బ్యారేజీని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని పూణే పరిశోధన బృందం నివేదికల ఆధారంగా పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాము మేడిగడ్డ బ్యారేజీని సందర్శిస్తుంటే బండారం బయటపడుతుందేమో అని గత ప్రభుత్వ పెద్దలు భయపడుతున్నారన్నారు. గత.ప్రభుత్వం ప్రాజెక్టు కట్టడానికి ప్రాధాన్యత ఇచ్చారు కానీ నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వలేదని ఆరోపించారు. డ్యామ్ సేఫ్టీ అధికారులు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న జలవనరుల సంఘం నివేదికపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల సొమ్మును సద్వినియోగం చేసి ప్రాజెక్టు ఉపయోగపడాలన్న ఆలోచనతో ఉన్నామని తెలిపారు. సీఎం ఈ ప్రాంతానికి రావడం, రైతు భరోసా నిధులు చేయడం ఈ ప్రాంతానికి ఎంతో గర్వకారణమని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యకమాన్ని విజయవంతం చేయాలని మంత్రి సూచించారు.

**సభా ప్రాంగణాన్ని పరిశీలించిన మంత్రి**

కాటారం మండలం నస్తురుపల్లి గ్రామంలో సోమవారం జరగనున్న రైతు భరోసా నిధుల విడుదల బహిరంగ సభ ప్రాంగణాన్ని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డితో కలిసి పరిశీలించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# దీదీ కోటలో కమల వికాసం సాధ్యమేనా?

- బెంగాల్ పీఠంపై పెరిగిన ఉత్కంఠ
- సంకీర్ణ శకానికి నాందియా? ఏకపక్ష ఆధిపత్యానికి ఆఖరి పరీక్షా?
- భారత రాజకీయ భవిష్యత్తును శాసించే ఐదు రాష్ట్రాల ఎన్నికల సమరం



భారత ప్రజాస్వామ్య చరిత్రలో కొన్ని ఎన్నికలు కేవలం ప్రభుత్వాలను మార్చేందుకు మాత్రమే పరిమితం కావు. అవి దేశం వెళ్లే దిశను, రాజకీయ సిద్ధాంతాల బలాబలాలను, భవిష్యత్తు తరాల పాలనా విధానాన్ని నిర్ణయిస్తాయి. ప్రస్తుతం ఐదు రాష్ట్రాలలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు అటువంటి కీలక ఘట్టానికే సంకేతంగా నిలుస్తున్నాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలు కేవలం ఆయా రాష్ట్రాలకే పరిమితం కాకుండా 2029 సార్వత్రిక ఎన్నికలకు బలమైన పునాదిని వేయనున్నాయి. 2024 లోక్‌సభ తీర్పు తర్వాత మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఈ ఐదు రాష్ట్రాల తీర్పు దేశరాజకీయాల్లో అత్యంత కీలకమైన మలుపుగా మారింది. ఇది కేవలం ఒక ప్రాంతీయ పోరు కాదు, జాతీయ స్థాయిలో అధికారం ఎటువైపు మొగ్గుతుందో తేల్చే ఒక అగ్నిపరీక్ష.

**మోదీ, -అమిత్‌షాల వ్యూహరచన, నాయకత్వ పటిమ**

ఈ ఐదు రాష్ట్రాల పోరును ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా అత్యంత వ్యూహాత్మకంగా వ్యక్తిగత ప్రతిష్ఠగా భావిస్తున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా మెజారిటీ సాధించలేకపోయిన నేపథ్యంలో ఈ రాష్ట్రాల్లో విజయం సాధించడం ద్వారా తమ నాయకత్వ పటిమ తగ్గలేదని నిరూపించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. దీని కోసం కేంద్ర పాలక పక్షం తన శక్తినంతటినీ ధారపోస్తోంది. డజనుకు పైగా ముఖ్యమంత్రులు, వందలాది మంది పార్లమెంట్ సభ్యులు, వేలాది మంది పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో మోహరించడం ఈ పోరు ఎంత తీవ్రంగా ఉందో స్పష్టం చేస్తోంది. ఇది కేవలం అధికారం కోసం జరుగుతున్న పోరాటం మాత్రమే కాదు, మోదీ, షా ద్వయం యొక్క ఎన్నికల వ్యూహరచన సామర్థ్యానికి పరీక్షగా పరిణమించింది.

**తూర్పు భారతంపై పట్టు.. బెంగాల్, అస్సాం సవాళ్లు**

పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌ను ఢీకొట్టడం బీజేపీకి పర్వతారోహణ వంటి సవాలుగా మారింది. 2021లో ఓటమి ఎదురైనప్పటికీ బీజేపీ తన పట్టును కోల్పోకుండా ఈసారి వందకు పైగా స్థానాలను సాధించి దీదీ కోటను బద్దలు కొట్టాలని చూస్తోంది. బెంగాల్ రాజకీయాల్లో హింస, సిద్ధాంతపరమైన విభేదాలు, స్థానిక సమస్యల మధ్య బీజేపీ తన జాతీయ అజెండాను ఎంతవరకు ప్రజల్లోకి తీసుకెళ్లగలదన్నది ఇక్కడ ఆసక్తికర అంశం. మరోవైపు అస్సాంలో వరుసగా మూడోసారి విజయం సాధించి ఈశాన్య రాష్ట్రాల్లో తన తిరుగులేని ఆధిపత్యాన్ని నిరూపించుకోవాలని ఎన్‌డీఏ భావిస్తోంది. ఈ రెండు రాష్ట్రాల్లో వచ్చే ఫలితాలు బీజేపీకి జాతీయ స్థాయిలో మద్దతును కూడగట్టడంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

**దక్షిణాది కోటల్లో చొరబాటు: ద్రావిడ రాజకీయాల మధ్య పోరు**

బీజేపీకి ఎప్పుడూ ఒక అజేయమైన అడ్డుగోడగా నిలిచే దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళలపై ఈసారి మునుపెన్నడూ లేని విధంగా దృష్టి సారించారు. ద్రావిడ సిద్ధాంతాలకు నిలయమైన తమిళనాడులో ఏఐఏడీఎంకేతో బలమైన కూటమి కట్టి ఎం.కె. స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభావాన్ని తగ్గించాలని గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కేరళలో కూడా పాగా వేయడం ద్వారా తనపై ఉన్న ఉత్తరాది పార్టీ అనే ముద్రను చెరిపివేసి నిజమైన జాతీయ ఆధిపత్యాన్ని సాధించాలని బీజేపీ ఆరాటపడుతోంది. కేరళలో కనీసం అర డజను స్థానాలను గెలవడం ద్వారా తన ఉనికిని చాటుకోవాలని వారు కనీస లక్ష్యంగా పెట్టుకున్నారు. దక్షిణాదిలో సాధించే ప్రతి చిన్న విజయం కూడా ఆ పార్టీకి భవిష్యత్తులో కేడర్‌ను విస్తరించుకోవడానికి పెద్ద ఊరటనిస్తుంది.

**తిరుగుబాటు ఫలితాలు, మిత్రపక్షాల ప్రాధాన్యత**

అయితే ఫలితాలు వ్యతిరేకంగా వస్తే అది బీజేపీకి భారీ రాజకీయ నష్టాన్ని కలిగిస్తుంది. 2024లో ఎదురైన స్వల్ప ఎదురుదెబ్బల తర్వాత ఇది రెండో పెద్ద దెబ్బ అవుతుంది. అప్పుడు బీజేపీ తన కేంద్రీకృత నాయకత్వ శైలిని పక్కన పెట్టి సంకీర్ణ రాజకీయాలకు తలొగ్గాల్సి ఉంటుంది. చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ వంటి మిత్రపక్షాల ప్రాధాన్యత పెరిగి కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంలో ప్రాంతీయ ఆకాంక్షలకు ఎక్కువ విలువ ఇవ్వాల్సి వస్తుంది. సిద్ధాంతాల కంటే సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యలే ప్రధాన ఎజెండాగా మారుతాయి. ఇది దేశ రాజకీయాల్లో ఒక కొత్త రకమైన చర్చకు దారితీస్తుంది, అధికార వికేంద్రీకరణ వైపు మొగ్గు చూపుతుంది. రాష్ట్రాల హక్కులు, సమాఖ్య వ్యవస్థపై చర్చ మళ్ళీ తెరపైకి వస్తుంది. మొత్తానికి 2026 ఎన్నికలు భారత రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చే శక్తిని కలిగి ఉన్నాయి. ఇవి కేవలం సీట్ల గణాంకాలు లేదా ఓట్ల శాతానికి సంబంధించినవి కావు. ఇవి దేశం యొక్క భవిష్యత్తు రాజకీయ గమనాన్ని నిర్ణయించే మైలురాళ్లుగా నిలుస్తాయి. మోదీ సారథ్యంలోని బీజేపీ తన ప్రభావాన్ని సుస్థిరం చేసుకుంటుందా లేక ప్రాంతీయ శక్తులు తమ కోటలను కాపాడుకుని కొత్త రాజకీయ శకానికి నాంది పలుకుతాయా అన్నది ఈ ఫలితాలే తేలుస్తాయి. దేశ ప్రజల తీర్పు ఎలా ఉన్నా అది 2029 వైపు వెళ్లే ప్రయాణంలో అత్యంత కీలకమైన, నిర్ణయాత్మకమైన మలుపుగా చరిత్రలో నిలిచిపోతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల నాడిని పట్టుకోవడంలో ఏ పక్షం విజయం సాధిస్తుందో వేచి చూడాలి. ఈ ఎన్నికల రణం భారత రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టబోతోంది.

– వెంకగారి భూమయ్య

**సంకీర్ణ రాజకీయాల పునరుద్ధరణ, ఏకఛత్రాధిపత్యం**

ఈ ఎన్నికల తీర్పు ఆధారంగా దేశ రాజకీయ భవిష్యత్తు రెండు భిన్నమైన మార్గాల్లో వెళ్లే అవకాశం ఉంది. ఒకవేళ బీజేపీ ఈ రాష్ట్రాల్లో ఘనవిజయం సాధిస్తే అది 2029 సార్వత్రిక ఎన్నికలకు ఒక విజయ యాత్రలా మారుతుంది. మోదీ అజేయ నాయకత్వంపై నమ్మకం పెరగడమే కాకుండా కేంద్ర ప్రభుత్వం మరింత శక్తివంతంగా మారుతుంది. ఆర్థిక రంగంలో భారీ సంస్కరణలు, సాంస్కృతిక జాతీయవాదం, కేంద్రీకృత పాలన వైపు దేశం మరింత వేగంగా అడుగులు వేస్తుంది. దీనివల్ల ప్రతిపక్షాలు మరింత బలహీనపడి ప్రాంతీయ పార్టీలు తమ ఉనికిని కాపాడుకోవడానికి రక్షణలో పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అధికార యంత్రాంగంపై పట్టు పెరిగి పాలనలో ఒక రకమైన నిర్ణయాత్మక ధోరణి కనిపిస్తుంది.



# దుకాణాదారుడితో మోడీ సెటైర్

**ముద్ర, ఢిల్లీ :**

పశ్చిమబెంగాల్ ఎన్నికల వేళ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో నాలుగు ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ ఝార్గ్రామ్‌లో సాయంత్రం వేళ కాసేపు విరామం తీసుకున్నారు. రోడ్డు పక్కన ఉన్న ఒక దుకాణం వద్ద ఆగి 'ఝాల్ మురీ' మరమరాలతో చేసే స్నాక్ ఆరగించారు. ఝార్గ్రామ్‌లో భారీ బహిరంగ సభనుద్దేశించి ప్రసంగించిన తర్వాత హెలిప్యాడ్‌కు వెళ్లే దారిలో ఆగి ఈ బెంగాలీ స్ట్రీట్ ఫుడ్‌ను ఆస్వాదించారు. ఝాల్‌మురీకి స్వయంగా డబ్బులు చెల్లించారు. దుకాణదారుడు 'మీరు ఉల్లిపాయలు తింటారా?' అని అడగ్గా.. 'హా తింటాను.. బుర్ర మాత్రం తినను' అంటూ మోదీ నవ్వులు పూయించారు. అనంతరం అక్కడే ఉన్న మహిళలు, పిల్లలు, పార్టీ కార్యకర్తలతో ఆయన సరదాగా సంభాషించారు. 'ఝార్గ్రామ్‌లో ఝాల్‌మురీ బ్రేక్' అంటూ సంబంధిత ఫొటోలు, వీడియోలను ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారాయి.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
20.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఈత పండ్లు**
శరీర వేడిని తగ్గిస్తుంది
సహజంగా కూలింగ్ ఎఫెక్ట్ ఇస్తుంది
వేసవిలో తింటే శరీరం చల్లగా ఉంటుంది



## వనదేవతల ఆలయ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- మహాద్భుతంగా ఆలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలి
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



ముద్ర, తెలంగాణ బ్యూరో :

మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల పునర్నిర్మాణ అభివృద్ధి చివరి దశ పనుల్లో వేగం పెంచి, వనదేవతల ఆలయ ప్రాంగణాన్ని భక్తుల కోసం మహాద్భుతంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సంబంధిత అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. ఆదివారం ములుగు జిల్లా ఎస్.ఎస్. తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతలను సహచర మంత్రి సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య, అశ్వాపురం శాసనసభ్యులు జారే ఆదినారాయణలతో కలిసి దర్శించుకున్నారు. ముందుగా మేడారం చేరుకొని, సమ్మక్కసారలమ్మ వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మేడారం హరిత హోటల్‌లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. చివరి దశలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని మంత్రులకు, ఎమ్మెల్యేలకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సంబంధిత శాఖ అధికారులతో, గుత్తేదారులతో చివరి దశ అభివృద్ధి పనులపై పలు అంశాలను చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం మంజూరైన అన్ని ప్రధాన ఆర్చ్‌ల పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. సారలమ్మ పూజారుల కోరిక మేరకు క్యూలైన్ పక్కనే ప్రత్యేకంగా సారలమ్మ ప్రధాన ఆర్చ్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి అందించాలన్నారు. గుడికి సంబంధించిన రాతి నిర్మాణాలలో ఎక్కడా చిన్న ఖాళీలు కూడా లేకుండా అత్యంత పటిష్టంగా ఉండేలా చూడాలని సూచించారు. గద్దెల ప్రాంగణంలో ఎత్తు పల్లాలు లేకుండా ఫ్లోరింగ్ సరి చేయాలని, గద్దెల రైలింగ్, ఆలయ డ్రైనేజీలలో ఎక్కడ చుక్కనీరు నిలవకుండా చూడాలన్నారు. ఆలయ ప్రాంగణంలోని డ్రైనేజీ వ్యవస్థను ప్రధాన రహదారి డ్రైనేజీకి లింక్ చేసే పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రధాన రహదారికి ఇరువైపులా శుభ్రం చేస్తూ మొక్కలను నాటాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వనదేవతల ప్రాంగణంలో భక్తులకు మెరుగైన సేవలందించేందుకు, నిర్వహణ కోసం మొత్తం అవసరమైన సిబ్బంది ప్రతిపాదనలను సిద్ధం చేయాలని తెలిపారు. అభివృద్ధి పనులలో ఫేజ్ 2లో భాగంగా మాస్టర్ ప్లాన్ ప్రకారం చేపట్టవలసిన అభివృద్ధి పనుల కోసం అవసరమైన భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. హేమాచల లక్ష్మీ నరసింహస్వామి మల్లూరు దేవాలయాన్ని కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పనులలో అత్యంత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేసి, వచ్చే భక్తులకు అన్ని సకల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు లోటుపాట్లు కలగకుండా ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించే విధంగా ఆలయ ప్రాంగణం ఉండే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మీడియాతో మాట్లాడారు. మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల పునర్నిర్మాణంలో మిగిలిన చివరి దశ పనులను అత్యంత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశామన్నారు.

## డ్రగ్స్ కట్టడికి ముమ్మర చర్యలు

- విద్యార్థులతో ప్రమాణం చేయించేలా కార్యక్రమాలు చేపట్టండి
- సీఎం రేవంత్ రెడ్డికి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచన



ముద్ర, తెలంగాణ బ్యూరో :

విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సీఎం రేవంత్ రెడ్డి కు సూచించారు. అందుకోసం విద్యార్థులతో ప్రమాణం చేయించేలా కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ల సమయంలోనే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రమాణపత్రం తీసుకోవాలన్నారు. గవర్నర్ సూచనలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో సీఎం ఎ. రేవంత్ రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఉదయం లోక్ భవన్‌కు వెళ్లిన సీఎం రేవంత్.. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఫైల్ గురించి చర్చించినట్లు సమాచారం. రాజ్యాంగ నిబంధనల ప్రకారం.. చట్టసభ సభ్యుడు కాని వ్యక్తి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తే ఆరు నెలల లోపు అసెంబ్లీ లేదా కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నిక కావాలి. అజారుద్దీన్ మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఈనెల 30 తేదీతో ఆరు నెలల గడువు ముగియనుంది. ప్రస్తుతం మరో పది రోజుల్లోపు ఆయన ఎమ్మెల్సీగా నియమితులు కాకపోతే మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం పంపిన ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాలో టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంతోపాటు అజారుద్దీన్ పేరు ఉన్నప్పటికీ.. గవర్నర్ ఆ ఫైల్‌పై ఇంకా తుది నిర్ణయం తీసుకోకపోవడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నెల 30 లోపు గవర్నర్ ఆమోద ముద్ర వేసి గెజిట్ నోటిఫికేషన్ విడుదల అయితేనే అజారుద్దీన్ మంత్రిగా కొనసాగే అవకాశం ఉంటుంది. పది రోజుల గడువు మాత్రమే మిగిలి ఉండటంతో ఈ లోపు సాంకేతిక ఇబ్బందులను తొలగించి నామినేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం గవర్నర్‌ను కోరినట్లు తెలుస్తోంది. గవర్నర్ సానుకూలంగా స్పందిస్తేనే అజారుద్దీన్ పదవి సురక్షితంగా ఉంటుంది, లేనిపక్షంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సి ఉంటుంది.

**2023 ఎన్నికల్లో అజారుద్దీన్ ఓటమి..**

2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అజారుద్దీన్ ఓడిపోయారు. ఆ తర్వాత 2025లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతితో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వటంతోపాటు అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గణనీయంగా ఉన్న ముస్లిం మైనారిటీ ఓటర్లను ఆకర్షించడానికి, పార్టీ పట్టును బలోపేతం చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావించారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడానికి ముందు ఆయనను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేశారు. అయితే ఆ ఫైల్ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఈ నేపథ్యంలోనే తాజాగా సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌తో భేటీ కావటం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎంతో పాటు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి గవర్నర్‌ను కలిశారు.

## జలధారజలహారతిపై సీఎం చంద్రబాబు సమీక్ష

- అన్నమయ్య జిల్లా మోడల్ రాష్ట్రానికి ఆదర్శం

**ముద్ర, అమరావతి :**

జలధారజలహారతి కార్యక్రమం అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులతో సమీక్ష చేపట్టారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని అధికారులు వివరించగా, జలధార కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ను నోడల్ అధికారిగా నియమిస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ప్రతి మండలంలో నోడల్ అధికారులు కీలకంగా వ్యవహరించాలని, అర్బన్ మండలాల్లోనూ పటిష్ట పర్యవేక్షణ ఉండాలని చంద్రబాబు సూచించారు. నీటి సంరక్షణ, భద్రత విషయంలో అన్నమయ్య జిల్లా మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని చెప్పారు. భారీ వర్షాల సమయంలో ముంపు నివారణకు కాల్వలు, చెరువుల మరమ్మతులు చేపట్టాలని, వర్షాకాలంలో చెరువులు నింపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూగర్భ జలాలు పెరిగితే విద్యుత్ భారం తగ్గుతుందని, ఆ నిధులను ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించవచ్చని సీఎం పేర్కొన్నారు. దేవాలయాల పుష్కరిణులకు నీటి లభ్యత కల్పించేందుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. జలధారజలహారతి కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేసి, పనుల ప్రభావాన్ని నిరంతరం విశ్లేషించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.




## ఆస్పత్రిలో భార్యను కత్తితో పొడిచి చంపిన భర్త

**ముద్ర, అమరావతి :**

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో దారుణం చోటుచేసుకుంది. ఆస్పత్రి ప్రసూతి వార్డు వద్ద తన భార్యను భర్త రామన్న కత్తితో పొడిచి చంపాడు. భార్యాభర్తల మధ్య గొడవలు ఉన్నాయని, గత కొన్నాళ్లుగా వారిద్దరూ దూరంగా ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రసవం కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన కుమార్తెను చూసే నెపంతో రామన్న అక్కడికి వెళ్లాడు. ఈ క్రమంలో ఆస్పత్రిలోనే భార్య నర్సమ్మతో గొడవపడ్డాడు. మద్యం మత్తులో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో అక్కడ భయానక వాతావరణం నెలకొంది. కత్తిపోట్లతో చికిత్సపొందుతూ అదే ఆస్పత్రిలో నర్సమ్మ మృతి చెందింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఐదు రోజులు అప్రమత్తంగా ఉండాలి




- వాతావరణ శాఖ హెచ్చరిక

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

భానుడి భగభగలు, అకాల వర్షాలతో రాష్ట్ర ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. దీంతో రానున్న ఐదు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రస్తుతం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. సాయంత్రం వాతావరణం పూర్తిగా చల్లబడి, ఒక్కసారిగా ఈదురుగాలులు, వడగళ్ల వానలు ముంచెత్తుతున్నాయి. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసే అవకాశం ఉంది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్ అలెర్ట్' జారీ చేశారు. కొమురంభీం ఆసిఫాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సిద్ధిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు 'ఎల్లో అలెర్ట్' జారీ చేశారు.

**ప్రజలకు సూచనలు..**

ఈదురు గాలులు వీస్తున్నప్పుడు చెట్ల కింద, విద్యుత్ స్తంభాల దగ్గర ఉండకూడదు. రైతులు తమ పంట ఉత్పత్తులను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున మధ్యాహ్నం పూట అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడం ఉత్తమం. మారిన ఈ వాతావరణ పరిస్థితుల వల్ల అటు ఉక్కపోత, ఇటు అకాల వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

**మరోవైపు ఎండల తీవ్రత..**

వర్ష సూచన ఉన్నప్పటికీ, పగటిపూట ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. ఆదిలాబాద్, జగిత్యాల, జోగులాంబ గద్వాల్, కామారెడ్డి, కరీంనగర్, కొమరం భీమ్, మహబూబ్ నగర్, మంచిర్యాల, మెదక్, నాగర్ కర్నూల్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి జిల్లాల్లో అధిక ఎండలు ఉండే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎండ తీవ్రత దృష్ట్యా కూడా ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు.

## మరో జలసంధికి ముప్పు

- బాబ్ అల్ మాండెబ్‌ను మూసేస్తామన్న హూతీలు..!
- ప్రపంచ వాణిజ్యానికి కీలక మార్గంపై హూతీల హెచ్చరికలు
- చమురు సరఫరాలపై తీవ్ర ప్రభావం




**ముద్ర డెస్క్ :**

అమెరికాఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో ఇప్పటికే ఇరాన్ హర్మూజ్‌ను మూసివేయడంతో చాలా దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభం నెలకొంది. ఇప్పుడు సూయజ్ కెనాల్‌కు వెళ్లే మార్గంలోని మరో జలసంధిని మూసివేస్తామని యెమెన్‌లోని హూతీ లు హెచ్చరించారు. ప్రపంచ శాంతికి విఘాతం కలిగే చర్యలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొనసాగిస్తే తాము బాబ్ అల్ మాండెబ్ జలసంధి ని మూసివేస్తామని హెచ్చరించారు. ఒక్కసారి దానిని మూసేస్తే.. తిరిగి తెరిపించడం ప్రపంచంలోని ఏ ఒక్కరికీ సాధ్యం కాదని హూతీ ప్రభుత్వ విదేశాంగశాఖ ఉప మంత్రి హుస్సేన్ పేర్కొన్నారు. ప్రపంచ శాంతికి ఆటంకం కలిగించే అన్ని చర్యలను ట్రంప్ ఆపేయాలని హూతీలు హెచ్చరించారు. ఈ విధ్వంసం నుంచి వెనక్కి మళ్లాలని అమెరికాకు సహకరించే దేశాలకు సూచించారు. అదే అందరికీ శ్రేయస్కరమన్నారు. మరోవైపు ఇజ్రాయెల్‌తో చేసుకున్న ఏకపక్ష కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌కు అవమానకరమని హెజ్‌బొల్లా సెక్రటరీజనరల్ నయీమ్ అభివర్ణించారు. ఏకపక్ష కాల్పుల విరమణకు తమ బృందం కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదన్నారు. 2024లో ఇదే విధంగా ఆ దేశాన్ని నమ్మితే కాల్పుల విరమణ అమల్లో ఉన్న సమయంలోనే పౌరులపై పెద్ద ఎత్తున దాడి చేసిందని గుర్తు చేశారు. మాండెబ్ జలసంధి.. యెమన్, జిబౌటి మధ్య ఉంది. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేస్తోంది. సూయజ్ కాలువ దిశగా వెళ్లే నౌకలు, చమురు ట్యాంకర్లకు ఇది కీలక మార్గం. ఎర్ర సముద్రానికి, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌కు మధ్య ద్వారంలా ఇది ఉంది. దీని వెడల్పు దాదాపు 30 కి.మీ. మాత్రమే. ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా మధ్య ప్రయాణించే నౌకల ఇది చాలా కీలక మార్గం. నిత్యం ఈ మార్గంలో 45 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా అవుతోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో 10 నుంచి 12 శాతం దీని ద్వారానే పయనిస్తోంది. ప్రధాన మార్కెట్ల మధ్య ఎల్ఎన్‌జీ, తయారీ వస్తువులు, ఆహార పదార్థాలు ఈ మార్గంలోనే రవాణా అవుతున్నాయి. ఏటా రూ.93.95 లక్షల కోట్ల విలువైన సరకులు ఈ జలసంధి గుండా రవాణా అవుతున్నట్లు అంచనా.



## అమ్మను తలపించే అన్న క్యాంటీన్ల సేవలు

- లక్షలాది పేదల కడుపు నింపే మహోన్నత కార్యక్రమం
- రూ. 5కే పరిశుభ్ర వాతావరణంలో గౌరవంగా పేదలకు భోజనం : నారా భువనేశ్వరి
- సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా అన్న క్యాంటీన్లకు రూ. 76 లక్షల విరాళం
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా 269 అన్న క్యాంటీన్లలో ఉచితంగా భోజనం

**ముద్ర, అమరావతి :**

రాష్ట్రంలో అన్న క్యాంటీన్లు అన్నం పెట్టే అమ్మను తలపిస్తున్నాయని నారా భువనేశ్వరి అన్నారు. అన్న క్యాంటీన్ల సేవలు విశేష మన్ననలు పొందాయని, లక్షలాది పేదల కడుపు నింపే మహోన్నత కార్యక్రమంగా కూటమి ప్రభుత్వం దీన్ని నిర్వహించడం గొప్ప విషయమని ఆమె అభిప్రాయపడ్డారు. రూ. 5కే పరిశుభ్ర వాతావరణంలో ప్రభుత్వం గౌరవంగా పేదలకు భోజనం అందిస్తోందని ఆమె తెలిపారు. ఏప్రిల్ 20న ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా నారా భువనేశ్వరి రూ. 76లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు సీఎం క్యాంప్ కార్యాలయంలో చెక్కును అన్న క్యాంటీన్ సీఈఓకు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినం అయిన ఏప్రిల్ 20న రాష్ట్రవ్యాప్తంగా 269 అన్న క్యాంటీన్లలో పూర్తిగా ఉచిత భోజనం అందించాలని భువనేశ్వరి కోరారు. పుట్టినరోజు సందర్భంగా పేదలకు కడుపునింపే అన్న క్యాంటీన్లకు విరాళం ఇవ్వడం ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు. అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో అన్న క్యాంటీన్లలో పౌష్టికాహారం అందించడం గొప్ప విషయమని ఆమె అభిప్రాయపడ్డారు. రోజువారీ కూలీలు, పేదలు ఈ పథకం ద్వారా ఎంతో లాభం పొందుతున్నారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. తమ మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా గత 12 ఏళ్లుగా ప్రతి ఏటా తిరుమలలో అన్నప్రసాదానికి రూ. 44 లక్షలు విరాళంగా ఇస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, అన్న క్యాంటీన్లకు రూ. 76 లక్షల విరాళం ఈ ఏడాది పుట్టిన రోజు బహుమానమని తెలిపారు. తన పేరుమీద అన్న క్యాంటీన్లకు ఒక రోజు అన్నదానానికి విరాళం ఇచ్చిన సతీమణి భువనేశ్వరిని ముఖ్యమంత్రి అభినందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నదాన కార్యక్రమాన్ని విస్తృతంగా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. తిరుమలలో భక్తుల సహకారంతో నాలుగు దశాబ్దాలుగా అన్నదానం జరుగుతోందని, అలాగే ప్రముఖ దేవాలయాల్లోనూ ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. పేదలకు రూ. 5కే కడుపునింపే అన్న క్యాంటీన్ సేవలను మరింత విస్తరించాలని, నాణ్యతను పాటిస్తూ పరిశుభ్రంగా, గౌరవంగా ఆహారం అందించే ఈ కార్యక్రమానికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పుట్టిన రోజు, పెళ్లి రోజు వంటి ప్రత్యేక సందర్భాల్లో భోజన ఖర్చులను విరాళాలుగా ఇవ్వాలని ప్రజలను కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
20.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఈత పండ్లు**
- చర్మ సౌందర్యాన్ని మెరుగుపరుస్తుంది
- చర్మం పొడిబారకుండా కాపాడుతుంది
- ముఖానికి సహజ కాంతి, యవ్వనం ఇస్తుంది



# క్రికెట్ ఖలేజా.. ఐపీఎల్ మజా!

- ఐపీఎల్ ఎలా పుట్టింది? ఇంత పెద్దగా ఎలా ఎదిగింది?
- గల్లీ నుంచి గ్లోబల్ దాకా.. ఒక 'బిలియన్ డాలర్' విప్లవ గాథ
- లలిత్ మోదీ ఆలోచనతో పుట్టిన ఐపీఎల్ క్రికెట్‌ను కార్పొరేట్ యుగంలోకి నడిపించిన గేమ్ చేంజర్
- రూ.3,100 కోట్ల నుంచి లక్షా యాభై వేల కోట్ల విలువ
- క్రికెటర్లకు కోట్ల వర్షం... ఫ్రాంచైజీలకు లాభాల జల్లు
- యువ ఆటగాళ్లకు గోల్డెన్ ప్లాట్‌ఫామ్...
- స్టార్లను తయారు చేసిన ఐపీఎల్ ఫ్యాక్టరీ
- వివాదాలు, విమర్శలు మధ్య కూడా నిలిచిన మహా బ్రాండ్...
- అభిమానుల హృదయాల్లో ఐపీఎల్ ఎమోషన్
- ఆట, వినోదం, వ్యాపారం కలయిక...
- ప్రపంచ క్రీడా రంగాన్ని ప్రభావితం చేసిన భారత సాఫ్ట్ పవర్



ఒక వ్యక్తి మదిలో మిగిలిన ఆలోచన క్రికెట్ గతిని మొత్తం మార్చేసింది. అప్పటిదాకా మూస ధోరణిలో సాగుతున్న క్రికెట్.. కార్పొరేట్ కళను సంతరించుకుంది. క్రికెటర్ల మీద కాసుల వర్షం కురిపించింది. కంపెనీలకు కోట్ల లాభాలను అందించింది.. 2008లో ఏప్రిల్ 18న ఐపీఎల్ ప్రారంభమైంది. నాడు లలిత్ మోడీ ఆలోచన చేయడంతో ఐపీఎల్ పుట్టింది. ప్రారంభంలో ఎనిమిది జట్టతో ఐపీఎల్ మొదలైంది. నాడు ఐపీఎల్ వ్యాల్యూ 3,100 కోట్లుగా ఉండేది. ఇప్పుడు ఐపీఎల్ ఏకంగా 10 బృందాలతో గొప్పగా వర్ధిల్లుతోంది. ఐపీఎల్ ప్రారంభంలో ఈ స్థాయిలో విజయవంతమవుతుందని ఎవరూ ఊహించలేదు. తన కార్పొరేట్ తెలివి ద్వారా లలిత్ మోడీ ఐపీఎల్ కొత్త కళ తీసుకొచ్చారు. బ్రాండ్ ఇమేజ్ మొత్తం పెంచారు. ఫలితంగా ఐపిఎల్ అనేది అత్యంత విలువైన క్రికెట్ లీగ్ గా మారింది. వివాదాలు, ఇతర ఆరోపణలు పక్కన పెడితే ఐపిఎల్ అనేది క్రికెటర్లకు అద్భుతమైన ఆదాయ వనరుగా మారింది. లలిత్ మోడీ మీద అనేక రకాలుగా విమర్శలు వచ్చినప్పటికీ.. అతడు దేశం దాటి వదిలి వెళ్ళిపోయినప్పటికీ.. ఐపీఎల్ ఇప్పటికీ సగటు భారతీయుడికి ఒక ఎమోషన్ లాగా మారింది. వేసవి కాలంలో సుమారు రెండు నెలల పాటు అభిమానులకు అసలు సిసలైన క్రికెట్ ఆనందాన్ని అందిస్తోంది. చరిత్రలో కొన్ని ఆలోచనలు ప్రపంచ గమనాన్ని మారుస్తాయి. క్రీడారంగంలో అటువంటి ఒక విప్లవాత్మక ఆలోచనే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్). నాడు లలిత్ మోదీ వేసిన పునాది, నేడు భారత క్రికెట్‌ను ప్రపంచపు అగ్రపీఠంపై కూర్చో బెట్టింది. క్రికెట్ అంటే కేవలం మైదానంలో ఆడే ఆట మాత్రమే కాదు, అది ఒక పక్కా కమర్షియల్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజీ అని ఐపీఎల్ నిరూపించింది.

**ఆవిర్భావం: అపనమ్మకాల మధ్య అద్భుతం**

**2007లో భారత్ తొలి టీ20 ప్రపంచకప్‌ను గెలిచినప్పుడు దేశంలో ఒక రకమైన క్రికెట్ ఊపు వచ్చింది. ఆ క్రేజ్‌ను గమనించిన లలిత్ మోదీ, బిసిసిఐ పెద్దలను ఒప్పించి ఈ లీగ్ రూపొందించారు. అప్పట్లో టెస్ట్ క్రికెట్ అభిమానులు దీనిని 'మసాలా క్రికెట్' అని విమర్శించినా, ప్రేక్షకులు మాత్రం బ్రహ్మరథం పట్టారు. అలా 2008 ఏప్రిల్ 18న బెంగళూరు వేదికగా మొదలైన ఈ జాతర, నేడు పది జట్లతో విస్తరించి ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన లీగ్‌గా నిలిచింది.**

**ఎకానమీలో సిక్సర్: రూ. 1.5 లక్షల కోట్ల సామ్రాజ్యం**

ఐపీఎల్ ఆర్థిక పురోగతి చూస్తుంటే గూస్ బంప్స్ రావడం ఖాయం. 2026 అంచనాల ప్రకారం ఐపీఎల్ బ్రాండ్ విలువ రూ. 1,50,000 కోట్లు దాటింది. కేవలం ప్రసార హక్కుల ద్వారానే బిసిసిఐ వేల కోట్లు గడిస్తోంది. ఒక బంతికి పలికే ధర పరంగా చూస్తే, ఇది అమెరికాలోని ఎన్ఎఫ్ఎల్ (ఎన్.ఎఫ్.ఎల్)తో పోటీ పడుతోంది. ఈ రెండు నెలల కాలంలో హోటల్ రంగం, విమానయానం, ప్రకటనల సంస్థలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్ ద్వారా లక్షలాది మందికి ఉపాధి లభిస్తోంది.

**యువ కిరణాల వేదిక.. స్టార్ల ఫ్యాక్టరీ**

**"అక్కడ ప్రతిభకు ప్రతిఫలం లభిస్తుంది" అన్నది ఐపీఎల్ నినాదం. హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా, రింకూ సింగ్ వంటి వారు గల్లీ నుంచి వచ్చి నేడు అంతర్జాతీయ స్టార్లుగా మారారంటే దానికి కారణం ఐపీఎల్ కల్పించిన అవకాశమే. విదేశీ ఆటగాళ్లతో కలిసి డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం వల్ల భారత యువ ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం రెట్టింపవుతోంది. ఐపీఎల్ ద్వారా ఆదాయం దండిగా వస్తున్న నేపథ్యంలో అన్ని దేశాలకు సంబంధించిన క్రికెటర్లు ఇందులో ఆడేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. క్రికెటర్ల ఆసక్తిని మరింత పెంచేందుకు యాజమాన్యాలు భారీగా ధర చెల్లిస్తున్నాయి. కొంతమంది క్రీడాకారుల కైతే 20+ కోట్ల ఫీజు లభిస్తోందంటే మామూలు విషయం కాదు. ఒక ప్రొఫెషనల్ ఫుట్ బాల్ ప్లేయర్ కూడా సంపాదించలేని సంపాదనను క్రికెటర్లు ఆర్జిస్తున్నారంటే దానికి ప్రధాన కారణం ఐపిఎల్. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. ఐపీఎల్ వల్ల ఎన్నో దేశాలు క్రికెట్ లీగ్‌లు మొదలుపెట్టాయి. కానీ, ఐపీఎల్ స్థాయిని మాత్రం అందుకోలేకపోయాయి.**

**ట్రోఫీల వేట: ఆధిపత్యం ఎవరిది?**

గత 18 సీజన్లలో కొన్ని జట్లు తమ ముద్రను బలంగా వేశాయి.

**చెన్నై సూపర్ కింగ్స్ :**
ధోని సారథ్యంలో స్థిరత్వానికి మారుపేరుగా నిలిచి 5 సార్లు ఛాంపియన్‌గా నిలిచింది.

**ముంబై ఇండియన్స్ :**
రోహిత్ శర్మ నాయకత్వంలో 5 టైటిళ్లతో ధీటుగా నిలిచింది.

**కోల్‌కతా నైట్ రైడర్స్ :**
మూడు సార్లు గెలిచి తన సత్తా చాటింది.

**సన్‌రైజర్స్ హైదరాబాద్ :**
తెలుగు రాష్ట్రాల ఆశలను మోస్తూ రెండు సార్లు కప్పును ముద్దాడింది.

**రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు:**
తలా ఒక టైటిల్‌తో తమ ఉనికిని చాటుకున్నాయి.

**సాంకేతికత & వినోదం**

ఐపీఎల్ కేవలం మైదానానికి పరిమితం కాలేదు. డిజిటల్ విప్లవానికి దారితీసింది. జియో సినిమా, హాట్‌స్టార్ వంటి ప్లాట్‌ఫారమ్స్ ద్వారా 4K క్వాలిటీతో, మల్టీక్యామ్ వ్యూతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి చేరువవుతోంది. ప్రకటనల జాతర దీనికి కొనసాగుతోంది. గూగుల్ నుంచి మొదలుకొని స్థానిక స్టార్టప్‌ల వరకు ఐపీఎల్ సమయాన్ని తమ బ్రాండింగ్ కోసం వాడుకుంటున్నాయి.

**ఇది ఆరంభం మాత్రమే!**

విమర్శలు ఎన్ని ఉన్నా, వివాదాలు ఎన్ని చుట్టుముట్టినా.. ఐపీఎల్ అనే ప్రవాహం మాత్రం ఆగలేదు. ఇది భారత సాఫ్ట్ పవర్‌ను ప్రపంచానికి చాటిచెప్పింది. ఒక ఆలోచనతో మొదలైన ఈ ప్రయాణం నేడు భారత క్రీడా చరిత్రలోనే ఒక స్వర్ణ యుగంగా నిలిచిపోతుంది.

- నరేష్ , ముద్ర

# సీఎం కోటా టికెట్లు నటి చేతికి?

- **ఉప్పల్ మ్యాచ్‌పై వివాదం**



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్-చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ టికెట్ల వ్యవహారం ఇప్పుడు వివాదానికి దారితీసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రోటోకాల్ ప్రకారం ఇవ్వాల్సిన కాంప్లిమెంటరీ టికెట్లు ఓ నటి వద్ద కనిపించడం రాజకీయ, క్రీడా వర్గాల్లో చర్చనీయాంశమైంది.ఈ విషయం సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. మోడల్, నటి కుషిత కల్లాపు తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో 'సన్‌రైజర్స్ ఎలైట్ లాంజ్'కు చెందిన రెండు టికెట్ల ఫోటోలను షేర్ చేసింది. ఒక్కో టికెట్ ధర దాదాపు రూ.40 వేల వరకు ఉండొచ్చని సమాచారం. ఈ పోస్టు వైరల్ కావడంతో, సీఎంవోకు వెళ్లాల్సిన పాస్‌లు ఆమెకు ఎలా చేరాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సాధారణంగా ఈ తరహా టికెట్లు ప్రభుత్వ ప్రోటోకాల్, భద్రతా అవసరాల కోసం ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపిస్తారు. అవి అధికారిక అతిథులు లేదా సిబ్బందికే ఉపయోగపడాలి. కానీ అవి ప్రైవేట్ వ్యక్తుల వద్దకు వెళ్లడం నైతికంగా, చట్టపరంగా విమర్శలకు కారణమవుతోంది. ఇదిలా ఉండగా, గతంలో కూడా కాంప్లిమెంటరీ టికెట్ల విషయంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, సన్‌రైజర్స్ యాజమాన్యం మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. అదనపు టికెట్ల కోసం ఒత్తిడి తీసుకువస్తున్నారంటూ ఆరోపణలు కూడా వినిపించాయి. అప్పట్లో ఈ వ్యవహారంపై సీఎం జోక్యం చేసుకుని విచారణకు ఆదేశించారు. ఇప్పుడు మళ్లీ సీఎం కోటా టికెట్లు వివాదంలో పడటం ఆసక్తికరంగా మారింది.



# సీఎస్కే ఓటమికి చేతబడి కారణం


- **సోషల్ మీడియా ఫేక్ లెటర్ వైరల్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ 2026లో సీఎస్కే-సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్ అనంతరం సోషల్ మీడియాలో విచిత్రమైన ప్రచారం మొదలైంది. సీఎస్కే ఓటమికి "చేతబడి" కారణమంటూ ఒక నకిలీ లెటర్ వైరల్ కావడం హాట్ టాపిక్‌గా మారింది. ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ జరుగుతుండగా, గ్యాలరీలో ఓ అభిమాని నిమ్మకాయతో ఏదో చేస్తూ కనిపించాడు. అదే సమయంలో శివమ్ దూబే ఔటవ్వడం యాదృచ్ఛికంగా జరిగినా, నెటిజన్లు దీన్ని సరదాగా "చేతబడి"గా చూపిస్తూ మీమ్స్‌తో వైరల్ చేశారు.
ఈ సరదా చర్చ మధ్యలో కొందరు సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ పేరుతో బీసీసీఐకి ఫిర్యాదు చేసినట్లు ఫేక్ లెటర్ రూపొందించారు. అందులో సన్‌రైజర్స్ అభిమానులు క్షుద్ర పూజలు చేయడంతో ప్లేయర్లు ఫామ్ కోల్పోయారని పేర్కొన్నారు. అయితే ఫ్యాక్ట్ చెక్‌లో ఇది పూర్తిగా నకిలీదని తేలింది. సీఎస్కే లేదా బీసీసీఐ నుంచి ఇలాంటి ఫిర్యాదు ఏదీ జరగలేదని స్పష్టం అయ్యింది. ఇటీవల బెంగళూరు ఘటనలో సీఎస్కే చేసిన అసలు ఫిర్యాదు కారణంగా, ఈ నకిలీ లెటర్‌ను చాలా మంది నిజమని భావించారు. కానీ మ్యాచ్ ఫలితాలు కేవలం ఆటగాళ్ల ప్రదర్శనపై ఆధారపడి ఉంటాయని, ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# అగార్కర్‌కు గుడ్‌న్యూస్

- **చీఫ్ సెలెక్టర్‌గా పదవీకాలం పొడిగింపు**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
బీసీసీఐ సీనియర్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్‌కు శుభవార్త అందింది. ఆయన పదవీకాలాన్ని బోర్డు మరో ఏడాది పాటు పొడిగించాలని నిర్ణయించింది. ఈ ఏడాది జూన్‌తో ముగియాల్సిన ఆయన టర్మ్‌ను 2027 జూన్ వరకు కొనసాగించనున్నారు. రాబోయే ప్రధాన టోర్నమెంట్లను దృష్టిలో ఉంచుకుని ఎంపిక వ్యవస్థలో మార్పులు చేయకుండా స్థిరత్వాన్ని కొనసాగించాలని బీసీసీఐ భావిస్తోంది. అగార్కర్ నేతృత్వంలో టీమిండియా గ్లోబల్ స్థాయిలో బలమైన జట్టుగా ఎదిగిన నేపథ్యంలో, ఆయన సేవలను కొనసాగించాలనే నిర్ణయానికి వచ్చింది. ఆయన హయాంలో భారత్ మూడు ఐసీసీ ట్రోఫీలు గెలుచుకోవడం, జట్టులో మార్పులు సజావుగా అమలవడం కీలకంగా మారాయి. యువ ఆటగాళ్లను ముందుకు తీసుకురావడం, కీలక నిర్ణయాలు తీసుకోవడంలో అగార్కర్ పాత్ర ప్రశంసనీయంగా నిలిచింది. ఇక రాబోయే వన్డే ప్రపంచకప్ నేపథ్యంలో సెలెక్షన్ కమిటీలో స్థిరత్వం చాలా ముఖ్యమని బోర్డు భావిస్తోంది. సీనియర్ ఆటగాళ్ల రిటైర్మెంట్లు, కొత్త నాయకత్వ మార్పుల మధ్య అగార్కర్ తీసుకున్న నిర్ణయాలు జట్టుకు ఉపయోగపడ్డాయని విశ్లేషకులు చెబుతున్నారు



# అయ్యర్ ధైర్యమే పంజాబ్ బలం

- **టైటిల్ రేసులో జట్టు దూసుకుపోతుందా?**



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ 2026లో శ్రేయస్ అయ్యర్ అద్భుత ఫామ్‌లో కొనసాగుతూ పంజాబ్ కింగ్స్‌కు కొత్త ఊపు తీసుకొచ్చాడు. అతని కెప్టెన్సీలో జట్టు సమైక్యంగా, ఆత్మవిశ్వాసంతో ఆడుతూ టైటిల్ రేసులో బలమైన పోటీదారుగా మారింది. ఒకప్పుడు నిలకడలేని జట్టుగా ఉన్న పంజాబ్, ఇప్పుడు పూర్తి స్థాయి యూనిట్‌గా కనిపిస్తోంది. 'అసాధ్యం' అనే పదం తనకు ఇష్టం లేదని అయ్యర్ స్పష్టం చేశాడు. ఒత్తిడిలో కూడా భావోద్వేగాలను అదుపులో ఉంచుకుంటే సరైన నిర్ణయాలు తీసుకోవచ్చని, చివరి బంతి వరకు మ్యాచ్ ముగిసిపోదని అతను తెలిపాడు. గెలుపే తన లక్ష్యమని చెప్పిన అయ్యర్, కీలక సమయాల్లో బాధ్యత తీసుకుని జట్టును విజయాల దిశగా నడిపిస్తున్నాడు. పంజాబ్ విజయాల్లో హెడ్ కోచ్ రికీ పాంటింగ్ పాత్ర కూడా కీలకంగా మారింది. అయ్యర్ నాయకత్వం, పాంటింగ్ వ్యూహాలు కలిసి జట్టులో ధైర్యాన్ని నింపాయి. నిర్భయంగా ఆడే తత్వాన్ని అలవాటు చేయడంతో ఆటగాళ్లు మరింత స్వేచ్ఛగా ప్రదర్శన ఇస్తున్నారు. అయితే ప్రారంభ విజయాలతో ఉత్సాహంగా ఉన్నప్పటికీ, ముందు ఉన్న సవాళ్లపై అయ్యర్ అప్రమత్తంగా ఉన్నాడు. ఇప్పటివరకు టైటిల్ గెలవని జట్లలో పంజాబ్ కూడా ఉండటంతో, ఈ సీజన్‌లో ఆ లోటును తీర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.



# ఐపీఎల్‌లో కొత్త కింగ్ ఎవరు?

- **కోహ్లీని దాటేసిన పంజాబ్ ప్లేయర్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ అంటేనే విరాట్ కోహ్లీ రికార్డులు గుర్తుకు వస్తాయి. అత్యధిక పరుగులు, సెంచరీల పరంగా కోహ్లీ అగ్రస్థానంలో ఉన్నా, తాజాగా వెలువడిన గణాంకాలు మాత్రం కొత్త చర్చకు దారితీశాయి. 2026 సీజన్ నాటికి ఐపీఎల్‌లో అత్యంత నిలకడైన బ్యాటర్‌గా కేఎల్ రాహుల్ ముందంజలో నిలిచాడు. కనీసం 50 ఇన్నింగ్స్‌లు ఆడిన ఆటగాళ్లలో రాహుల్ 45.67 సగటుతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అతని తర్వాత హెన్రిచ్ క్లాసెన్ (40.57), డేవిడ్ వార్నర్ (40.52), శుభ్‌మన్ గిల్ (40.36), రుతురాజ్ గైక్వాడ్ (39.95) నిలిచారు. విరాట్ కోహ్లీ మాత్రం 39.76 సగటుతో ఆరో స్థానానికి పరిమితమయ్యాడు. 2013లో ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన రాహుల్, వివిధ జట్ల తరఫున రాణిస్తూ స్థిరమైన ప్రదర్శనతో గుర్తింపు పొందాడు. 140 ఇన్నింగ్స్‌లలో 5,300కు పైగా పరుగులు సాధించిన అతడు, ఐదు శతకాలు, 40కిపైగా అర్ధ సెంచరీలు నమోదు చేశాడు. 2018లో పంజాబ్ తరఫున ఆడుతూ 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసి ప్రత్యేక రికార్డు సృష్టించాడు. ఏడు సీజన్లలో 500కిపైగా పరుగులు సాధించడం, 2020లో 670 పరుగులతో ఆరెంజ్ క్యాప్ గెలుచుకోవడం రాహుల్ కెరీర్‌లో ముఖ్య ఘట్టాలు. ఇటీవల 150 మ్యాచ్‌ల మైలురాయిని కూడా చేరుకున్న అతడు, ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత కన్సిస్టెంట్ బ్యాటర్లలో ఒకడిగా నిలిచాడు.



# ఆర్సీబీ ఓటమికి గ్రీన్ జెర్సీ కారణమా?

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఓటమి చవిచూడగానే గ్రీన్ జెర్సీపై మళ్లీ చర్చ మొదలైంది. పర్యావరణ పరిరక్షణ సందేశంతో ప్రతి సీజన్‌లో ఒక మ్యాచ్‌ను ఈ జెర్సీలో ఆడుతున్న ఆర్సీబీకి, ఫలితాలు మాత్రం అనుకూలంగా రావడం లేదు. గత గణాంకాలు చూస్తే గ్రీన్ జెర్సీలో ఆడిన మ్యాచ్‌లలో ఎక్కువగా పరాజయాలే నమోదయ్యాయి. 2011 నుంచి ఇప్పటివరకు ఆడిన మ్యాచ్‌లలో గెలుపుల కంటే ఓటములే అధికం. దీంతో అభిమానులు దీనిని చెడు సెంటిమెంట్‌గా భావిస్తున్నారు. అయితే నిపుణుల అభిప్రాయం మాత్రం వేరుగా ఉంది. జెర్సీ రంగు కాకుండా, జట్టు ప్రదర్శన, వ్యూహాలు, మ్యాచ్ పరిస్థితులే ఫలితాన్ని నిర్ణయిస్తాయని చెబుతున్నారు. అయినప్పటికీ, గ్రీన్ జెర్సీతో వచ్చే ప్రతి ఓటమి ఈ చర్చను మళ్లీ తెరపైకి తీసుకువస్తోంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
20.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఈత పండ్లు :**

కొలెస్ట్రాల్ నియంత్రణలో సహాయపడుతుంది

చెడు కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహకరిస్తుంది

గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది





## పవన్ కళ్యాణ్ ఆరోగ్యంపై మెగా అప్‌డేట్

**ముద్ర, సినిమా డెస్క్:**

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై మెగాస్టార్ చిరంజీవి కీలక సమాచారం వెల్లడించారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న పవన్ కళ్యాణ్ పరిస్థితిపై అభిమానుల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఆయన ఇచ్చిన అప్‌డేట్ సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చనీయాంశమైంది. శుక్రవారం అధికారులతో జరిగిన సమావేశంలో పాల్గొన్న సమయంలో పవన్ కళ్యాణ్ అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే స్పందించిన సిబ్బంది ఆయన్ను ఆసుపత్రికి తరలించగా, వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం శనివారం సాయంత్రం శస్త్రచికిత్స నిర్వహించగా, ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ వార్త బయటకు వచ్చిన వెంటనే రాజకీయ, సినీ వర్గాల్లో ఆందోళన వ్యక్తమైంది. అభిమానులు, జనసైనికులు ఆయన ఆరోగ్యంపై తీవ్రంగా చింతించారు. ఈ నేపథ్యంలో చిరంజీవి సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ స్పష్టత ఇచ్చారు. పవన్ కళ్యాణ్‌కు జరిగిన వైద్య ప్రక్రియ విజయవంతంగా పూర్తైందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉందని తెలిపారు. త్వరితగతిన కోలుకుంటున్నారని, సాధారణ కార్యకలాపాల్లోకి రావడానికి సుమారు వారం రోజులు పట్టవచ్చని వైద్యులు సూచించినట్లు చెప్పారు. కాబట్టి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అభిమానులకు భరోసా ఇచ్చారు. అదేవిధంగా, పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ చిరంజీవి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో ప్రజల్లోకి తిరిగి వస్తారని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ‘వాల్మీకి రామాయణం’కు ఇళయరాజా సంగీతం

- **ఆధ్యాత్మిక స్పర్శతో భారీ ప్రాజెక్ట్**



**ముద్ర, సినిమా డెస్క్:**

అమోఘమైన స్వరాలతో తరతరాలను అలరించిన ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా, మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌కు సిద్ధమయ్యారు. బాలీవుడ్‌లో రూపొందుతున్న భారీ చిత్రం ‘వాల్మీకి రామాయణం’కు ఆయన సంగీతాన్ని అందించనున్నారు. ఈ విషయాన్ని స్వయంగా ఆయన సోషల్ మీడియా ద్వారా వెల్లడిస్తూ, ఇది తనకు ఎంతో ప్రత్యేకమైన ఆధ్యాత్మిక అనుభవమని తెలిపారు. సంగీతాన్ని భగవంతుడికి సమర్పించే నైవేద్యంగా భావిస్తున్నానని ఆయన వ్యాఖ్యానించారు. రామాయణం వంటి మహత్తర ఇతిహాసానికి ఇళయరాజా స్వరాలు జోడవడం సంగీత ప్రేమికులకు ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగిస్తోంది. ఆయన అందించే నేపథ్య సంగీతం ఈ చిత్రాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ చిత్రాన్ని దర్శకురాలు భావనా తల్వార్ అత్యంత నిబద్ధతతో తెరకెక్కిస్తున్నారు. వాల్మీకి మహర్షి రచించిన అసలు రామాయణాన్ని ఆధారంగా చేసుకుని, ఎటువంటి మార్పులు చేయకుండా నిజస్వరూపానికి దగ్గరగా ఈ సినిమాను రూపొందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. ప్రతి ఘట్టాన్ని సహజంగా, స్పష్టంగా చూపించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇప్పటి కాలంలో పౌరాణిక కథలను కమర్షియల్ హంగులతో మార్చడం సాధారణంగా మారుతున్న వేళ, ఈ చిత్రం మాత్రం మూల కథకు కట్టుబడి ఉండటం ప్రత్యేకతగా నిలుస్తోంది. 2026 అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దేశవ్యాప్తంగా పలు రామాయణ ప్రాజెక్టులు రూపొందుతున్నప్పటికీ, ఇళయరాజా సంగీతం మరియు ఒరిజినల్ కథనం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని తెరపై చూడటానికి రామభక్తులు, సంగీతాభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## భయానికి కొత్త నిర్వచనం ‘418’

- **హారర్ జోనర్‌లో మైత్రీ మూవీ మేకర్స్ ప్రయోగం**

**ముద్ర, సినిమా డెస్క్:**




కమర్షియల్ ఎంటర్‌టైనర్లతో టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసుకున్న మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఇప్పుడు కొత్త దారిని ఎంచుకుంది. తొలిసారి పూర్తి స్థాయి హారర్ కథాంశంతో ‘418’ అనే చిత్రాన్ని తెరకెక్కిస్తూ ప్రేక్షకులను భయపెట్టేందుకు సిద్ధమవుతోంది. కెజిఎఫ్‌తో గుర్తింపు పొందిన ప్రశాంత్ నీల్ సమర్పణలో, కీర్తన్ నాదగౌడ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. తాజాగా విడుదలైన టైటిల్ పోస్టర్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ఈ చిత్రానికి ఇచ్చిన ట్యాగ్‌లైన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేస్తోంది. “హారర్ సినిమాల్లో నవ్వులు చాలాయి.. ఇక భయం మొదలవ్వాలి” అనే భావంతో వచ్చిన ఈ క్యాప్షన్, ఈ సినిమా ఏ దిశలో సాగబోతోందో స్పష్టంగా చెబుతోంది. ఇటీవల హారర్ సినిమాల్లో కామెడీ మోతాదు పెరగడంతో భయం తగ్గిపోయిందనే అభిప్రాయాల మధ్య, ఈ సినిమా మాత్రం నిజమైన హారర్ అనుభూతిని అందించాలనే లక్ష్యంతో రూపొందుతున్నట్టు తెలుస్తోంది. పోస్టర్‌లో రక్తపు మరకలతో ఉన్న తలుపు, దానిపై ‘418’ అనే సంఖ్య కనిపించడం కథపై ఆసక్తిని పెంచుతోంది. దీన్ని బట్టి కథ ఒక రహస్య గది చుట్టూ తిరిగే సైకాలజికల్ హారర్‌గా ఉండొచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చిత్రంలో సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రశాంత్ నీల్ ఈ ప్రాజెక్ట్‌ను సమర్పించడం వల్ల సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఆయన సినిమాల్లో కనిపించే డార్క్ మూడ్ ఈ చిత్రంలో కూడా ఉంటే, ప్రేక్షకులకు థియేటర్లలో నిజమైన భయానుభూతి కలిగే అవకాశం ఉందని సినీ అభిమానులు ఆశిస్తున్నారు.



## రెండో బిడ్డకు స్వాగతం.

- **దీపికా–రణ్‌వీర్ సర్‌ప్రైజ్ అనౌన్స్‌మెంట్ వైరల్**

**ముద్ర, సినిమా డెస్క్:**

బాలీవుడ్ స్టార్ జంట దీపికా పదుకొణె, రణ్‌వీర్ సింగ్ తమ అభిమానులకు అప్రత్యక్షంగా శుభవార్త అందించారు. గతేడాది సెప్టెంబర్‌లో తమ తొలి సంతానం ‘దువా’కు జన్మనిచ్చిన ఈ జంట, మరోసారి తల్లిదండ్రులు కాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ అనౌన్స్‌మెంట్ సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది. సాధారణంగా సెలబ్రిటీలు ప్రెగ్నెన్సీని గ్రాండ్ ఫోటోషూట్‌లతో ప్రకటిస్తుంటారు. అయితే దీపికా మాత్రం భిన్నంగా ప్లాన్ చేసి, ఒక క్యూట్ ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఆ ఫోటోలో చిన్నారి దువా తన చేతిలో పాజిటివ్ ప్రెగ్నెన్సీ టెస్ట్ కిట్ పట్టుకుని కనిపిస్తుంది. పక్కనే దీపికా, రణ్‌వీర్ తమ కూతురి చేతులను ఆప్యాయంగా పట్టుకున్న ఈ విజువల్ అభిమానులను కట్టిపడేస్తోంది. ఈ పోస్ట్‌కు కేవలం ‘నజర్’ ఎమోజీలను మాత్రమే క్యాప్షన్‌గా ఇవ్వడం ప్రత్యేకంగా నిలిచింది. ఈ వార్త బయటకు వచ్చిన వెంటనే సినీ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. సమంత, పరిణీతి చోప్రా వంటి నటీమణులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ స్పందించగా, మెగాస్టార్ చిరంజీవి సహా పలువురు టాలీవుడ్ ప్రముఖులు కూడా ఈ జంటకు అభినందనలు తెలిపారు. దువా త్వరలోనే పెద్దక్క అవుతుందని అభిమానులు కామెంట్లతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక రెండో గర్భధారణ నేపథ్యంలో దీపికా తన కెరీర్ ప్లానింగ్‌లో మార్పులు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. కొన్ని భారీ ప్రాజెక్టుల నుంచి తప్పుకున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి.


## హోంబలే నుంచి మరో భారీ యానిమేటెడ్ ఎపిక్

- **‘మహావతార్ పరశురామ్’ అనౌన్స్‌మెంట్..**

**ముద్ర, సినిమా డెస్క్:**



భారీ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన హోంబలే ఫిల్మ్స్ మరో పవర్‌ఫుల్ అప్‌డేట్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. గతంలో విడుదలైన ‘మహావతార్: నరసింహ’ ఘన విజయం సాధించిన తర్వాత, అదే ఫ్రాంచైజీలో భాగంగా రెండో చిత్రం ‘మహావతార్ పరశురామ్’ టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. హోంబలే ఫిల్మ్స్, క్లీమ్ ప్రొడక్షన్స్ కలిసి శ్రీమహావిష్ణువు దశావతారాల ఆధారంగా ఏడు చిత్రాలను రూపొందిస్తున్న విషయం తెలిసిందే. 2025లో ‘నరసింహ’తో ప్రారంభమైన ఈ ప్రయాణం, ఇప్పుడు పరశురాముడి అవతారంతో కొనసాగుతోంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను 2027 డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ప్రకటన సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. “ధర్మం క్షీణించినప్పుడు పరశు లేస్తుంది” అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పరశురాముడి శక్తివంతమైన రూపాన్ని ప్రతిబింబించేలా దీన్ని డిజైన్ చేసినట్టు తెలుస్తోంది. దర్శకుడు అశ్విన్ కుమార్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రభావవంతంగా తెరకెక్కిస్తున్నారు. కేవలం పిల్లలకే కాకుండా, అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకునేలా అంతర్జాతీయ స్థాయి విజువల్స్‌తో రూపొందిస్తున్నారు. ప్రస్తుతం హోంబలే ఫిల్మ్స్ చేతిలో ‘కాంతార: చాప్టర్ 1’, ‘సలార్ 2’ వంటి భారీ ప్రాజెక్టులు ఉన్నప్పటికీ, ఇలాంటి పౌరాణిక యానిమేషన్ సినిమాలను కూడా సమాంతరంగా తీసుకురావడం విశేషం. ఈ చిత్రానికి సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తుండగా, ‘మహావతార్ పరశురామ్’ కూడా ప్రేక్షకులకు విజువల్ వండర్‌గా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



## చియాన్ 63... స్ట్రాంగ్ కమ్ బ్యాక్ ఇచ్చేనా?

**ముద్ర, సినిమా డెస్క్:**

తన ప్రత్యేకమైన నటన, విభిన్న కథల ఎంపికతో గుర్తింపు పొందిన విక్రమ్, ఇటీవలి కాలంలో మాత్రం భారీ విజయాన్ని అందుకోలేకపోతున్నారు. విమర్శకుల ప్రశంసలు దక్కుతున్నా, బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలు రావడం లేదు. దీంతో అభిమానులు ఆయన నుంచి ఒక గట్టి కంబ్యాక్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ‘చియాన్ 63’పై ఆసక్తి పెరిగింది. పలువురు దర్శకుల పేర్లు వినిపించిన తర్వాత, చివరకు ఆనంద్ శంకర్ ఈ ప్రాజెక్ట్‌ను డైరెక్ట్ చేసే అవకాశాన్ని దక్కించుకున్నట్లు సమాచారం. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమా మంచి గుర్తింపు తెచ్చుకోవడంతో, ఈసారి కూడా అదే మ్యాజిక్ రిపీట్ అవుతుందా అన్న చర్చ జరుగుతోంది. ఇక విక్రమ్ తన ఫిట్‌నెస్, డెడికేషన్ విషయంలో మాత్రం ఎక్కడా తగ్గడం లేదు. వయసుతో సంబంధం లేకుండా కష్టపడుతూ, మరోసారి తన స్థాయిని నిరూపించుకోవాలని చూస్తున్నారు. ‘చియాన్ 63’తో ఆయనకు కావాల్సిన సక్సెస్ దక్కుతుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.



## సబ్‌స్క్రిప్షన్‌పై అనన్య నాగళ్ల క్లారిటీ

**ముద్ర, సినిమా డెస్క్:**

సినిమా, టెలివిజన్ పరిమితులను దాటి ఆదాయం కోసం కొత్త మార్గాలను అన్వేషిస్తున్న నటీమణులు ఇప్పుడు సోషల్ మీడియాను ప్రధాన వేదికగా మార్చుకుంటున్నారు. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రారంభమైన ‘సబ్‌స్క్రిప్షన్’ ట్రెండ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ జాబితాలో తాజాగా యంగ్ హీరోయిన్ అనన్య నాగళ్ల కూడా చేరడం హాట్ టాపిక్‌గా నిలిచింది. ఇప్పటికే యాంకర్ విష్ణు ప్రియ సబ్‌స్క్రిప్షన్ వ్యవహారం చర్చల్లో ఉండగా, అనన్య కూడా అదే మార్గాన్ని ఎంచుకోవడం మరింత ఆసక్తి రేకెత్తించింది. అయితే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణాలను ఆమె తాజాగా వెల్లడించింది. సబ్‌స్క్రిప్షన్ ప్లాట్‌ఫామ్‌లో షేర్ చేసిన మెడిటేషన్ వీడియోతో పాటు ఒక వివరణాత్మక వీడియోను విడుదల చేసిన అనన్య, తన ఉద్దేశాన్ని స్పష్టంగా చెప్పింది. అభిమానులతో నిరంతరం కనెక్ట్‌లో ఉండడం, వారితో కలిసి ఎదగడం తన లక్ష్యమని తెలిపింది. తనకు ఉపయోగపడిన అనుభవాలు, ప్రతిరోజూ పాటించే అలవాట్లు ఫాలోవర్లతో పంచుకోవాలని, అలాగే వారినుంచి కూడా కొత్త విషయాలు నేర్చుకోవాలని భావించానని వివరించింది. ఇక సమాజానికి కూడా ప్రతి నెల కొంత సహాయం చేయాలనే ఉద్దేశంతో ఈ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభించానని ఆమె చెప్పుకొచ్చింది. గత కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగాలేకపోవడంతో అభిమానులతో మాట్లాడలేకపోయానని, తాజాగా షేర్ చేసిన మెడిటేషన్ వీడియో తన రోజువారీ జీవితంలో భాగమని వెల్లడించింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అనన్య నిర్ణయానికి కొందరు నెటిజన్లు మద్దతు తెలుపుతున్నారు. ఆమె సహాయక స్వభావాన్ని గుర్తుచేస్తూ, ఈ ప్రయత్నాన్ని అభినందిస్తున్నారు.

## నీలి చీరలో నిధి అగర్వాల్ మెరిసిన అందం

**ముద్ర, సినిమా డెస్క్:**

టాలీవుడ్‌లో గ్లామర్ హీరోయిన్‌గా ప్రత్యేక స్థానం సంపాదించిన నిధి అగర్వాల్, తన స్టైల్‌తో ఎప్పటికప్పుడు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అందం, ఆకర్షణీయమైన లుక్స్‌తో సోషల్ మీడియాలో కూడా ఆమెకు మంచి ఫాలోయింగ్ ఉంది. ఇటీవల ఆమె షేర్ చేసిన తాజా ఫోటోలు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి. నీలి చీరలో సంప్రదాయంగా కనిపిస్తూ కూడా తన గ్లామర్‌ను చక్కగా హైలైట్ చేసింది. ఆ ఫోటోలు చూసిన అభిమానులు ఆమె అందాన్ని ప్రశంసిస్తూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. ఈ ఫోటోషూట్ ద్వారా మరోసారి అందరి దృష్టిని తనవైపు తిప్పుకున్న నిధి, సంప్రదాయం, మోడ్రన్ లుక్‌ను సమతూకంగా మేళవిస్తూ తన ప్రత్యేకతను మరోసారి నిరూపించింది.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com